ESTD: 1999

www.voodayam.com

# వుదయం

ఆదిలాబాద్ 18-09-2026 శుక్రవారం | సంపుటి : 14 | సంచిక :10 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

Follow us on










# విజన్ 2047

### సామాజిక న్యాయం, ఆర్థిక పురోగతితో ప్రపంచంతో పోటీపడుతున్న తెలంగాణ

### ప్రజా సంక్షేమమే పరమావధి - ఆధునిక తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

### పోరాటాల స్ఫూర్తితో ప్రజా పాలన



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (వుదయం) :** తెలంగాణ నేల అస్తిత్వం, ఆత్మగౌరవం, స్వేచ్ఛాయుత హక్కుల కోసం అకుంటిత దీక్షతో పోరాడిన అమరవీరుల త్యాగాల పునాదులపైనే నేటి ప్రజా పాలన కొనసాగుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17 చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాచరికపు వెట్టిచాకిరి, అణిచివేతల నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థ వైపు అడుగులు వేసిన ఈ రోజు మన బాధ్యతను గుర్తుచేసే నిదర్శనమని పేర్కొన్నారు. సమ్మక్కసారలమ్మల సాయుధ పోరాటం నుండి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు అన్యాయాన్ని ఎదిరించడమే ఈ గడ్డ నైజమని కొనియాడారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం భారత యూనియన్‌లో విలీనమవ్వడం కేవలం ఒక పాలన ముగింపు కాదని, ప్రజలే కేంద్రంగా సాగే ప్రజాస్వామ్య పర్వానికి నాంది అని ఉద్ఘాటించారు. ఆనాటి మహనీయుల పోరాట స్ఫూర్తితోనే నేడు ప్రతి ఒక్కరి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, సంక్షేమం మరియు అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు.

రాష్ట్ర ఆర్థిక పరిపుష్టిని వివరిస్తూ, తెలంగాణ తలసరి ఆదాయం రూ. 4,18,931కి చేరి దేశ సగటు కంటే 91 శాతం అధికంగా నిలిచిందని ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని నిలబెట్టేందుకు రూ. 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తూ రూ. 20,616 కోట్లను విడుదల చేశామని, రైతు భరోసా మరియు వరి ధాన్యానికి రూ. 500 బోనస్ అందించడం ద్వారా తెలంగాణను ధాన్య భాండాగారంగా తీర్చిదిద్దామని తెలిపారు. మహిళాభ్యుదయమే ధ్యేయంగా మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ మరియు స్వయం సహాయక సంఘాలకు బ్యాంకింగ్ ప్రోత్సాహకాలు అందిస్తూ వారిని ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేస్తున్నట్లు చెప్పారు. నిరుపేద కుటుంబాలకు అండగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సన్న బియ్యం పంపిణీ, సామాజిక భద్రతా పింఛన్ల విస్తరణ వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు.

సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ కుల సర్వే ఆధారంగా స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో వెనుకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించడంతో పాటు, సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణను అమలు చేశామని గుర్తుచేశారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుతో పాటు విదేశీ విశ్వవిద్యాలయాల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌కు రప్పిస్తున్నట్లు వివరించారు. గోషామహల్‌లో నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంపుదల వంటి చర్యలతో సామాన్యుడికి కార్పొరేట్ వైద్యం చేరువైందన్నారు. 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా సాంకేతిక నైపుణ్యాల పెంపుతో యువతను ప్రపంచస్థాయి పోటీకి సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

రాబోయే రోజుల్లో తెలంగాణను ప్రపంచ శ్రేణి రాష్ట్రంగా నిలబెట్టేందుకు 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' ప్రణాళికను ఆవిష్కరించినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే కాకుండా, దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యమని స్పష్టం చేశారు. 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో రూ. 70 వేల కోట్లతో టీసీఎస్ అతిపెద్ద ఏఐ డేటా సెంటర్, అమెజాన్ రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో ముందంజలో ఉన్నాయని వివరించారు. మెట్రో రెండో దశ విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, పారిశ్రామిక కారిడార్లు, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులతో పాటు ఈగల్, టీజీ సేఫ్ వంటి వ్యవస్థల ద్వారా డ్రగ్స్ రహిత, సురక్షిత తెలంగాణను నిర్మిస్తామని పునరుద్ఘాటించారు. ఈ పోరాట స్ఫూర్తితో నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల భాగస్వామ్యంతో భావి తరాల కోసం ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని పిలుపునిచ్చారు.

# జనసేవే లక్ష్యంగా



# 'సేవా సంకల్ప అభియాన్'

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 (ఎంఎస్) :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితం, దేశ సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ వ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప అభియాన్' పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ 17న ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రారంభమయ్యే ఈ సేవా కార్యక్రమాలు, అక్టోబర్ వరకు కొనసాగనున్నాయి.

**25 ఏళ్ల సేవలకు గుర్తుగా నెల రోజుల ప్రచారం**

ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమంపై బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ న్యూఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ప్రధాని మోదీ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో ఆయన ప్రజాసేవా ప్రస్థానం ప్రారంభమైందని తెలిపారు. గత పాతికేళ్లుగా ప్రజలకు, దేశానికి నిరంతర సేవ చేయడమే ధ్యేయంగా ఆయన పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రధాని జన్మదినాన్ని ప్రతి ఏటా 'సేవా దివస్'గా నిర్వహించడం ఆనవాయితీ అని, ఈసారి పాతికేళ్ల సేవలను పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప అభియాన్' పేరుతో విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రకటించారు.

**సమాజంలోకి సేవా దృక్పథం**

ప్రధాని మోదీ గత 25 ఏళ్లలో చేపట్టిన సేవా కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, దేశాభివృద్ధి కృషిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే ఈ అభియాన్ ప్రధాన లక్ష్యమని పార్టీ అధిపతి పేర్కొన్నారు. ప్రధాని సుదీర్ఘ ప్రస్థానాన్ని కేవలం రాజకీయ విజయాలుగా కాకుండా, దేశ ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనంగా చూడాలని పిలుపునిచ్చారు. ఈ మహా క్రతువులో పార్టీ కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

**ఉజ్జయినిలో ఘనంగా శ్రీకారం**

మహాకాళేశ్వరుని దివ్య క్షేత్రమైన ఉజ్జయిని వేదికగా బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ ఈ నెల రోజుల ప్రచారాన్ని అధికారికంగా ప్రారంభించారు. మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు హేమంత్ ఖండేల్‌వాల్‌లతో కలిసి ఆయన ఈ సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా సాగే ఈ ప్రచారంలో భాగంగా నెల రోజుల పాటు అనేక ప్రజా సంక్షేమ, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## డిజిటల్ చెల్లింపుల రుసుములతో

# చిన్న వ్యాపారులకు తీరని నష్టం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 (ఎంఎస్) :** డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ అయిన యూపీఐ వ్యాపార లావాదేవీలపై రుసుములు విధించాలనే పార్లమెంటరీ ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘం సిఫార్సులపై కాంగ్రెస్ ఎంపీలు మౌనం వహించారంటూ వస్తున్న వార్తలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. సదరు కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యుడు గౌరవ్ గొగొయ్ స్పష్టం చేశారు. స్థాయీ సంఘం సమావేశం జరిగిన సమయంలో ఈ ప్రత్యేక రుసుముల ప్రతిపాదనలపై ఎటువంటి నిర్దిష్టమైన లేదా సమగ్రమైన చర్చ జరగలేదని ఆయన తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని చూస్తున్న ఈ రుసుముల విధానంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోందని, దీనిపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు.

సామాజిక మాధ్యమం వేదికగా గౌరవ్ గొగొయ్ మాట్లాడుతూ, పార్లమెంటరీ కమిటీ భేటీలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతినిధుల వద్ద వ్యాపార మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) ఛార్జీలకు సంబంధించి స్పష్టమైన విధాన పత్రం కానీ, ప్రతిపాదనలు కానీ లేవని తెలిపారు. ఈ తరహా రుసుముల అవసరం ఏమొచ్చిందని తాము ప్రశ్నించినప్పుడు ప్రభుత్వ అధికారుల నుంచి ఎలాంటి సరైన సమాధానం రాలేదని వెల్లడించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఈ తరహా డిజిటల్ పన్నుల విధానం వల్ల దేశంలోని చిన్న తరహా వ్యాపారులు, వీధి విక్రేతలు తీవ్రంగా నష్టపోతారని, విదేశీ దిగ్గజ కంపెనీలకు మాత్రమే లబ్ధి చేకూరుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ ఒత్తిళ్లకు తలొగ్గకుండా, సామాన్యులకు భారం మోపే ఈ చెల్లింపుల రుసుముల ఆలోచనను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆగస్టు 12న జరిగిన పార్లమెంటరీ కమిటీ సమావేశానికి కాంగ్రెస్ ఎంపీలు పి. చిదంబరం, మనీశ్ తివారీ, కిశోరీ లాల్, కె. గోపీనాథ్‌లతో పాటు గౌరవ్ గొగొయ్ హాజరయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రతినిధులు ఛార్జీల ప్రతిపాదనను వ్యతిరేకించలేదని వార్తా కథనాలు వెలువడటంతో రాజకీయం వేడెక్కింది.

## ఆస్తుల విచారణకు మేం సిద్ధం...

# రేవంత్ రెడ్డి సిద్ధమా?

### కేసీఆర్‌పై అసత్య ప్రచారాలకు రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

### బాధితుల పక్షానే పోరాటం...

### ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పై ఆరోపణల పేరుతో అసత్య ప్రచారాలకు ఒడిగడుతున్నారంటూ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ గతంలో చేసిన వ్యాఖ్యలు అబద్ధాలని, ఆయనకు కేవలం అరవై ఏడు ఎకరాల భూమి మాత్రమే ఉందనే నిజాన్ని స్వయంగా శాసనసభ వేదికగానే ముఖ్యమంత్రి అంగీకరించారని గుర్తుచేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన పత్రికేయుల సమావేశంలో మాట్లాడిన ఆయన, ఇన్ని రోజులుగా ప్రజలను తప్పుదోవ పట్టించేలా దుష్ప్రచారం చేసినందుకు గాను రేవంత్ రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబానికి సంబంధించి కేసీఆర్ జన్మించినప్పటి నుండి ఉన్న ఆస్తుల వివరాలపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని స్పష్టం చేస్తూ, ఇదే సవాలును స్వీకరించి ముఖ్యమంత్రి తన ఆస్తుల చిట్టాపై విచారణకు సిద్ధపడగలరా అని నిలదీశారు.

వ్యవసాయంపై ఉన్న ప్రత్యేక అభిమానంతోనే కేసీఆర్ శాసనబద్ధంగా భూములను కొనుగోలు చేసి సాగు చేస్తున్నారని, అంతే తప్ప భూములను వ్యాపార ప్రయోజనాల కోసం ఆటవస్తువుగా మార్చలేదని విమర్శించారు. అసత్యారోపణలు చేయబోయి రేవంత్ రెడ్డి స్వయంగా తానే చిక్కుల్లో పడ్డారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ తండ్రి కాలం నాటికే వందల ఎకరాల ఆస్తిపాస్తులు ఉండేవని, నాటి రోజుల్లోనే రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తమ స్వగ్రామమైన చింతమడకలోని నివాసాన్ని ప్రభుత్వ పాఠశాల నిర్వహణ కోసం సమాజానికి అందజేసిన ఘనత తమ కుటుంబానిదని గుర్తుచేశారు. ప్రభుత్వంపై ఎంతటి వేధింపులకు పాల్పడినా వెనకడుగు వేసేది లేదని, ఇరవై రెండుఏ భూ బాధితుల వైపే తమ పార్టీ నిలబడుతుందని స్పష్టం చేశారు. పాలకులు చేసే ప్రతి తప్పిదాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లి ఎండగడతామని పట్టుబట్టారు.

## ఢిల్లీ తెలంగాణ భవన్‌లో ఘనంగా


# ప్రజాపాలన దినోత్సవం





**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి):** ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గురువారం 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం' వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భవన్ రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ శశాంక్ గోయెల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అంతకుముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక కార్యదర్శి (సమన్వయ) అద్వైత్ కుమార్ సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంతే కదా...!




# భారత ఎగుమతులపై పన్నుల ముప్పు

**వాషింగ్టన్ :** అమెరికా నుంచి భారత వాణిజ్య రంగానికి భారీ సుంకాల రూపంలో సరికొత్త చిక్కులు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగిస్తున్న రష్యా ఆర్థిక మూలాలను దెబ్బతీసే లక్ష్యంతో ఆ దేశం నుండి ముడి చమురును దిగుమతి చేసుకునే భారత్, చైనాల వంటి దేశాలపై ఏకంగా నూరు శాతం వరకు అదనపు పన్నులు విధించేందుకు అధ్యక్షుడికి సర్వాధికారాలు కల్పించే రష్యా ఆంక్షల బిల్లుకు అమెరికా ప్రజా ప్రతినిధుల సభ ఆమోదముద్ర వేసింది. రెండు వందల అరవై రెండు ప్రతిగా ఒక వంద యాభై తొమ్మిది ఓట్ల ఆధిక్యంతో ఈ బిల్లు సభలో ఆమోదం పొందింది. ఇదివరకే సెనెట్ ఈ ప్రతిపాదనను ఆమోదించిన దృష్ట్యా, ఇకపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంతకం చేయడమే మిగిలి ఉంది. ఆయన ఆమోదంతో ఇది త్వరలోనే పూర్తి స్థాయి చట్టంగా మారనుంది.

రష్యా, ఇరాన్ దేశాల ఆంక్షల చట్టం రెండు వేల ఇరవై ఆరు పేరుతో తీసుకువచ్చిన ఈ ప్రతిపాదిత బిల్లు ప్రధానంగా రష్యా రక్షణ, ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపేలా రూపొందించబడింది. అంతర్జాతీయ ఆంక్షల కన్నుగప్పి సముద్ర మార్గాల్లో చమురును రవాణా చేసే రహస్య నౌకలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఇరాన్ ఆయుధ సమకూర్పుపై గతంలో విధించిన ఆంక్షలను మరో ఐదేళ్ల పాటు పొడిగించే నిబంధనలు ఇందులో ఉన్నాయి. రష్యా ఇంధన వనరులను అధికంగా కొనుగోలు చేసే దేశాలపై వంద శాతం వరకు అదనపు సుంకాలు వడ్డించే అసాధారణ అధికారాలు ఈ చట్టం ద్వారా అధ్యక్షుడికి లభిస్తాయి. ప్రపంచంలో రష్యా ముడి చమురును అత్యధికంగా కొనుగోలు చేస్తున్న దేశాల్లో చైనా మొదటి స్థానంలో ఉండగా, భారత్ ద్వితీయ స్థానంలో ఉంది.






# ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఆవిష్కరించిన అధికారులు

- **పారదర్శక సేవలకు కృషి**

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 17, వుదయం:** సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల వ్యాప్తంగా గురువారం ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో వినోద్ కుమార్, మండల వనరుల కేంద్రం వద్ద ఎంఈఓ ప్రవీణ్ బాబు, వ్యవసాయ కార్యాలయం ఎదుట ఏఈఓ ప్రశాంత్, ఐకేపీ కార్యాలయం వద్ద ఏపీఎం నర్సమ్మ త్రివర్ణ పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రజాపాలన దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు తమ శాఖ పరంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



- **సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్**

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 17(వుదయం):** విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని కొనాయపల్లి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండల పరిధిలోని కొనాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.
విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభ్యాసానికి పౌష్టికాహారం ఎంతో కీలకమని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన తాగునీరు అందించాలని సూచించారు. భోజనం తయారీలో పరిశుభ్రత పాటిస్తూ, విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందేలా చూడాలని వంట సిబ్బందికి సూచించారు.
విద్యార్థులకు అందుతున్న భోజనం నాణ్యతను తెలుసుకునేందుకు తాము కూడా వారితో కలిసి భోజనం చేసినట్లు సర్పంచ్ తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారుల సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామపంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సునయన రాణి, ఉప సర్పంచ్ శ్యామల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెహరాజ్, వార్డు సభ్యురాలు కలవ అక్షిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ జయంతి సందర్భంగా జెండా ఆవిష్కరణ



**కోహెడ: సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి)**

విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని కోహెడ మండల దుగోడ మిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దుగోడ మిషన్ అసోసియేషన్ అధ్యక్షులు రేవోజు శంకర్ హాజరై జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ నామాన్ని స్మరించుకుంటూ "విశ్వకర్మ లేని విశ్వంబు లేదు" అని గుర్తు చేశారు. విశ్వకర్మ భగవానుడి ఆశీస్సులతో సమాజం సుఖసంతోషాలతో, సిరిసంపదలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రేవోజు రాజమౌళి, లక్ష్మీనారాయణ, గూడూరు రవీంద్రచారి, రేవోజు రవీంద్రచారి, గోపాల్‌చారి, అలువోజు మహేంద్రచారి, వనపర్తి శ్రీనివాస్, సత్యం, రేవోజు మహేంద్రచారి, వెంకటేశ్వరచారి, మధుచారి తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పమధ్యాహ్న భోజనం వికటించి 20 మంది విద్యార్థులు అస్వస్థత

**మునిపల్లి (వుదయం):**

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పెద్దలోడి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించిన ఘటన కలకలం రేపింది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం సుమారు 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. భోజనం వడ్డించిన కొద్దిసేపటికే విద్యార్థులు వాంతులు, కడుపునొప్పి, వికారం వంటి లక్షణాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు స్థానికులు తెలిపారు.విద్యార్థుల పరిస్థితిని గమనించిన ఉపాధ్యాయులు వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించి, వారితో కలిసి బాధిత విద్యార్థులను సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థులు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.ఘటన విషయం తెలిసిన వెంటనే విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాఠశాలకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.



మధ్యాహ్న భోజనంలో ఉపయోగించిన ఆహార నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపినట్లు తెలుస్తోంది. ఆహారం కలుషితమైందా లేదా ఇతర కారణాల వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారా అనే కోణంలో అధికారులు విచారణ చేపట్టారు.ఈ ఘటనతో గ్రామంలో ఆందోళన నెలకొంది. పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మోదీ జన్మదిన వేడుకలు.. జాతీయ జెండా ఆవిష్కరణ

- **సెప్టెంబర్ 17న దేశ ప్రధాని మోదీ జన్మించడం భారతదేశం చేసుకున్న పుణ్యమని చెప్పుకోవచ్చు**

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 17 (వుదయం):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ దౌల్తాబాద్ మండల అధ్యక్షురాలు దేవుడి లావణ్య నరసింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా సత్యనారాయణస్వామి ఆలయంలో ప్రధాని మోదీ పేరున ప్రత్యేక అర్చన, పూజలు నిర్వహించారు. మోదీ ఆయురారోగ్యాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో దేశానికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం జరుపుకోవడం, అదే రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం కావడం ప్రత్యేకమైన విషయమన్నారు. దేశ ప్రధాని మోదీ సెప్టెంబర్ 17న జన్మించడం భారతదేశం చేసుకున్న పుణ్యమని చెప్పుకోవచ్చన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, జాతీయ సమగ్రత కోసం మోదీ చేస్తున్న కృషిని కొనియాడారు.

**విమోచన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ**

అనంతరం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను వివేకానంద చౌరస్తాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి కొకూరి యాదగిరి మండల పార్టీ అధ్యక్షురాలు దేవి లావణ్య నరసింహారెడ్డి, బీజేపీ నాయకులు వేరువేరుగా మాట్లాడుతూ.. నిజాం పాలన నుంచి విముక్తి కల్పించి భారత యూనియన్‌లో విలీనం చేయడంలో అప్పటి దేశ ఉప ప్రధాని, హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయిన చారిత్రక ఘట్టాన్ని ప్రతి ఏటా స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**చారిత్రక ఘట్టాన్ని భావితరాలకు తెలియజేయాలి**



హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి దారితీసిన పరిణామాల్లో సర్దార్ వల్లభభాయ్ పటేల్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు చరిత్రలో ప్రత్యేకంగా నిలిచాయని తెలిపారు. 1948లో చేపట్టిన 'ఆపరేషన్ పోలో' అనంతరం నిజాం పాలన ముగిసి హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయిందన్నారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం జరిగిన ఈ చారిత్రక పరిణామాలను నేటి తరం తెలుసుకోవడంతో పాటు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రామస్థాయిలో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు అందుబాటులో ఉండాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శీల స్వామినాథ్, మండల ఉపాధ్యక్షుడు మిర్యాల రమేష్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి బోరింగ్ శ్రీను, జిల్లా ఓబీసీ కార్యదర్శి పులిగారి స్వామి, మండల కోశాధికారి కిషన్ దాక్టర్, బూత్ అధ్యక్షుడు ముత్యంగారి రాములు, మాజీ జిల్లా కార్యదర్శి కొకూరి యాదగిరి, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీకాంత్, మండల కార్యవర్గ సభ్యుడు మచ్చ శ్రీరాములు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంటల డిజిటల్ నమోదు వేగవంతం చేయాలి

- **ప్రతి రైతు పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి**
- **మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్**

**దౌల్తాబాద్, సెప్టెంబరు 17 (వుదయం):** పంటల డిజిటల్ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి మండలంలోని ప్రతి రైతు సాగు వివరాలను నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ సూచించారు. మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో రైతు పత్తి చేనులో కొనసాగుతున్న పంటల డిజిటల్ సర్వే (డీసీఎస్)ను ఏఈఓ గౌతమి, డీసీఎస్ వాలంటీర్ సుధాకర్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ.. ప్రతి సర్వే నంబరులో సాగు చేస్తున్న పంట వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. పంట నమోదు పూర్తయిన వెంటనే సంబంధిత రైతు చరవాణికి సందేశం వచ్చేలా డిజిటల్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. రైతులు తమ పొలాల్లో సాగు చేస్తున్న పంట వివరాలను డీసీఎస్ వాలంటీర్లకు అందించి



నమోదు చేయించుకోవాలని కోరారు.
వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు పంటల డిజిటల్ నమోదు ఎంతో ముఖ్యమన్నారు. పంట నమోదు లేకపోవడం వల్ల భవిష్యత్తులో రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున ముందుగానే తమ పంట వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు.డీసీఎస్ సర్వే సందర్భంగా రైతులు తమ సర్వే నంబరు, సాగు విస్తీర్ణం, పంట రకం తదితర వివరాలను సిబ్బందికి సక్రమంగా అందించాలని కోరారు. నమోదు చేసిన వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే వ్యవసాయశాఖ సిబ్బంది దృష్టికి తీసుకువచ్చి సరిచేయించుకోవాలని సూచించారు.
మండలంలోని అన్ని గ్రామాల్లో డిజిటల్ పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని, ప్రతి సర్వే నంబరులో సాగు వివరాలు నమోదు అయ్యేలా సిబ్బందికి సూచనలు ఇచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ తెలిపారు. రైతులు వ్యవసాయశాఖ సిబ్బందికి సహకరించి పంటల డిజిటల్ నమోదు పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

# తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ఘనంగా

- **సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ**

సంగారెడ్డి వుదయం : తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17న సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటాలను, తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ప్రజా పాలనలో స్థానిక సంస్థల పాత్ర కీలకమని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మున్సిపల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో ప్రస్తావించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, డి ఈ, రఘు, గౌరవ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించారు.



# స్వచ్ఛతకు శపథం.. గద్వాల్ ఎల్ఐసీలో ప్రతిజ్ఞ

- **చెత్త వేయం.. వేయనివ్వం**
- **ఏడాదికి 100 గంటలు పరిశుభ్రతకు కేటాయిస్తామని ఉద్యోగులు, ఏజెంట్ల సంకల్పం**

**గద్వాల సెప్టెంబర్ 17 (వుదయం బ్యూరో)**

పరిశుభ్రమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలనే సంకల్పంతో గద్వాల్ ఎల్ఐసీ శాఖ కార్యాలయంలో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఎల్ఐసీ కేంద్ర కార్యాలయం, ముంబయి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు గురువారం కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, యూనియన్ ప్రతినిధులు, ఏజెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.స్వచ్ఛ భారత్..ఒక అడుగు పరిశుభ్రత వైపు' అనే సందేశంతో నిర్వహించిన కార్యక్రమంలో ఇంగ్లిష్, హిందీ భాషల్లో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దివాకర్ ఇంగ్లిష్‌లో, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సత్యనారాయణ హిందీలో ప్రతిజ్ఞను చదివి వినిపించారు. 100 గంటలు.. పరిశుభ్రతకు అంకితం మహాత్మా గాంధీ కలలుగన్న పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. దేశాన్ని పరిశుభ్రంగా ఉంచడం ద్వారా మాతృ భూమికి సేవ చేస్తామని ఉద్యోగులు సంకల్పించారు. పరిశుభ్రత పట్ల నిబద్ధతతో వ్యవహరిస్తూ ఏడాదికి 100 గంటలు.. వారానికి రెండు గంటలు స్వచ్ఛందంగా పరిశుభ్రత కార్యక్రమాలకు కేటాయిస్తామని ప్రతిజ్ఞ చేశారు. తాము చెత్త వేయకుండా ఉండటంతో పాటు, ఇతరులు కూడా చెత్త వేయకుండా చైతన్యపరుస్తామని స్పష్టం చేశారు. మన నుంచే మార్పు మొదలుపరిశుభ్రతను ముందుగా వ్యక్తిగత స్థాయి నుంచి ప్రారంభించి కుటుంబం, ప్రాంతం, గ్రామం, కార్యాలయానికి విస్తరించేలా కృషి చేస్తామని ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. పరిశుభ్రమైన దేశాల వెనుక అక్కడి పౌరుల బాధ్యతాయుతమైన ప్రవర్తన, క్రమశిక్షణ ప్రధాన కారణాలని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ సందేశాన్ని గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామని, తాము తీసుకున్న ప్రతిజ్ఞను మరో 100 మంది తీసుకునేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. వారూ పరిశుభ్రత కోసం 100 గంటలు కేటాయించేలా అవగాహన కల్పిస్తామని సంకల్పించారు. విశేషంగా పాల్గొన్న ఉద్యోగులు, ఏజెంట్లు ఈ కార్యక్రమంలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కులశేఖర్, బ్రాంచ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు, క్లాస్3 ఉద్యోగులు, ఎల్ఐసీ ఏజెంట్ మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పరిశుభ్రత ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని.. ప్రతి పౌరుడి బాధ్యత అనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.



# ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం వేడుకలు



**అక్బర్ పేట భూంపల్లి సెప్టెంబర్ 17 ( వుదయం ప్రతినిధి )**

తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్బర్‌పేట్ భూంపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బాల మల్లేశం గౌడ్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి లు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రజలు చేసిన పోరాటాలు, త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, రాష్ట్ర అభివృద్ధిలో విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. విద్యార్థులు తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని, క్రమశిక్షణతో విద్యనభ్యసించి భవిష్యత్తులో రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.అనంతరం ప్రీప్రైమరీ విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. విద్యార్థుల సౌకర్యం, పాఠశాలపై ఆసక్తి పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి షానుబేగం, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, ఉపాధ్యాయులు,అంగన్వాడీ టీచర్ లు, ఆశా వర్కర్ లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు



**వెల్దండ సెప్టెంబర్ 17 (వు దయం)**

సృష్టికర్త విశ్వకర్మ భగవానుడి జయంతి ఉత్సవాలను గురువారం మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో భాజా భజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు అనంతరం పండితులు వేద పండితుడు వినయ్ కుమార్ , దేవాలయ అర్చకులు రాఘవేందర్ శర్మ విశ్వకర్మ మహా యజ్ఞ హోమం నిర్వహించారు తదుపరి భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు కార్యక్రమంలో ఎస్సై యుగంధర్ రెడ్డి గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, డిసిసి ఉపాధ్యక్షులు భూపతి రెడ్డి, బచ్చు రామకృష్ణ, పర్వత్ రెడ్డి, , ఉప సర్పంచ్ శ్రీనివాస్ ముదిరాజ్, చిందం కృష్ణయ్య శేఖర్ రెడ్డి జూలూరి బాలస్వామి, వార్డు సభ్యులు వెంకటేష్, ముదిగొండ రమేష్, రమేష్, నిర్వాహకులు అన్నదానం కృష్ణయ్య, పురుషోత్తం చారి, రామాచారి, పాండు చారి, జగన్ చారి, శోభన్ బాబు, వేణు, రామకృష్ణ, శ్రీశైలం, మిరియాల పద్మ, రాజయ్య తోపాటు ఆర్మీ జవాన్లు, భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు ముఖ్య అతిథులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు



# మార్మోగిన గణపతి నామస్మరణ

- **భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న గణేష్ ఉత్సవాలు..**
- **గ్రామ ప్రముఖుల ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం**

**కోహీర్ సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి)**

కోహీర్ మండలం పరిధిలోని మనియార్పల్లి గ్రామంలో గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. భజరంగ్ దళ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఉత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. నాలుగు రోజు సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య గణనాథుడికి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గణపతి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. యువజన సంఘం సభ్యులు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# ప్రజా పాలన దినోత్సవం ఘనంగా నిర్వహణ



**సంగారెడ్డి వుదయం**

తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బీసీ స్టడీ సర్కిల్, సంగారెడ్డిలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి. ప్రవీణ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ ఫ్యాకల్టీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజా పాలన దినోత్సవం ప్రాధాన్యతను ఈ సందర్భంగా వివరించారు.

# అంబేద్కర్ ను కల్పిత నాయకుడు అనడం సిగ్గుచేటు



- **రాజ్యాంగ నిర్మాతను అవమానిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి**
- **హమారా ప్రసాద్ పై దేశద్రోహ కేసు నమోదు చేయాలని డిమాండ్**

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 17, వుదయం:** హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరగనున్న "హమారా ప్రసాద్ అంబేద్కర్ కల్పిత నాయకుడు" అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని అడ్డుకుంటామని అంబేద్కర్ వాదులు, దళిత సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరిక జారీ చేశారు. ప్రపంచంలోనే 32 డిగ్రీలు పొందిన డా. బి.ఆర్. అంబేద్కర్ ను కల్పిత నాయకుడు అనడం సిగ్గుచేటని వారు మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ మాల మహానాడు నాయకులు పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ లేకుంటే మాట్లాడే స్వేచ్ఛ కూడా ఉండేది కాదని, నీ వెనుక RSS, బీజేపీ మతోన్మాదులు నడిపిస్తున్నారని ఆరోపించారు. పుస్తకావిష్కరణ నిలిపివేయకపోతే నిన్ను అడ్డుకోవడానికి ఎక్కడికైనా సిద్ధపడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో, టీవీ ఇంటర్వ్యూల్లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానపరుస్తూ, రాజ్యాంగాన్ని వక్రీకరిస్తూ మాట్లాడుతున్న హమారా ప్రసాద్ అలియాస్ నాగులపురం వరప్రసాద్ పై వెంటనే దేశద్రోహిగా కేసు నమోదు చేసి, రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతను అవమానపరిచినందుకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు, మండల అధ్యక్షులు దార స్వామి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల చంద్రం, జిల్లా నాయకులు దార మల్లయ్య, మద్దెల మంకయ్య, మద్దెల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

**ఝరాసంగం, సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి):**

ఝరాసంగం మండలంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.గంగాపూర్ గ్రామంలో సర్పంచ్ షహజద్ బీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందుగా తెలంగాణ తల్లి చిత్రపటానికి పూజలు నిర్వహించి పూలమాలలు వేశారు.అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా యువనాయకుడు ఇమ్రాన్ పటేల్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు నివాళులర్పించారు.
నిజాం నిరంకుశ పాలన, దొరల దౌర్జన్యాలు, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ప్రజలు పోరాడారని తెలిపారు.
భూమి, భుక్తి, విముక్తి కోసం ఎందరో ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు.
హైదరాబాద్ భారతదేశంలో విలీనమైన సెప్టెంబర్ 17 చారిత్రక ప్రాధాన్యతను వివరించారు.ఈ రోజును వివిధ ప్రాంతాల్లో తెలంగాణ సమైక్యత, విమోచన దినోత్సవంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.


**కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుజాత-యాదయ్య పాల్గొన్నారు.**

మాజీ సర్పంచ్ శివరాజ్ పాటిల్, మాజీ ఉపసర్పంచ్ ఉమేష్ పాటిల్ హాజరయ్యారు.వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సంజీవ్ పాటిల్, మీర్ పటేల్, అంబేద్కర్, బాబు,యాదయ్య,రమేష్, మోసిన్, సామేల్, బక్కప్ప, లాలప్పతదితరులు పాల్గొన్నారు.





# గ్రేటర్ హైదరాబాద్



## వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యవేదిక (ULDF)సదస్సును జయప్రదం చేయండి



**సెప్టెంబర్ 20న, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్ లింగంపల్లి, హైదరాబాదు** లో జరిగే వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యవేదిక (ULDF) సదస్సును జయప్రదం చేయాలని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో తేదీ.17.9.2026న పత్రిక/ ఎలక్ట్రానిక్ మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బొజ్జ బిక్షమయ్య అధ్యక్షత వహించారు. వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత యొక్క ప్రాధాన్యతను వివరించారు. దేశంలోని పాలకవర్గాలు దోపిడీతో ప్రజల ముందు బట్టబయలు అయ్యాయి. వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత అనివార్యమైందన్నారు. జస్ట్ చంద్ర కుమార్ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి): మాట్లాడుతూ 80 ఏళ్ల స్వాతంత్రంలో ప్రజల దోపిడీ భారీగా పెరిగింది. బడా పెట్టుబడిదారుల 18.50 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారు. పెట్టుబడిదారులు ప్రభుత్వ బ్యాంకుల్లో రుణాలు ఎగ్గొడుతున్నారు. కౌలు రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. లక్షల మంది కాంట్రాక్టు ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సమయానికి ఇవ్వడం లేదు. విద్య వైద్యం భారీ వ్యాపారం అయ్యింది. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. అవినీతి, కాలుష్యం, కల్తీ తారాస్థాయికి చేరింది. నిరుద్యోగం పెరిగింది. ఈ పాలకవర్గాలే ఈ దుస్థితికి కారణం. నైనాల గోవర్ధన్ (వామపక్ష ప్రజాతంత్ర ఐక్యవేదిక నాయకులు): దేశంలోని జాతీయ ప్రాంతీయ పార్టీలు వారి దోపిడీతో ప్రజలలో విపరీతమైన వ్యతిరేకత ఏర్పడింది. అధికారానికి వచ్చిన కేసీఆర్ భారీ అవినీతికి పాల్పడ్డారు. సుప్రీంకోర్టు జడ్జి అవినీతిని తేల్చినా చర్యలు తీసుకునే వారు లేరు. బిజెపి పెట్టుబడిదారుల సేవ చేస్తూ, యూపీఏ చెల్లింపుల పేరిట, అనేక రూపాల్లో భారీగా పన్నులు ప్రజలపై వేస్తుంది. రైతుల ఆదాయం రెండింతలు పెరగకపోగా మరింత దిగజారింది. సాలుకు రెండు కోట్ల నిరుద్యోగ హామీనీ ఉల్లంఘించి విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తుంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం భారీ అవినీతి దోపిడీలో కూరుకుపోయింది.కోల జనార్ధన్ (వామపక్ష ప్రజాతంత్ర ఐక్య వేదిక నాయకులు): పాలకవర్గాలు ప్రజలకు ప్రత్యామ్నాయం కాదని, బహుజన సామాజిక శక్తులు వామపక్షాలతో ఐక్యం కావాలన్నారు. భౌగోళిక తెలంగాణ భూకబ్జాల తెలంగాణ గా మారింది అన్నారు. డాక్టర్ శ్రీనివాసరావు: (వామపక్ష ప్రజాతంత్ర ఐక్యవేదిక నాయకులు) కమ్యూనిస్టులు ప్రజాతంత్ర శక్తులు మాత్రమే ప్రజల కొరకు నిలబడగలవు అన్నారు. విజయ్ కుమార్ (వామపక్ష ప్రజాతంత్ర ఐక్యవేదిక నాయకులు) అట్టడుగు వర్గాలని పాలకవర్గాలు మోసం చేస్తున్నాయని, వాడుకుంటున్నాయని, వామపక్షాలతో ఐక్యం కావడం మాత్రమే మార్గమన్నారు. నాగయ్య (ULD నాయకులు): ప్రజాతంత్ర శక్తులు, అశేష బాధిత ప్రజలందరూ వామపక్ష శక్తులతో ఐక్యం కావాలన్నారు. డాక్టర్ నాగేశ్వరరావు (వామపక్ష ప్రజాతంత్ర ఐక్యవేదిక నాయకులు): హాజరైన పాత్రికేయులకు నాయకులకు ధన్యవాదాలు చెబుతూ దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా విద్యార్థి యువజన కార్మికులందరూ ఐక్యం కావాలని ముగించారు. మల్లేష్ (రైతు సంక్షేమ సమితి), రహీం న్యాయవాది, ప్రభు (రైతు సంక్షేమ సమితి), సాయి కిరణ్ (రైతు సంక్షేమ సమితి), నరసింహా (రైతు సంక్షేమ సమితి) పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ లాటరీ పేరుతో రూ.7.47 లక్షల మోసం

- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: పోలీసుల సూచన**

**చేవెళ్ల, సెప్టెంబర్ 17 (వుదయం)**
ఆన్‌లైన్ లాటరీ గెలిచారంటూ నమ్మించి ఓ వ్యక్తి నుంచి రూ.7,47,468 బదిలీ చేయించుకున్న ఘటన బాధితుడు చేవెళ్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.చేవెళ్ల మండపరిధిలోని తంగడిపల్లి మడికట్టు గ్రామానికి చెందిన దేవరి మల్లేశం (38)కు జూలై 10న గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి, తాను కేరళ లాటరీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నానని, రూ.8 లక్షల లాటరీ బహుమతి వచ్చిందని నమ్మించాడు.అనంతరం బ్యాంకు, ఆధార్ వివరాలను వాట్సాప్ ద్వారా తీసుకున్నాడు.లాటరీ నగదు విడుదల పేరుతో ప్రాసెసింగ్ ట్యాక్స్, GST, NOC, TDS, NEFT ఛార్జీలు, ఈస్టాంప్ తదితర ఫీజుల పేరుతో పలుమార్లు డబ్బులు చెల్లించాలని కోరడంతో బాధితుడు వివిధ ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా మొత్తం రూ.7,47,468 బదిలీ చేశాడు. అయితే ఎలాంటి లాటరీ నగదు అందకపోవడంతో మోసపోయినట్లు గుర్తించాడు.దీంతో జూలై 31న సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయగా, అనంతరం సెప్టెంబర్ 17న చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.పోలీసుల సూచనలు లాటరీ లేదా బహుమతి గెలిచారంటూ వచ్చే ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాలను నమ్మవద్దని పోలీసులు సూచించారు.పన్నులు, GST, ప్రాసెసింగ్ ఛార్జీల పేరుతో ముందుగా డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంకు, ఆధార్, OTP, PIN, CVV, UPI వివరాలు ఇవ్వకూడదన్నారు.సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు సమాచారం అందించి పోలీసులను సంప్రదించాలని సూచించారు.

## శ్రీ వీరభద్రస్వామి హుండీ లెక్కింపు.. రూ. 18.66 లక్షల ఆదాయం



**గుమ్మడిదల, సెప్టెంబర్ 17 (వుదయం ):**
బొంతపల్లి శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో లలితా సేవా సమితి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. గత 70 రోజులుగా భక్తులు సమర్పించిన కానుకలను అధికారులు, సిబ్బంది సమక్షంలో లెక్కించారు.
ఈ లెక్కింపులో ప్రధాన హుండీ ద్వారా రూ. 18,00,598/ ఆదాయం రాగా, అన్నదానం హుండీ ద్వారా రూ. 65,980/ విరాళాలు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. రెండూ కలిపి మొత్తం రూ. 18,66,578/ ఆదాయం సమకూరింది.ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇన్స్పెక్టర్ రంగారావు, ఆలయ ఈఓ రామ బ్రహ్మచారి, మాజీ చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి, మాజీ ధర్మకర్తలు శ్రీనివాస్ గౌడ్, యాదగిరి గౌడ్, కృష్ణ పాల్గొన్నారు. వీరితో పాటు కౌన్సిలర్ కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ వేణు, గ్రామ పెద్దలు కావలి శంకర్, అర్చకులు, భక్తులు తదితరులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.





## మార్కెట్ యార్డు గణనాథుడిని దర్శించుకున్న మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్

**పటాన్ చెర్ సెప్టెంబర్ 17, వుదయం**
పటాన్చెర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ గురువారం పాల్గొన్నారు.మండపానికి విచ్చేసిన ఆమెకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం కాట సుధా శ్రీనివాస్ గౌడ్ గణనాథుడిని దర్శించుకుని, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా కాట సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..
ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులతో పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. లోకకల్యాణం కోసం, ప్రజలందరి విఘ్నాలు తొలగిపోవాలని తాము ప్రత్యేక పూజలు చేసినట్లు పేర్కొన్నారు.
ఇంతటి ఘనంగా నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను, నిర్వాహకులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## పంచముఖ మహా గణేశుడిని దర్శించుకున్న బీఆర్ఎస్ నేతలు

**ముషీరాబాద్, సెప్టెంబర్ 17(వుదయం)**
ఖైరతాబాద్‌లో కొలువుదీరిన పంచముఖ మహా గణేశ్ విగ్రహాన్ని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు, మాజీ మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌లతో కలిసి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నగేష్ ముదిరాజ్ గురువారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మహాగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు.గణేశ్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో కొనసాగాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని వారు ఆకాంక్షించారు. అనంతరం ఉత్సవాల ఏర్పాట్లు, భక్తుల రద్దీ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు, నిర్వాహకులు బీఆర్ఎస్ నాయకులను కలిసి అభివాదం చేశారు.



## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన బీజేపీ



**చేవెళ్ల, సెప్టెంబర్ 17 (వుదయం)**
చేవెళ్ల మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ విమోచన కోసం పోరాడిన వీరులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా అనంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ సంస్థానం నిజాం పాలన నుంచి విముక్తి పొంది భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేశారు. తెలంగాణ విమోచన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.చారిత్రక విషయాలను రాజకీయ ప్రయోజనాల కోసం పక్కనపెట్టడం సరికాదని, తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు,డాక్టర్ వైభవ్ రెడ్డి కౌన్సిలర్స్ కరికే మీనాక్షి సత్యనారాయణ అత్తిలి మనిషా అనంత రెడ్డి పెద్దల దయాకర్ జనరల్ సెక్రెటరీ పత్తి సత్యనారాయణ,చేగూరి ప్రవీణ్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, జి శ్రీనివాస్ రెడ్డి, జి పురుషోత్తం రెడ్డి,చిర శ్రీనివాస్, ఏ రాజు, రమేష్,బీరప్ప, కర్ణాకర్, వడ్డే గణేష్, అశోక్, బి చంద్రశేఖర్ రెడ్డి, కే చంద్రశేఖర్ రెడ్డి, హర్షిత్, జైసింహా రెడ్డి గా, రాకేష్, జి మధుసూదన్ రెడ్డి, వంశీధర్ రెడ్డి, శ్రీకాంత్, పి వెంకటేష్, సిహెచ్ నరసింహులు, చాకలి శ్రీనివాస్, తెలుగు శ్రీనివాస్, కె మహేందర్, నగేష్, నాగరాజు, కృష్ణారెడ్డి, గోవర్ధన్, శ్రీతం రెడ్డి, మల్లేష్, అంజనేయులు,బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కుంకుమార్చనకు మహిళలు భారీగా తరలిరావాలి

**జిన్నారం, సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి)**
గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని చెట్లపోతారం ప్రాంతంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపంలో శుక్రవారం ప్రత్యేకంగా కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా మహిళల కోసం ప్రత్యేకంగా కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పరిసర ప్రాంతాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్రెండ్స్ యూత్ సభ్యులు కోరారు. భక్తిశ్రద్ధలతో వినాయకునికి పూజలు నిర్వహించి, మహిళలు కుంకుమార్చనలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.
కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు వెల్లడించారు.

## పోలీస్ నియామక రాత పరీక్షల తేదీలు ఖరారు

**హైదరాబాద్ సెప్టెంబర్ 17 (వుదయం):**
తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో కీలక ఘట్టమైన రాత పరీక్షల తేదీలను తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి అధికారికంగా ప్రకటించింది. సబ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలకు పోటీపడే అభ్యర్థులకు నవంబరు ఇరవై తొమ్మిదవ తేదీన, కానిస్టేబుల్ పోస్టులకు డిసెంబరు ఇరవైయవ తేదీన రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు బోర్డు గురువారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేసింది. హోంశాఖ పరిధిలోని పోలీసు విభాగంతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో ఖాళీగా ఉన్న ఏడు వేల నాలుగు వందల ముప్పై ఏడు ఉద్యోగాల భర్తీ కోసం ఈ నియామక ప్రక్రియ చేపట్టారు. ఈ ఉద్యోగ నియామకాలకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థుల నుంచి విశేష స్పందన లభించిందని బోర్డు ఛైర్మన్ వి.వి. శ్రీనివాసరావు వెల్లడించారు. మొత్తం ఐదు లక్షల డెబ్బై ఏడు వేల అరవై నాలుగు మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన వివరించారు.

## భోలేనాథ్ గణనాథుని కళ్యాణ మహోత్సవం



**సదాశివపేట, సెప్టెంబర్ 17 (వుదయం):**
పట్టణంలోని దత్తాత్రేయ నగర్‌లో భోలేనాథ్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ వినాయక స్వామివారి తిరుకళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా జరిగింది. వేద పండితుల శ్రావ్యమైన మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కళ్యాణ వేడుకను కన్నులపండువగా నిర్వహించారు. ఈ దివ్య వేడుకను తిలకించేందుకు కాలనీవాసులు, పట్టణ ప్రముఖులు, మహిళలు మరియు గణేష్ భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి కళ్యాణాన్ని దర్శించుకుని భక్తులు తారక మంత్ర స్మరణతో పునీతులయ్యారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వచ్చిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవ సమితి సభ్యులు చేసిన ప్రత్యేక ఏర్పాట్లతో కాలనీ అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన కాలనీ పెద్దలకు, భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం



- **నిజాం, రజాకార్ల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన వీరుల త్యాగాలు చిర స్మరణీయం: కుర్వ మహిపాల్**

**చేవెళ్ల,సెప్టెంబర్ 17 (వుదయం)**
అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా గురువారం నిర్వహించారు. చేవెళ్ల బస్టాండ్ ఎదురుగా జరిగిన కార్యక్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ విమోచన పోరాటంలో అమరులైన వీరులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్ మాట్లాడుతూ.. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలో కొనసాగిందన్నారు.నిజాం పాలనలో ప్రజలు ఎదుర్కొన్న అణచివేత, రజాకార్ల అకృత్యాలను వివరించారు.సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నాయకత్వంలో 1948 సెప్టెంబర్ 13న ప్రారంభమైన ఆపరేషన్ పోలో అనంతరం సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని తెలిపారు.తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ లభించిన ఈ చారిత్రక రోజును ప్రతి ఏడాది స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల నగర కార్యదర్శి శ్రీకాంత్, హారిక, లోకేష్, హరికృష్ణ, చరణ్, అవినాష్, రాఘవేందర్, శ్రీశాంత్, అక్షయ, సింధు, పద్మజ, శివశ్రీ, అక్షిత తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా రోడ్ల అభివృద్ధికి కేంద్ర నిధుల వరద

**కందుకూరుసెప్టెంబర్ 17 (వుదయం):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన పురస్కార వేడుకలు, విశ్వకర్మ జయంతి మరియు హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాపూర్ గ్రామంలో రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహించిన ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర వ్యవసాయ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గతంలో రజాకార్ల అరాచకాల నుంచి తమను తాము రక్షించుకోవడానికి తిమ్మాపూర్ గ్రామస్థులు నిర్మించిన చారిత్రక బురుజును ఈ సందర్భంగా ఆయన సందర్శించి, నాటి పోరాట యోధులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశంలో ప్రతి మహిళనూ ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు అవసరమైన శిక్షణ, బ్యాంకు రుణాలు అందించడం ద్వారా ఆర్థిక స్వావలంబన చేకూరుస్తామని, ఇంకా ఈ స్థాయికి చేరుకోని మహిళలను ప్రోత్సహించడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. నిరుపేదలందరికీ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని, తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని సుస్థిరం చేసేందుకు సమగ్ర రోడ్‌మ్యాప్ రూపొందించి, పంట బీమా ద్వారా రైతులకు ధీమా కల్పిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు, పేదరిక నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీకి తెలంగాణ చరిత్రలో విశిష్ట స్థానం ఉందన్న ఆయన, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా గ్రామాల రక్షణ కోసం ప్రజలు నిర్మించుకున్న బురుజులు నాటి ధీరత్వానికి ప్రతీకలని కొనియాడారు. రంగారెడ్డి జిల్లాలోని పలు గ్రామీణ ప్రాంతాలను అనుసంధానిస్తూ రహదారుల నిర్మాణానికి కేంద్రం భారీగా నిధులు కేటాయించిందని, తిమ్మాపూర్ పరిసర ప్రాంతాల్లో రూ. 17 కోట్లతో పాటు, శ్రీశైలం ప్రధాన రహదారి నుండి లేమూరు, అగ్రిమల, అవనిగడ్డల మీదుగా తిమ్మాపూర్ వరకు రూ. 38 కోట్లతో విస్తరణ పనులు చేపట్టనున్నట్లు వివరించారు.





**IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT L.B. NAGAR**
**O.S.No.546 of 2026**

**Between :**
Kotamraju Suma ...Plaintiff
**AND**
The Tahsildar and another ...Defendants
To,
All concerned

Whereas the above named Plaintiff has filed the above Suit against the Defendants, praying above Hon'ble Court to pass Judgment & Decree in her favor as under: a). to declare the Plaintiff as the Legal heir of late Kotamraju Vasudeva Vidya Sagar. You the above named Defendant no.2 take notice that the above case is posted on 01-10-2026 at 10.30 AM for your appearance and written statement if any, and if you failed to appear before the above Hon'ble Court either in person or through advocate, otherwise the matter will be decided in your absence.

**//BY THE ORDER OF THE COURT//**
**Counsel for the Plaintiff**
**Sd/-**
**KAMTALA SREENIVAS**
**K. SAI KRISHNA**
**Advocates**
**O/o. H.No.11-6-141 (6-35 old), Pochammabagh Colony, Saroornagar, Hyderabad - 35.**
**Cell: 9440129813, 8121036976**

**IN THE COURT OF THE HON'BLE Vth JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD**
**O.S. NO. 2063 of 2026**

**Between :**
ALLANKI MAHESH, & Another ...Plaintiffs
**AND**
1.THE TEHSILDAR KHAIRTABAD MANDAL
2.ALL CONCERNED ...Defendants

**PUBLIC NOTICE**

All Concerned
This is to inform to general public that the Plaintiffs have filled suit for Declaration to declare them as Legal heirs of deceased LATE, SMT ALLANKI SUNITHA, W/O LATE A.YADAGIRI, died on. 18-05-2025, such general public are hereby informed you that if any body having any objection kindly appear before the above Hon'ble Court on 23-09-2026, at 10.30 A.M either in person or through Advocate, Failing which matter will be decided as per law. Hence this notice.

**// BY ORDER OF THE COURT//**
**Sd/-**
**M B SANTOSH KUMAR**
**M S ROHITH KUMAR**
**ADVOCATES**
**Office: 3-41-1, ASHWINI NAGAR COLONY West Marredpally, SECUNDERABAD-26,**
**CELL NO 9391358882**




"పీఎఫ్ వేతన పరిమితిని రూ.15,000 నుండి రూ.25,000కు పెంచడం ద్వారా అదనంగా 51 లక్షల మంది వేతన జీవులకు చట్టబద్ధమైన సామాజిక భద్రత అందుబాటులోకి వస్తుంది. సంఘటిత రంగంలో పెరుగుతున్న వేతనాలు, ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. దీనివల్ల ప్రైవేట్ రంగ ఉద్యోగులకు భవిష్య నిధి పొదుపు, పింఛను ప్రయోజనాలు మరింత మెరుగవుతాయి. కార్మికుల సంక్షేమం, పొదుపును ప్రోత్సహించడమే మా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత."

- అశ్వినీ వైష్ణవ్, కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి

## వే'మన' పద్యం

గంగ పాలు నెపుడు కదలని గతితోడ
ముటికి వాగు పాలు మ్రోతతోడ
పెద్ద పిన్నతనము పేరిమి యీలాగు
విశ్వదాభిరామ! వినుర వేమ



## సంపాదకీయం

# ముదురుతున్న చమురు సంక్షోభం

పశ్చిమాసియాలో చెలరేగిన యుద్ధం ఇప్పట్లో సమసిపోయే సూచనలు కనిపించడం లేదు. పైగా యుద్ధం కొత్త ప్రాంతాలకు విస్తరిస్తూ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెను సవాలు విసురుతోంది. ఇరాన్ ఇజ్రాయెల్ ఘర్షణల ప్రభావం ఇప్పటికే గల్ఫ్ దేశాలకు పాకింది. తాజాగా సౌదీ అరేబియాలోని కీలక చమురు మౌలిక సదుపాయాలపై డ్రోన్ దాడులు జరగడం, ఈస్ట్ వెస్ట్ చమురు పైప్‌లైన్ మూసివేయడంతో పరిస్థితి పెనం మీదనుంచి పొయ్యిలోకి పడినట్లయింది. హార్ముజ్ జలసంధికి ప్రత్యామ్నాయంగా సౌదీ అరేబియా ఏర్పాటు చేసుకున్న 1200 కిలోమీటర్ల ఈ పైప్ లైన్ ద్వారా రోజుకు 40 లక్షల బ్యారెళ్ల వరకు చమురును తరలించవచ్చు. ప్రపంచ చమురు సరఫరాలో ఇది దాదాపు నాలుగు శాతం. ఈ పెట్రోలైన్‌ను మూసివేయడంతో భారత్ సహా అనేక దేశాలకు చమురు కొరత తప్పేలా లేదు. ఈ పైప్‌లైన్‌ను లక్ష్యంగా చేసుకుని హుతీలు దాడులకు పాల్పడుతున్నారు. ఇప్పటికే ఎర్ర సముద్రంలో వ్యూహాత్మకంగా కీలకమైన హనిష్ దీవులను హుతీలు స్వాధీనం చేసుకున్నట్టు తాజా సమాచారం. బాబ్‌అల్‌మందెబ్ జలసంధికి సమీపంలో హుతీల ప్రభావం పెరగడం చమురు రవాణాకు మరో ముప్పుగా పరిణమిస్తోంది. యుద్ధచరిత్రను చదవండి బ్రిక్స్ ప్రకటనలకే పరిమితం కారాదు t ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన రెండు సముద్ర మార్గాలపైనా ఒత్తిడి పెరగడం ఆందోళనకరం. దీని ప్రభావం చమురు మార్కెట్లపై ఇప్పటికే పడింది. బ్రెంట్ ముడిచమురు ధర 107 డాలర్లు దాటింది. ఇది కేవలం చమురు మార్కెట్ సమస్య కాదు. ముడిచమురు ధర పెరిగితే రవాణా వ్యయం పెరుగుతుంది. ఉత్పత్తి వ్యయాలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం అదుపు తప్పే అవకాశం ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలపై ఒత్తిడి పెరుగుతుంది. ప్రపంచ ఆర్థిక వృద్ధి మందగించే ప్రమాదం ఉంటుంది. అంటే పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ప్రపంచంలోని ప్రతి కుటుంబంపైనా పడే పరిస్థితి ఏర్పడుతుంది. భారత్‌పై ఈ పరిణామాలు మరింత ప్రభావం చూపిస్తాయి. మన దేశం తన ముడి చమురు అవసరాల్లో అధిక భాగం దిగుమతుల ద్వారానే సమకూర్చుకుంటోంది. అందువల్ల అంతర్జాతీయ చమురు ధరల్లో భారీ పెరుగుదల దేశ వాణిజ్య లోటు, ద్రవ్యోల్బణం, రూపాయి విలువపై ప్రభావం చూపుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రమే కాకుండా ఎరువులు, రసాయనాలు, రవాణా, పరిశ్రమల వ్యయాలపైనా దాని ప్రభావం ఉంటుంది. అయితే ప్రస్తుత సంక్షోభ సమయంలో భారత్ అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ, దేశంలో ఇంధన సరఫరాలు ప్రస్తుతం స్థిరంగానే ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం గట్టిగా చెబుతోంది. కానీ యుద్ధం ఎంతకాలం కొనసాగుతుందన్నదే అసలు ప్రశ్న. తాత్కాలిక అంతరాయాలను ఎదుర్కోవడం ఒక సవాల్ కాగా, నెలల తరబడి కొనసాగే చమురు సరఫరా సంక్షోభాన్ని ఎదుర్కోవడం మరో సవాల్. పశ్చిమాసియా యుద్ధానికి ముగింపు పలికితే తప్ప ఈ సంక్షోభం తీరదన్నది నిర్వివాదాంశం. మరిన్ని కనుగొనండి ప్రపంచ పటాలు పరిశీలించండి ఇంధన సరఫరా కనుగొనండి అరబ్ వంటకాలు ప్రయత్నించండి Also Read చరిత్రను వక్రీకరించడం జాతికి ద్రోహమే యుద్ధంలో ఎవరు గెలిచారు, ఎవరు ఓడిపోయారు అన్న లెక్కల కంటే శాంతి ఎలా నెలకొంటుందన్నదే ముఖ్యమైనది. గల్ఫ్ దేశాలు ఇరాన్‌తో జరపాల్సిన చర్చలను వాయిదా వేయడం వల్ల పరిస్థితి ఎంత సున్నితంగా మారిందో చెప్పడానికి తాజా పరిణామాలే ఒక ఉదాహరణ. దౌత్య మార్గాలను మూసివేసి సైనిక మార్గాన్నే ఎంచుకుంటే సంక్షోభం మరింత విస్తరించే ప్రమాదం ఉంది. అమెరికా, యూరప్,

గల్ఫ్ దేశాలు, ఇరాన్ తదితర పక్షాలు తమ తమ ప్రయోజనాల కంటే ప్రపంచ శాంతికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం ఇది. ముఖ్యంగా హార్ముజ్, బాబ్‌అల్‌మందెబ్ వంటి అంతర్జాతీయ జలమార్గాల భద్రతకు బలమైన వ్యవస్థ అవసరం. చమురు సరఫరాను ఒక ఆయుధంగా మలచుకుని కొన్ని దేశాలు ప్రపంచాన్ని సంక్షోభంలోకి నెట్టడాన్ని ఇకపై చూస్తూ ఊరుకోలేం. పశ్చిమాసియా యుద్ధం ఇప్పుడు ఆ ప్రాంత ప్రజల సమస్యగా మాత్రమే మిగలలేదు. అది ప్రపంచ ఇంధన భద్రతకు, ఆర్థిక స్థిరత్వానికి, ఆహార భద్రతకు, అంతర్జాతీయ వాణిజ్యానికి సవాలుగా మారింది. బాంబుల మోత ఆగకపోతే చమురు ధరల మంట ప్రపంచమంతా వ్యాపించే ప్రమాదం ఉంది. అందుకే యుద్ధంలో మరో దాడి కోసం కాకుండా, శాంతి స్థాపన కోసం ప్రపంచ దేశాలు కృషి చేయాలి.


### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


# ధర్మపురి గోదావరి తీరాన భాగవత రసామృతం

దక్షిణ కాశీగా, పుణ్య గోదావరీ తీర విరాజిత క్షేత్రంగా వినుతికెక్కిన ధర్మపురి క్షేత్రంలో భాద్రపద శుక్ల పక్ష పవిత్ర వేళల్లో భాగవత సప్తాహ శ్రవణ మహోత్సవాలు శ్రీరామలింగేశ్వరాలయ ప్రాంగణాన శాస్త్రోక్తంగా నేటి నుండి ఆరంభం కానున్నాయి. దేవస్థాన యాజమాన్యం, స్థానిక శారదా మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో త్రిభాషా పండితోత్తములు కశోజ్జల నీలకంఠశర్మ పౌరాణిక వాచస్పత్యంలో వారం రోజుల పాటు నిర్విఘ్నంగా సాగే ఈ అమృతధార, తెలంగాణ గడ్డపై శతాబ్దాలుగా వెల్లివిరుస్తున్న వైదిక, పౌరాణిక విద్యావైభవానికి సజీవ నిదర్శనమై భాసిల్లుతోంది. ప్రాచీన భారతదేశంలో నైమిశారణ్య తీర్థాన శౌనకాది మహామునుల సమక్షంలో సూత పౌరాణికుడు అష్టాదశ పురాణ రసామృతాన్ని వర్షించిన దివ్య ఘట్టాన్ని, నేడు ధర్మపురి క్షేత్రం తన గర్భగుడి ముంగిట పునరావిష్కరిస్తోంది. లౌకిక సంసార చక్రభ్రమణంలో చిక్కుకుని అలమటించే జీవుడికి ఆత్మతత్త్వ వికాసాన్ని, భక్తి ముక్తిదాయకమైన శాంతిని ప్రసాదించడమే పురాణ శ్రవణ లక్ష్యమనే ఆర్యోక్తిని ఈ సప్తాహం ఆచరణాత్మకంగా చాటుతోంది.

సప్తదినాల భాగవత శ్రవణ సంప్రదాయానికి ఆద్యుడు, ఆదర్శ ప్రాయుడు పరీక్షిన్మహారాజు. శమీక మహర్షి పుత్రుడైన శృంగి శాపవశాన ఏడు దినములలో తక్షక దంశనం వల్ల మృత్యువు తప్పదని తెలిసిన మరుక్షణమే, పరీక్షిత్తు సమస్త రాజభోగాలను తృణప్రాయంగా త్యజించి మోక్షార్థియై సిద్ధం కాగా, సర్వజ్ఞుడైన వ్యాసపుత్రుడు శ్రీశుక మహర్షి, ఆ జీవాత్మకు జన్మరాహిత్యాన్ని ప్రసాదించే దివ్య ఔషధంగా ద్వాదశ స్కంధములు, 335 అధ్యాయాలు, 18,000 శ్లోకాలతో పరిఢవిల్లే శ్రీమద్భాగవత పురాణాన్ని ఏడు పగళ్లు, ఏడు రాత్రులు నిర్విరామంగా ఉపదేశించాడు. లోకంలో భౌతిక దేహానికి మృత్యువు అనివార్యమైనప్పటికీ, ఆత్మ అమరమైనదనే నిత్యానుసంధానాన్ని ఆ మహారాజు అనుభూతి చెంది మోక్షపదాన్ని అధిరోహించాడు. అదే సప్తాహ విధానం యుగయుగాలకూ విస్తరించి, ఆర్తత్రాణపరాయణులైన భక్తులకు భవరోగనివారిణిగా నిలిచింది.

"సర్వవేదాంతసారం హి శ్రీభాగవతమిష్యతే । తద్రసామృతతృప్తస్య నాన్యత్ర స్యాద్రతిః క్వచిత్ ॥" అన్న వ్యాస వచనాన్ని, భక్తికవితా సుధాకరుడు బమ్మెర పోతనామాత్యుడు తన తెలుగు భాగవతంలో 'పలికెడిది భాగవతమట, పలికించెడువాడు రామభద్రుండట' అంటూ భక్తిపారవశ్యంతో తేటతెనుగు పద్యమై తెలుగువారి హృదయాల్లో శాశ్వతంగా నిలిపాడు. అటువంటి వేదాంత రసాలంకృతమైన గ్రంథాన్ని శ్రవణం చేయడం ధర్మపురి క్షేత్రవాసులకు నిత్యసహజమైన జీవనశైలి. చారిత్రక పరిణామక్రమంలో ధర్మపురి వైదిక సంస్కృతికి, విశిష్ట విద్యాపీఠాలకు అగ్రాసనమై నిలిచింది. ఇక్కడి శ్రీనృసింహ పీఠ ప్రథమ పాలకులు రొట్టె వాసుదేవ దీక్షితులు సుమారు ఐదు శతాబ్దాల పూర్వమే అనగా పదిహేనవ శతాబ్దపు చివరి దశకంలోనే, గోదావరీ సైకత తీరాన భాగవత సప్తాహ ప్రవచన యజ్ఞాలను శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు స్థానిక మౌఖిక ఆధారాలు, పీఠ సంప్రదాయాలు ఘోషిస్తున్నాయి. ఆ మహానుభావుని అడుగుజాడల్లో రొట్టె విశ్వనాథ సోమయాజులు, నరహరి దీక్షితులు, సదాశివశాస్త్రి, అఖండ వేదవేదాంగ విద్వాంసుడు, బాలసరస్వతి బిరుదాంకితుడైన సంగనభట్ల రాజేశ్వరుడు, సంగనభట్ల నరహరిశాస్త్రి తదితరులు తమ పాండిత్య గరిమతో, వ్యాఖ్యాన కౌశలంతో పురాణ ప్రవచనాన్ని కేవలం శ్రవణానందంగానే కాక ధర్మబోధనా యజ్ఞంగా నడిపించారు. ఆ పిమ్మట రావులపెల్లి సాంబశాస్త్రి, అలువాల వేంకటేశశాస్త్రి, తాడూరి బాలకృష్ణశాస్త్రి, పణతుల కృష్ణశాస్త్రి, రొట్టె చంద్రశేఖరశాస్త్రి, సంగనభట్ల మాణిక్యశాస్త్రి, కాకెర్ల లక్ష్మీకాంతశాస్త్రి, ధర్మపురి క్షేత్ర మహాత్మ్య గ్రంథ పరిష్కర్తగా ఖ్యాతిగాంచిన కశోజ్జల సదాశివశాస్త్రి, కాకెర్ల లక్ష్మీనరహరిశాస్త్రి, దేవళ్ళ రామకృష్ణశాస్త్రి, నారంభట్ల పెద్ద వెంకటేశశాస్త్రి, వెల్మకన్నె హన్మాన్‌శర్మ, ఉస్మానియా విశ్వవిద్యాలయ విశ్రాంత రీడర్ డాక్టర్ కొరిడె రాజన్నశాస్త్రి, కాకెర్ల కృష్ణశాస్త్రి, కాకెర్ల దత్తాత్రేయశర్మ, గురుపీఠ వంశపారంపర్య ప్రవచకులు రొట్టె విశ్వనాథశాస్త్రి, సంస్కృతాంధ్ర పండితులు గుండి సీతారామశాస్త్రి, నారంభట్ల వేంకటేశశర్మ వంటి మహామహులు నిస్వార్థ విద్యాదానంతో ధర్మపురిని పౌరాణిక రాజధానిగా నిలబెట్టారు. ఈ క్షేత్ర పౌరాణిక వైభవ శిఖరాగ్రాన ధ్రువతారగా వెలుగొందిన అసాధారణ ప్రజ్ఞామూర్తి 'అపర వేదవ్యాస' గుండి రాజన్నశాస్త్రి. ఆయన తన నివాస ప్రాంగణాన్ని ఒక విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్ది, భాగవతంతోపాటు సమస్త అష్టాదశ పురాణాలను నిరంతరాయంగా ప్రవచించేవారు. ఆయన అమృతవాక్కులను ఆలకించేందుకు భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, ఆంధ్ర మహాభారత విమర్శనాచార్యులు దివాకర్ల వెంకటావధాని, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు తెన్నేటి విశ్వనాథం వంటి మహోన్నత వ్యక్తులు ధర్మపురి వీధుల్లో పాదచారులై విచ్చేసి ప్రవచన వేదిక ఎదుట వినయపూర్వకంగా ఆసీనులయ్యేవారని చరిత్ర పుటలు నిరూపిస్తున్నాయి. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ తన ప్రఖ్యాత నవల 'మ్రోయు తుమ్మెద'లో గుండి రాజన్నశాస్త్రి అగాధ పాండిత్యాన్ని, వాగ్విభూతిని అత్యున్నతంగా ప్రస్తావించడం ధర్మపురి పౌరాణిక వైభవానికి సాహితీ జగత్తు సమర్పించిన మహోన్నత నీరాజనం. ఆ మహోజ్జ్వల వారసత్వాన్ని అందిపుచ్చుకుని నేటి ఆధునిక కాలంలోనూ శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు, పురాణ వాచస్పతి బిరుదాంకితులు బాచంపెల్లి సంతోష్‌కుమారశర్మ, కొరిడె నరహరి శర్మ, విశ్వనాథశర్మ, పాలెపు భారత్‌శర్మ, కశోజ్జల నీలకంఠశర్మ, కాకిరి అమర్‌శర్మ, పాలెపు చంద్రశేఖరశర్మ, కాకెర్ల రాఘవశర్మ తదితర విద్వాంసులు దేశవిదేశాలలో భారతీయ సనాతన ధర్మాన్ని, పురాణ వాఙ్మయాన్ని నలుదిక్కులా వ్యాప్తి చేస్తున్నారు. విద్యాగర్వం దరిచేరనీయక, విజ్ఞానాన్ని లోకకల్యాణార్థం పంచే యజ్ఞంగా భావించడమే ధర్మపురి పండితుల స్వాభావిక లక్షణం.

యాంత్రికమైన ఆధునిక జీవనశైలిలో మానసిక ప్రశాంతత లోపించి, అంతరంగ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న మానవాళికి భాగవత శ్రవణం ఒక మహత్తర శాంతిధామం. గోదావరి అలల సవ్వడుల మధ్య, శ్రీరామలింగేశ్వరుని సన్నిధానంలో ప్రారంభమైన ఈ ఏడు రోజుల సప్తదిన భాగవత ప్రవచన మహాయజ్ఞం భక్తులకు కర్మక్షయాన్ని, చిత్తశుద్ధిని చేకూర్చి, మహోన్నత ఆధ్యాత్మిక అనుభూతిని కలుగజేస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.



ధర్మపురి క్షేత్రానికి చెందిన గతకాల పౌరాణిక త్రయం చంద్రశేఖర, మాణిక్య, లక్ష్మీకాంత శాస్త్రి




రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్


# డీప్‌ఫేక్‌లతో విశ్వసనీయతకు సవాల్

నిన్నటి వరకు మన కళ్లతో చూసింది నిజమని, చెవులతో విన్నది వాస్తవమని నమ్మేవాళ్లం. ఇప్పుడు ఆ నమ్మకానికే సాంకేతికత సవాలు విసురుతోంది. ఒక వ్యక్తి మాట్లాడని మాటలను మాట్లాడినట్లు చూపించడం, అసలు జరగని సంఘటనను జరిగినట్లు వీడియోలో సృష్టించడం, మనకు పరిచయమైన వ్యక్తి గొంతును అచ్చుగుద్దినట్లు అనుకరించడం కృత్రిమ మేధస్సుతో సాధ్యమవుతోంది. డీప్‌ఫేక్‌లుగా పిలిచే ఈ కృత్రిమ దృశ్య, శ్రవ్య కంటెంట్ వేగంగా విస్తరిస్తుండటంతో సమాచార ప్రపంచంలో "ఏది నిజం?" అన్న ప్రశ్నకు ప్రాధాన్యం పెరుగుతోంది.

ఇది ఇక ఊహాజనిత ప్రమాదం కాదు. 2026లో బెంగళూరుకు చెందిన ఓ ప్రొఫెసర్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేరుతో రూపొందించిన డీప్‌ఫేక్ పెట్టుబడి వీడియోను నమ్మి రూ.61 లక్షలకు పైగా మోసపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. సెప్టెంబరు 2026లో సూరత్‌లో రాజ్యసభ సభ్యుడు గోవింద్‌భాయ్ ధోలాకియా డీప్‌ఫేక్ వీడియోను ఉపయోగించి పాత నాణేల పేరుతో మోసం చేసిన కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు.

దేశంలో డీప్‌ఫేక్‌ల వ్యాప్తి ఎంత వేగంగా పెరుగుతోందో కొన్ని గణాంకాలు కూడా చెబుతున్నాయి. 2026లో మెకాఫీ నిర్వహించిన సర్వే ప్రకారం భారతీయులు రోజుకు సగటున నాలుగు డీప్‌ఫేక్‌లను ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. సర్వేలో పాల్గొన్న వారిలో మూడింట ఒక వంతుకు పైగా డీప్‌ఫేక్ మోసాలను గుర్తించే విషయంలో తమకు పూర్తి నమ్మకం లేదని చెప్పారు. ఐదుగురిలో ఒకరు వాయిస్‌క్లోన్ మోసాన్ని ఎదుర్కొన్నట్లు తెలిపారు. భారతదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా కూడా పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. 2025లో మీడియా ద్వారా నమోదైన కృత్రిమ మేధస్సు సంబంధిత ఘటనల్లో సింథటిక్ మీడియాకు సంబంధించిన వాటి వాటా 2022తో పోలిస్తే రెండున్నరెట్లు పెరిగి, 2025 మూడో త్రైమాసికంలో 14 శాతాన్ని దాటిందని ఓఈసీడీ విశ్లేషణ వెల్లడించింది.

డీప్‌ఫేక్‌ల ప్రమాదం కేవలం వ్యక్తుల పరువు లేదా సామాజిక మాధ్యమాల తప్పుడు సమాచారానికే పరిమితం కాదు. ఆర్థిక వ్యవస్థలు కూడా దీని బారిన పడుతున్నాయి. 2024లో హాంకాంగ్‌లో ఒక ఉద్యోగిని నమ్మించేందుకు సంస్థ ఉన్నతాధికారుల కృత్రిమ వీడియోలు, స్వరాలను ఉపయోగించి సుమారు 2.5 కోట్ల డాలర్ల మోసం జరిగిన ఘటన ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇలాంటి పరిస్థితుల్లో వీడియో, ఆడియో, చిత్రాలను చూసి వెంటనే నిజమని నిర్ధారించుకునే పద్ధతికి ముగింపు పలకాల్సిన అవసరం ఉంది. కంటెంట్ ఎక్కడి నుంచి వచ్చింది?

**దేశంలో డీప్‌ఫేక్‌ల వ్యాప్తి ఎంత వేగంగా పెరుగుతోందో కొన్ని గణాంకాలు కూడా చెబుతున్నాయి.**

దాని అసలు మూలం ఏమిటి? ఎప్పుడు సృష్టించారు? మధ్యలో మార్పులు చేశారా? అనే వివరాలను ధృవీకరించే సాంకేతిక వ్యవస్థలు అందుబాటులోకి రావాలి. డిజిటల్ వాటర్‌మార్కులు, కంటెంట్ మూలాన్ని నమోదు చేసే ప్రమాణాలు, మార్పులను గుర్తించే సాంకేతిక పద్ధతులు విస్తృతంగా అమలు కావాలి. అయితే డీప్‌ఫేక్‌లను గుర్తించే కృత్రిమ మేధస్సుపై మాత్రమే ఆధారపడటం కూడా సరిపోదు. ఇటీవలి పరిశోధనలు డీప్‌ఫేక్ గుర్తింపు వ్యవస్థలు కొత్త తరహా కంటెంట్‌పై పనిచేసేటప్పుడు వాటి సామర్థ్యం తగ్గే అవకాశం ఉందని సూచిస్తున్నాయి. అందుకే సాంకేతిక పరిష్కారంతో పాటు మానవ అప్రమత్తత కూడా కీలకం.




సి. హెచ్.(ప్రతాప్)
77998 00773


# మంచి నీటితోనే ప్రజారోగ్య పరిరక్షణ

జీవులకు ప్రాణాధారం నీరు మాత్రమే. నీరు ఒక సార్వత్రిక ద్రావణి. జలం లేకుండా జీవనం సాగదు. ప్రకృతి ప్రసాదించిన సహజ అమూల్య వనరులుగా నీటి నిల్వలు కలిపిస్తాయి. నదులు, సరస్సులు, చెరువులు, వాగులు, సముద్రాలు, భూగర్భజలాలు లాంటి పలు నీటి వనరులు సకల ప్రాణికోటికి అందుబాటులో ఉన్నాయి. రసాయనశాస్త్ర పరంగా నీటిని త్రిపరమాణుక విజాతీయ అణువుగా నామకరణం చేశారు. రెండు హైడ్రోజన్ పరమాణువులు, ఒక ఆక్సీజన్ పరమాణువు కలిసి H2O అను రసాయన ఫార్ములాతో సూచించడం జరుగుతోంది. సురక్షిత మంచి నీరు అందించినపుడు మాత్రమే పలు వ్యాధులకు అడ్డుకట్టపడుతుంది. కలుషిత నీరు తాగితే కలరా, డయేరియా, టైఫాయిడ్, డిసెంట్రీ, హెపటైటిస్, మలేరియాసిస్ లాంటి తీవ్రమైన వ్యాధులు సోకుతాయి. మానవాళి ఎదుర్కొంటున్న 80 శాతం రోగాలకు కలుషిత తాగు నీరే కారణమని తెలుస్తున్నది. ప్రపంచ మరణాల్లో 5 శాతం వరకు కలుషిత నీటి వల్ల కలుగుతున్నట్లు నిర్ధారించారు. భారత్‌లో 70 మిలియన్ల మరణాలు డయేరియా కారణంగా నమోదు అవుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, విశ్వవ్యాప్తంగా ప్రతి ముగ్గురు జనాభాలో ఒక్కరు సురక్షిత నీటికి దూరంగా ఉన్నట్లు తెలుస్తున్నది.

**ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం:**

భూమండల ఉపరితలంపై 71 శాతం నీరు ఆక్రమించి ఉంది. ప్రపంచంలోనే నీటిలో 3 శాతం మాత్రమే సురక్షిత మంచి నీరుగా అందుబాటులో ఉన్నది. మిగిలిన 97 శాతం నీరు సముద్రాలు, మంచు కొండల రూపంలోనే ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా 40 శాతం ప్రజలకు స్వచ్ఛమైన సురక్షిత నీరు అందడం లేదు. పరిసరాల పరిశుభ్రతకు కూడా నీటి అవసరం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా తాగు, సాదు నీటి కొరతలను తట్టుకోవడానికి, అందుబాటులో ఉన్న నీటిని కలుషితం కాకుండా చూసుకోవడానికి, తరుచుగా నీటి నాణ్యతలను తెలుసుకోవడానికి సంబంధించిన అవగాహన కల్పించడానికి 2003 నుంచి అమెరికాకు చెందిన మంచి నీటి సంస్థ చొరవతో ప్రతి ఏట 18 సెప్టెంబర్ రోజున "ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం (వరల్డ్ వాటర్ మానిటరింగ్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం ఇతివృత్తంగా "నీరు సమానత్వం : నీరు ప్రవహించిన చోట సమానత్వం వృద్ధి చెందుతుంది" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. మనకు స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులను తరుచుగా పరీక్షించుకోవడం, నీటి నాణ్యత పట్ల అవగాహన కలిగి ఉండడం, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం లాంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం తప్పనిసరి అవుతున్నది. నీటి నాణ్యతను విచ్ఛిన్నం చేయడానికి పురుగు మందులు, రసాయన ఎరువులు, మురుగు నీరు, రసాయన వ్యర్థాలు, పరిశ్రమల వ్యర్థాలు, మానవ ప్రమేయం వ్యర్థాలతో నీరు కలుషితం కావడం, చమురు లీక్ కావడం లాంటివి దోహదపడుతున్నాయి. వీటికి తోడుగా ఉష్ణోగ్రత, ఆమ్లత్వం, కరిగి ఉన్న ఆక్సీజన్, క్లారిటీ లాంటివి కూడా పనిచేస్తాయి. నీటిని శుద్ధి చేయడానికి వడపోత, స్వేదనం, మరిగించడం, క్లోరినేషన్ లాంటివి దోహదపడతాయి.



**సురక్షిత తాగు, సాగు నీటి కోసం యుద్ధాలు వద్దు:**

నేడు అభివృద్ధి చెందుతున్న అల్పాదాయ ప్రపంచదేశాల్లో ఇథియోపియా, ఉగాండా, సోమాలియా, నైజీరియా, పాకిస్థాన్, మొజాంబిక్ లాంటి దేశాల్లో అధిక జనాభాకు సురక్షిత తాగు నీరు అందడం లేదు. నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, తరుచుగా నీటి నాణ్యతను పరీక్షించుకోవడం, సురక్షిత తాగు నీటి అవసరాలను అవగాహన పరచడం, సభలు/ సమావేశాలు నిర్వహించి నీటి పర్యవేక్షణ ప్రాధాన్యాన్ని వివరించడంతో లాంటి కార్యక్రమాలను తేపట్టాలి. నీటి రవాణాలో లీకేజీలను అడ్డుకోవడం, నల్లా నీరు వృధా కాకుండా చూసుకోవడం, సూక్ష్మ సేద్యం చేయడం, స్ప్రింక్లర్లను వాడడం, నీటి పొదుపు పట్ల విద్యార్థులకు అవగాహన కలిపించడం లాంటివి వివరించాలి. గ్రామీణ భారతంలో 83 శాతం, పట్టణ జనాభాలో 91 శాతం జనాభాకు సురక్షిత నీరు లభిస్తున్నట్లు ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జలంతో జనానికి విడదీయరాని బంధం ఉన్నది. పేదరికం, అధిక జనాభా, నిరక్షరాస్యత వంటి కారణాలు కూడా సురక్షిత నీటి లభ్యతకు ప్రతిబంధకాలుగా పని చేస్తున్నాయి. విద్య, వైద్యం, సురక్షిత తాగు నీరు లభించడం ఒక ప్రాథమిక హక్కు అని తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద అధికంగా ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా 3 బిలియన్ల ప్రజలు అంతర్జాతీయ నీటి వనరులపైన మాత్రమే ఆధారపడుతున్నట్లు, అందులో కేవలం 24 దేశాలు మాత్రమే ఒక అంతర్జాతీయ ఒప్పందాలను చేసుకున్నాయని తెలుస్తున్నది. తాగు, సాగు నీటి లభ్యతపై ప్రపంచ శాంతి ఆధారపడి ఉన్నది. నీటి కోసం వివిధ పౌర సమూహాలు, దేశాలు ఘర్షణ పడుతున్నాయి. సహజ నీటి వనరులను సక్రమంగా వాడుకోని యెడల కలుషిత జలాలు ఏరులైపారి రోగాలను వ్యాపింపజేస్తాయి. నేటి పౌర సమాజం నీటిని పొదుపుగా వాడుకుంటూ, కలుషితం కాకుండా చూసుకుంటూ, నీటి వనరులను పర్యవేక్షించుకుంటూ ఆయురారోగ్యాలతో మనుగడ సాగిద్దాం, నీటి ఆధార అనారోగ్యాలకు అడ్డుకట్ట వేద్దాం.




మధుసూదన్ రెడ్డి
9949700037


# ఎల్‌నినో కోరల్లో అన్నదాత

వాతావరణంలో చోటుచేసుకునే చిన్న మార్పు కూడా వ్యవసాయంపై ఎంతటి ప్రభావం చూపుతుందో మరోసారి స్పష్టమవుతోంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు, పెరిగిన ఉష్ణోగ్రతలు, భూగర్భ జలాలపై ఒత్తిడి, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు—ఇవన్నీ కలిసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సగటున సుమారు 20 శాతం వర్షపాతం లోటు నమోదవుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే రైతులకు ఈ పరిస్థితి మరింత భారంగా మారింది. వర్షాలు సకాలంలో కురవకపోవడం ఒక సమస్య అయితే, కురిసిన వర్షాలు కూడా సమంగా లేకపోవడం మరో సమస్యగా మారింది. కొన్ని ప్రాంతాల్లో వర్షాభావం నెలకొంటే, మరికొన్ని ప్రాంతాల్లో ఒక్కసారిగా కురిసే భారీ వర్షాలు నేలలోకి నీరు చొరబడే అవకాశాన్ని తగ్గిస్తున్నాయి. ఫలితంగా పంటలకు అవసరమైన సమయంలో తేమ అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాతావరణం అనిశ్చితంగా మారడంతో ఏ పంట వేయాలి, ఎప్పుడు వేయాలి, ఎంత పెట్టుబడి పెట్టాలి అనే విషయంలో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ముఖ్యంగా బోర్లు ఆధారంగా సాగుచేసిన వరి పంట పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నీటి లభ్యతపై నమ్మకం లేకపోవడంతో అనేక జిల్లాల్లో రైతులు వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గిస్తున్నారు. సాగు భూమి ఉన్నా నీరు లేకపోతే వ్యవసాయం చేయడం సాధ్యం కాదు. ఈ పరిస్థితి కేవలం ఒక సీజన్ పంట నష్టంతో ముగిసే సమస్య కాదు. వరుసగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు కొనసాగితే గ్రామీణ ఉపాధి, వ్యవసాయ అనుబంధ రంగాలు, మార్కెట్లు, రవాణా, చిన్న వ్యాపారాలు అన్నింటిపైనా దాని ప్రభావం పడుతుంది. ఇక విద్యుత్ కోతలు సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. బోర్లపై ఆధారపడే రైతులకు విద్యుత్ సరఫరా కీలకం. పగటిపూట విద్యుత్ అందుబాటులో లేకపోవడం, సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటం వల్ల రైతులు రాత్రివేళల్లోనూ పొలాల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. పంటకు నీరు పెట్టేందుకు రైతు ఎదుర్కొనే ఈ ఇబ్బందులు కేవలం వ్యవసాయ సమస్యగా చూడలేం. ఇది గ్రామీణ జీవన విధానాన్నే ప్రభావితం చేసే అంశం. ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందన్న అంచనాలు రైతుల్లో ఆందోళనను పెంచుతున్నాయి. వాతావరణ మార్పులు గతంలో కంటే వేగంగా, అనిశ్చితంగా కనిపిస్తున్న నేపథ్యంలో సంప్రదాయ వ్యవసాయ ప్రణాళికలు సరిపోవడం లేదు. ఒకప్పుడు ఋతువులపై కొంతవరకు ఆధారపడగలిగిన రైతు ఇప్పుడు వర్షం ఎప్పుడు వస్తుందో, ఎంత వస్తుందో, వేడి ఎంత పెరుగుతుందో ముందుగా అంచనా వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం స్పందన తక్షణం, సమన్వయంతో ఉండాలి. వర్షపాతం లోటు ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడి పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించాలి. రైతులకు వాతావరణ సమాచారాన్ని గ్రామస్థాయిలో సులభంగా అందుబాటులోకి తీసుకురావాలి. కేవలం వర్షం పడుతుందా లేదా అనే సమాచారంతో సరిపెట్టకుండా, పంటలపై దాని ప్రభావం, సాగునీటి లభ్యత, ఉష్ణోగ్రతలు, . అదే సమయంలో పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. నీటి వినియోగం అధికంగా ఉండే పంటలతో పాటు తక్కువ నీటితో సాగయ్యే పంటలను కూడా రైతులకు పరిచయం చేయాలి. అయితే దీనిని రైతులపై బలవంతంగా రుద్దకుండా, మార్కెట్ భరోసా, కనీస ధర, కొనుగోలు వ్యవస్థ, పంట బీమా వంటి అంశాలతో అనుసంధానించాలి. రైతుకు పంట మార్పు వల్ల ఆదాయం తగ్గిపోతుందనే భయం లేకుండా చేయడం ప్రభుత్వ బాధ్యత. పంట నష్టాల అంచనా కూడా పారదర్శకంగా, వేగంగా జరగాలి. వర్షాభావం లేదా నీటి కొరత వల్ల పంట దెబ్బతిన్న రైతులకు అందాల్సిన పరిహారం, బీమా ప్రయోజనాలు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలి. బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులకు పునర్వ్యవస్థీకరణ వంటి ఉపశమన చర్యలను పరిస్థితులకు అనుగుణంగా పరిశీలించాలి. రైతు సంక్షోభాన్ని కేవలం పంట నష్టంగా కాకుండా కుటుంబ ఆర్థిక భద్రతకు సంబంధించిన అంశంగా చూడాలి. ఎల్‌నినో ప్రకృతి పరిణామం కావచ్చు. దాని ప్రభావాన్ని పూర్తిగా నివారించడం మన చేతుల్లో ఉండకపోవచ్చు. కానీ దాని ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు ప్రణాళిక, సమర్థవంతమైన నీటి నిర్వహణ, నాణ్యమైన వాతావరణ సమాచారం, నిరంతర విద్యుత్ సరఫరా, పంట బీమా, మార్కెట్ మద్దతు వంటి చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. రైతు పొలంలో పంట ఎండిపోతే దాని ప్రభావం ఆ కుటుంబానికే పరిమితం కాదు. ఆ పంటతో అనుసంధానమైన కూలీ, వ్యాపారి, రవాణాదారుడు, మిల్లర్ నుంచి చివరకు వినియోగదారుడి వరకు ప్రతి ఒక్కరిపై ప్రభావం పడుతుంది. అందుకే ఎల్‌నినోను కేవలం వాతావరణ సమస్యగా కాకుండా ఆహార భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, రైతు జీవన భద్రతకు సంబంధించిన సమగ్ర సవాలుగా చూడాలి. ప్రకృతి ప్రతికూలతను ఎదుర్కోవడానికి రైతు ఒంటరిగా మిగలకూడదు. ఈ కష్టకాలంలో ప్రభుత్వ శాఖలు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, స్థానిక సంస్థలు, రైతు సంఘాలు కలిసి పనిచేయాలి. వర్షం కోసం ఎదురు చూడటంతో పాటు, వర్షం లేని పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలన్న దానిపై కూడా ముందస్తు కార్యాచరణ ఉండాలి. ఎండ తీవ్రత పెరిగే కొద్దీ ప్రభుత్వ బాధ్యత కూడా పెరగాలి. రైతు పొలంలో పచ్చదనం నిలవాలంటే పాలనలో ముందుచూపు, నీటి నిర్వహణలో క్రమశిక్షణ, సంక్షోభ సమయంలో వేగవంతమైన స్పందన అవసరం. ఎల్‌నినో రైతును ఎండబెట్టే పరిస్థితి రాకుండా చూడటం కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు—వ్యవసాయంపై ఆధారపడిన సమాజం మొత్తానికి సంబంధించిన బాధ్యత. ప్రకృతి విపత్తు ఎప్పుడు వస్తుందో మనం నిర్ణయించలేం. కానీ అది వచ్చినప్పుడు రైతు నష్టాన్ని ఎంతవరకు తగ్గించాలో మాత్రం మన నిర్ణయాలు నిర్ణయిస్తాయి. ఇప్పటికైనా మేల్కొని సమగ్ర కార్యాచరణ చేపడితే ఎండను ఎదుర్కొంటూనే రైతు ఆశను, వ్యవసాయాన్ని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవచ్చు




తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి
9948439565




# జాతీయం-అంతర్జాతీయం




# తీవ్ర ముప్పులో లింగ సమానత్వం

- రాజకీయాల్లో తగ్గిపోతున్న మహిళల ప్రాతినిధ్యం
- ఆందోళన వ్యక్తం చేసిన ప్రపంచ ఆర్థిక వేదిక
- కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి ఈ గణాంకాలే నిదర్శనం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17 (ఎ.ఎం.ఎస్) :** గత రెండు దశాబ్దాలుగా సాధించిన లింగ సమానత్వ పురోగతి ప్రస్తుతం తీవ్ర ముప్పులో పడిందని ప్రపంచ ఆర్థిక వేదిక ఆందోళన వ్యక్తం చేసింది. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం తగ్గిపోతుం





డటమే దీనికి ప్రధాన కారణమని విడుదల చేసిన 'గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ 2026' పేర్కొంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 69.2 శాతం లింగ సమానత్వం సాధించినప్పటికీ, పూర్తిస్థాయి సమానత్వం సిద్ధించడానికి మరో 120 ఏళ్లు పడుతుందని జెనీవా కేంద్రంగా పనిచేసే ఈ సంస్థ హెచ్చరించింది. కాగా, ఆ సూచికలో భారతదేశం 131వ స్థానంలో నిలిచింది. మొత్తం 145 దేశాల జాబితాలో కేవలం 14 దేశాలు మాత్రమే భారత్ కంటే వెనుకబడి ఉన్నాయి. దేశంలో మహిళల సమానత్వం, భాగస్వామ్యాన్ని నిర్ధారించడంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**ఈ నివేదికలోని కీలక అంశాలు:**

* తీవ్రమైన వ్యత్యాసాలు: వ్యాపార, రాజకీయ రంగాల్లో అగ్ర నాయకత్వ హోదాల్లో మహిళల ప్రాతినిధ్యం ఇంకా చాలా తక్కువగానే ఉంది. ప్రపంచవ్యాప్తంగా సీఈఓ పోస్టుల్లో మహిళలు 20 శాతం కంటే తక్కువగానే ఉన్నారు. అలాగే, మహిళలు నిర్వహించే మంత్రిత్వ శాఖల్లో కేవలం 10 శాతం మాత్రమే కీలకమైనవిగా ఉన్నాయి.

* ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ : ఏఐ రంగంలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతున్నప్పటికీ, ఏఐ ఇంజనీర్లలో మహిళల సంఖ్య 20 శాతం కంటే తక్కువగా ఉండటం గమనార్హం.* ఐస్‌లాండ్ అగ్రస్థానం: వరుసగా 17వ ఏడాది ఐస్‌లాండ్ 93 శాతం సమానత్వంతో మొదటి స్థానంలో నిలిచింది. ఫిన్లాండ్, నార్వే, నమీబియా, యూకే తదుపరి స్థానాల్లో ఉన్నాయి.

* అగ్రరాజ్యాలకు దిగజారిన ర్యాంకులు: అమెరికా గత ఏడాదితో పోలిస్తే ఐదు స్థానాలు దిగజారి 47వ ర్యాంకుకు పడిపోయింది. అమెరికా కేబినెట్‌లో మహిళా మంత్రుల సంఖ్య తగ్గడమే దీనికి కారణం.

*టాప్ 10దేశాలు


*131వ స్థానంలోనే భారత్ : మొత్తం 145 దేశాల జాబితాలో భారత్ 131వ స్థానంలో కొనసాగుతోంది. ప్రపంచ ఆమోదిత సగటు 69.2 శాతంతో పోలిస్తే, అత్యధిక జనాభా కలిగిన భారత్‌లో లింగ సమానత్వ శాతం కేవలం 64.5 శాతంగానే ఉండి ఆందోళన కలిగిస్తోంది. భారత్ కంటే వెనుక కేవలం 14 దేశాలు మాత్రమే ఉన్నాయని ఈ గణాంకాలు చెబుతున్నాయి. పాపువా న్యూగినియా, కువైట్, ఒమన్, ఖతార్, తజికిస్తాన్, సౌదీ అరేబియా, ఈజిప్ట్, మొరాకో, మాలి, అల్జీరియా, కాంగో వంటి కొన్ని దేశాలు మాత్రమే ఈ సూచికలో భారత్ కంటే వెనుకబడి ఉన్నాయి. ఆర్థిక భాగస్వామ్యం, అవకాశాలను కొలిచే సబ్‌ఇండెక్స్‌లో భారత్ స్కోరు 41.2 శాతంగా ఉంది. ఇది గతేడాది కంటే 0.5 శాతం పెరిగినప్పటికీ, 2013లో భారత్ సాధించిన అత్యుత్తమ స్కోరు కంటే 3.5 శాతం తక్కువగా ఉండటం గమనార్హం.* ఉపాధి, ఆర్థిక భాగస్వామ్యం: భారత్‌లో విద్యాభ్యాసంలో సాధించిన ప్రగతి వల్ల కొంత పురోగతి కనిపించినప్పటికీ, ఉపాధి రంగంలో మహిళల భాగస్వామ్యం గత 20 ఏళ్లుగా పెద్దగా మారలేదు. ఆర్థిక భాగస్వామ్యం, అవకాశాల ఉపసూచికలో భారత్ స్కోరు 41.2 శాతంగా నమోదు కాగా, ఇది గతేడాది కంటే 0.5 శాతం పెరిగినప్పటికీ, 2013లో నమోదైన గరిష్ఠ స్కోరు కంటే ఇంకా 3.5 శాతం తక్కువగా ఉంది.* పదవులు, ప్రాతినిధ్యం: ప్రొఫెషనల్, టెక్నికల్ ఉద్యోగాల్లో మహిళల శాతం 49.9 శాతానికి చేరుకోగా, శాసనసభ్యులు, సీనియర్ అధికారులు, మేనేజర్లలో మహిళల వాటా కేవలం 13.1 శాతంగానే ఉందని నివేదిక తెలిపింది.* రాజకీయాల్లో మహిళలు: పార్లమెంట్‌లో మహిళల ప్రాతినిధ్యం 16.1 శాతానికి పెరిగినప్పటికీ, కేంద్ర కేబినెట్‌లో మహిళా మంత్రుల భాగస్వామ్యం 2019లో ఉన్న 30 శాతం గరిష్ఠం నుండి ప్రస్తుతం 5.9 శాతానికి పడిపోయింది.మరోవైపు, ఆసియా ఖండంలో పొరుగున ఉన్న చైనా ఏడు స్థానాలు ఎగబాకి 96వ ర్యాంకు సాధించగా, ఆఫ్రికా ఖండానికి చెందిన నమీబియా 4వ స్థానం దక్కించుకోవడం విశేషం. ప్రపంచ ఆర్థిక వేదిక మేనేజింగ్ డైరెక్టర్ సాదియా జహిదీ మాట్లాడుతూ... "లింగ సమానత్వం అనేది ఆర్థిక వృద్ధికి ప్రాతిపదిక. ప్రభుత్వాలు, యజమానులు సరైన విధానాలను మరింత వేగంగా అమలు చేయాలి" అని పిలుపునిచ్చారు.

# మన ఎగుమతులపై వంద శాతం సుంకాలు

- అమెరికా నిర్ణయం
- బిల్లుకు సభలో కీలక ముందడుగు
- మోడీ సర్కారుకు దౌత్య, ఆర్థిక సవాలు

**వాషింగ్టన్, సెప్టెంబరు 17 :** రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై మరింత ఆర్థిక ఒత్తిడి తీసుకొచ్చేందుకు అమెరికా ముందడుగు వేసింది. రష్యా, ఇరాన్‌పై ఆంక్షలను కఠినతరం చేసే బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభలో కీలక అడుగు పడింది. ఈ చట్టం అమలులోకి వస్తే భారత్ నుంచి అమెరికాకు వెళ్లే ఎగుమతులపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం అధ్యక్షుడు ట్రంప్‌నకు లభించే అవకాశం ఉంది. దీనితో ఇప్పటికే వాణిజ్య, దౌత్యపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న మోడీ ప్రభుత్వానికి మరో సవాలు ఎదుకానుంది.

'లిండ్సే ఓ. గ్రాహమ్ శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్-2026' పేరుతో రూపొందించిన బిల్లును అమెరికా ప్రతినిధుల సభ మంగళవారం 214-211 ఓట్ల తేడాతో తదుపరి దశకు పంపింది. ఇది బిల్లుకు తుది ఆమోదం కాదు. బుధవారం తుది ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ఆగస్టులో అమెరికా సెనెట్ ఈ బిల్లును 86-11 ఓట్లతో ఆమోదించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ నాయ




కత్వం, ఆ దేశ ఆర్థిక సంస్థలు, ఇంధన రంగంపై ఆంక్షలను కఠినతరం చేయడం బిల్లు ప్రధాన లక్ష్యం. బిల్లు చట్టంగా మారితే రష్యా నుంచి పెద్ద మొత్తంలో ముడిచమురు, సహజవాయువు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి దక్కుతుంది. సెనెట్ ఆమోదించిన ముసాయిదాలో రష్యా చమురు, గ్యాస్‌ను అత్యధికంగా దిగుమతి చేసుకునే ఐదు దేశాలను ప్రస్తావించారు. ప్రతినిధుల సభలో డెమొక్రటిక్ సభ్యుడు స్టెనీ హోయర్ ప్రవేశపెట్టిన సవరణలో భారత్ సహా పది దేశాలను స్పష్టంగా పేర్కొనే ప్రతిపాదన ఉంది. చైనా, టర్కీ, అజర్‌బైజాన్, హంగేరీ, స్లోవేకియా, యూఏఈ, సింగపూర్, కజకిస్తాన్, కిర్గిజిస్తాన్ కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

బిల్లులో అధ్యక్షుడికి విస్తృత సుంకాధికారాలు ఇవ్వడంపై కొందరు అమెరికా చట్టసభ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రతినిధుల సభ విదేశీ వ్యవహారాల కమిటీలో డెమొక్రటిక్ పార్టీకి చెందిన గ్రెగరీ మీక్స్ అధ్యక్షుడికి ఇస్తున్న విస్తృత అధికారాలను ప్రశ్నించారు. సుంకాల విధింపుపై స్పష్టమైన పరిమితులు, నియంత్రణలు ఉండాలని ఆయన కోరుతున్నారు. అమెరికా భారత్‌పై 100 శాతం సుంకాలను అమలు చేస్తే, అమెరికా మార్కెట్‌కు భారత ఉత్పత్తులను ఎగుమతి చేసే సంస్థలపై అదనపు ఆర్థిక భారం పడవచ్చు. భారతీయ వస్తువుల దిగుమతి వ్యయం పెరగడం వల్ల వాటి పోటీతత్వం ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ఎగుమతులపై ప్రభావం ఏ మేరకు ఉంటుందనేది సుంకాల తుది రేటు, వర్తించే ఉత్పత్తులు, మినహాయింపులు, అమలు విధానంపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం భారత్‌పై ఈ బిల్లు కింద 100 శాతం సుంకాలు విధించలేదు.

# వీధి కుక్కలపై వినూత్న నిరసన



- మహారాష్ట్రలో ఘటన

**నాసిక్, సెప్టెంబరు 17 (ఎ.ఎం.ఎస్) :** మహారాష్ట్రలోని నాసిక్‌లో వీధి కుక్కల బెడదతో విసిగిపోయిన స్థానికులతో కలిసి యువసేన నేతలు వినూత్నంగా నిరసన తెలిపారు. వీధి కుక్కలను పట్టి సంచుల్లో తెచ్చి అధికారి బల్లపై వాటిని వదిలిపెట్టారు. ఇది చూసి ఆ అధికారి షాక్ అయ్యారు. అలాగే ఆయన మెడలో నోట్ల దండలు వేసేందుకు యువసేన నేతలు ప్రయత్నించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. సెప్టెంబర్ 15న ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ)కు చెందిన యువసేన కార్యకర్తలు నిఫాడ్ నగర్ పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. యువసేన జిల్లా అధ్యక్షుడు వి ంధవే ఒక సంచిని విప్పారు. అందులో ఉన్న చిన్న కుక్కను అధికారి ధీరజ్ భమ్రే టేబుల్‌పై వదిలారు. షాకైన ఆ అధికారి తన కుర్చీ నుంచి లేచి వెనక్కి జరిగారు.

# పరివార్‌కు బాధితురాలిగా ఐపీఎస్ అధికారిణి

- బుష్రా బానోను అకస్మాత్తుగా బదిలీ చేసిన ప్రభుత్వం
- ఉత్తర్వులు జారీ

**ఖరగ్‌పూర్, సెప్టెంబరు 17 (ఎ.ఎం.ఎస్) :** దేశంలో మైనారిటీలపై సంఘ పరివార్ గ్రూపులు సాగిస్తున్న ద్వేషపూరిత ప్రచారానికి, బెదిరింపులకు ఐపీఎస్ అధికారి డా. బుష్రా బాను తాజా బాధితురాలిగా మారారు. ఖరగ్‌పూర్ అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న 2021 బ్యాచ్ ఐపీఎస్ అధికారిణి డాక్టర్ బుష్రా బానో హఠాత్ బదిలీ దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. యూపీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించడానికి తనకు అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీకి చెందిన 'రెసిడెన్షియల్ కోచింగ్ అకాడమీ' ఎంతగానో సహాయపడిందని వివరిస్తూ ఆమె ఇటీవల ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ వీడియో వెలువడిన రెండున్నర



నెలలకే ఆమెను పశ్చిమ బెంగాల్ రాష్ట్ర సాయుధ దళాల 4వ బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

'హిందూ లీగల్ ఫండ్' అనే సంస్థ ఈ వివాదంలో ప్రధాన పాత్ర పోషించింది. వీడియోలో బుష్రా బానో 'అస్సలాము అలైకుమ్', 'ఇన్షా అల్లాహ్' అనే పదాలను వాడటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ సంస్థ రాష్ట్ర హోమ్ కార్యదర్శికి ఫిర్యాదు చేసింది. "ప్రభుత్వ హోదాలో ఉన్న అధికారిణి 'వందే మాతరం' లేదా 'జై హింద్' అనకుండా, మతపరమైన పదాలు ఎలా వాడతారు?" అని సదరు సంస్థ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రశ్నించింది. సెప్టెంబర్ 14న ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన ప్రభుత్వం... ఆమెను బదిలీ చేసి, ఖరగ్‌పూర్ అడిషనల్ ఎస్పీగా పార్థ ఘోష్‌ను నియమించింది.

అయితే, సువేందు అధికారి ప్రభుత్వం ఈ బదిలీని సాధారణ పరిపాలనా ప్రక్రియ మాత్రమేనని ప్రకటించినప్పటికీ, మతపరమైన ఒత్తిళ్లకు లొంగే ఈ చర్య తీసుకున్నారని విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సివిల్స్ అభ్యర్థులను ప్రోత్సహించేందుకు ఒక అధికారిణి చేసిన వ్యక్తిగత సందేశాన్ని ప్రభుత్వ ప్రకటనగా చూడలేమని, దాంట్లో వాడిన సాధారణ సంభాషణలపై అభ్యంతరం చెప్పడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. బీజేపీ నాయకులు ప్రభుత్వ కార్యక్రమాల్లో బహిరంగంగా మతపరమైన ప్రసంగాలు చేస్తున్నప్పుడు లేని అభ్యంతరం, ఒక ముస్లిం అధికారిణి సాధారణ మాటలు మాట్లాడితే ఎందుకు అభ్యంతరం వస్తోందని విపక్షాలు నిలదీస్తున్నాయి.

ఈ వీడియో వెలుగులోకి వచ్చిన తర్వాత, బుష్రా బాను ఫొటోలను జోడించి ఆమెపై విపరీతమైన ట్రోలింగ్, సైబర్ దాడులు ప్రారంభమయ్యాయి. రాజ్యాంగం ప్రసాదించిన వ్యక్తిగత స్వేచ్ఛను, లౌకిక విలువలను పూర్తిగా కాలరాస్తూ బిజెపి దేశంలో వర్గ విద్వేషాన్ని రెచ్చగొడుతోందని తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, బుష్రా బానో ప్రస్తావించిన అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ సంస్థ కూడా నిరంతరం సంఘ పరివార్ లక్ష్యంగా మారుతోందని, అయినప్పటికీ యూపీఎస్సీ శిక్షణలో ఆ సంస్థ సాధిస్తున్న అత్యుత్తమ ఫలితాలను ఎవరూ విస్మరించలేరని పలువురు గుర్తుచేస్తున్నారు.

# సిక్కింలో విరిగిపడిన కొండచరియలు

- స్థానికులకు ఇబ్బందులు

**గాంగ్‌టక్, సెప్టెంబరు 17 (ఎ.ఎం.ఎస్) :** సిక్కింలో కురిసిన భారీ వర్షాల కారణంగా గురువారం గ్యాంగ్‌టక్‌లోని టాడాంగ్‌లో గల లింగ్డింగ్ వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. ప్రమాద ధాటికి ఒక ఇల్లు పాక్షికంగా దెబ్బతినడంతో పాటు, ఆ ప్రాంతంలో రహదారి అనుసంధానానికి అంతరాయం ఏర్పడింది. ఈ కొండచరియల విపత్తు కారణంగా జె.ఎన్. భట్టరాయ్ ఇల్లు పాక్షికంగా దెబ్బతినగా, మొదటి అంతస్తులోని గదుల్లోకి నీరు, బురద చేరాయి. ఆ ప్రాంతానికి నీటిని సరఫరా చేసే మూడు ప్రధాన పైప్‌లైన్‌లు కూడా



దెబ్బతినడంతో, స్థానిక నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. స్థానిక నివాసితుల ప్రకారం,

లింగ్డింగ్ ఝోరా సమీపంలోని రహదారి తెల్లవారుజామున 3 గంటల నుండి 9 గంటల వరకు పూర్తిగా పైప్ లైన్ తెగిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

# టాటా చైర్మెన్‌గా మళ్లీ చంద్రశేఖరన్




- టాటా చైర్మెన్‌గా మళ్లీ చంద్రశేఖరన్

**ముంబయి, సెప్టెంబరు 17 (ఎ.ఎం.ఎస్) :** టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్‌ను మరో ఐదేళ్ల పాటు కొనసాగించేందుకు టాటా సన్స్ బోర్డు ఆమోదం తెలిపింది. గురువారం నిర్వహించిన బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. గత నెలలో తాను ఈ పదవిలో రెండోసారి కొనసాగడానికి ఇష్టపడట్లేదని ప్రకటించిన చంద్రశేఖరన్.. బోర్డు అభ్యర్థన మేరకు తాజాగా తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఆయన ప్రస్తుత పదవీ కాలం ఫిబ్రవరి 2027తో ముగియనుండగా.. తాజా ఆమోదంతో మరో 5 సంవత్సరాల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

# గురి తప్పని ఇరాన్ క్షిపణులు

- అమెరికా సైనిక స్థావరాలపై ప్రయోగం
- రష్యా ఉపగ్రహ సమాచారమే కీలకం

**టెహ్రాన్, సెప్టెంబరు 17 :** మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ దాడుల్లో చాలా వరకూ గురి తప్పకుండా నేరుగా లక్ష్యాలను తాకుతున్నాయి. రష్యా ఉపగ్రహాలు అందజేస్తున్న సమాచారమే దీనికి కారణమని సీఎన్ఎన్ వార్తా సంస్థ విశ్లేషించింది. మార్చి 27న సౌదీ అరేబియాలో అమెరికాకు చెందిన 'ప్రిన్స్ సుల్తాన్' వైమానిక స్థావరంపై ఇరాన్ దాడి చేసింది. దానికి రెండు రోజుల ముందు రష్యాకు చెందిన 14 గూఢచర్య ఉపగ్రహాలు ఆ స్థావరంపై తిరిగాయి. అవి ప్రయాణించిన సమయం, క్రమం కారణంగా ఆ స్థావరానికి సంబంధించిన




పూర్తి సమాచారాన్ని ఇరాన్ సేకరించగలిగింది. ఈ ఉపగ్రహాలు వీడియోలను చిత్రీకరించడంతో పాటు కమ్యూనికేషన్ వ్యవస్థకు కూడా అంతరాయం కలిగించాయి. అమెరికా స్థావరంపై ఇరాన్ జరిపిన ఆ దాడిలో 12 మంది సైనికులు గాయపడ్డారు. రాడార్‌ను గుర్తించి, దానిని నియంత్రించే అమెరికా విమానం ధ్వంసమైంది. దీని విలువ అనేక వందల మిలియన్లు ఉంటుందని అంచనా. మధ్య ప్రాచ్యంలోని అమెరికా స్థావరాలు, కమాండ్ కేంద్రాలు, లాజిస్టిక్ సౌకర్యాలు, నౌకాదళ మౌలిక సదుపాయాలపై దాడులకు ప్రణాళికలు రూపొందించడానికి కూడా రష్యా ఉపగ్రహ డేటాను ఉపయోగించవచ్చని సీఎన్ఎన్ తెలిపింది. జూలైలో సీఐఏకి చెందిన మౌలిక సదుపాయాలపై ఇరాన్ జరిపిన దాడులలో రష్యా ప్రమేయంపై అమెరికా నిఘా సంస్థలు విచారణ జరుపుతున్నాయి.

# ఉదంపూర్ లో ఎన్‌కౌంటర్



- ఇద్దరు ఉగ్రవాదులు హతం

**శ్రీనగర్, సెప్టెంబరు 17 (ఎ.ఎం.ఎస్) :** జమ్మూకశ్మీర్‌లోని ఉదంపూర్ జిల్లాలో గురువారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతం అయ్యారు. ఉదంపూర్ జిల్లాలోని మజాల్తాలో అనుమానాస్పద కదలికలు ఉన్నట్లు బుధవారం సాయంత్రం అధికారులకు సమాచారం అందింది. దీంతో సంయుక్త బలగాలు ఆ ప్రదేశంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఆ తర్వాత ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య కాల్పులు మొదలయ్యాయి.

గన్‌ఫైట్ సమయంలో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఇంకా కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు చెప్పారు.

అయితే హతమైన ఉగ్రవాదుల ఐడెంటిటీ ఇంకా తెలియాల్సి ఉన్నది. జమ్మూకశ్మీర్ పోలీసులు, స్పెషల్ పారాట్రూపర్లు తొలుత సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. ఎన్‌కౌంటర్ స్టార్ట్ కావడంతో ఆ ప్రదేశానికి అదనపు బలగాలు హుటాహుటిన చేరుకున్నాయి. ఇండియన్ ఆర్మీ, సీఆర్పీఎఫ్, జేకే పోలీసు ఎస్ఓజీ కూడా సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. ఇటీవల పిర్ పంజల్ ప్రాంతంలో లష్కరే తోయిబాకు చెందిన ఓ అండర్‌గ్రౌండ్ నెట్వర్క్‌ను గుట్టు విప్పిన నేపథ్యంలో అక్కడ భద్రతను పెంచారు. పిర్ పంజాల్ ప్రాంతంలో టెర్రర్ మాడ్యూల్ నడిపిస్తున్న ముగ్గురు వ్యక్తులను సెప్టెంబర్ 15వ తేదీన అదుపులోకి తీసుకున్నారు.

# నైజీరియాలో కలుషిత పానీయం కలకలం



- 48 మంది మృతి

**ఒండో, సెప్టెంబరు 17 :** దక్షిణ నైజీరియాలోని ఒండో రాష్ట్రంలో కలుషిత పానీయం సేవించి కనీసం 48 మంది మృతి చెందారు. మరో 100 మందికి పైగా చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. ఒడిగ్బో, ఇరెలే ప్రాంతాల్లో ఈ ఘటనలు నమోదయ్యాయి. మిథనాల్ ఉన్నట్లు అనుమానిస్తున్న పానీయం తాగడంతో మూత్రపిండాలు, కళ్లు, మెదడుపై తీవ్ర ప్రభావం పడినట్లు ఆరోగ్యశాఖ కమిషనర్ బంజి అజాకా తెలిపారు. మరో 100 మందికి పైగా చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. ఒడిగ్బో, ఇరెలే ప్రాంతాల్లో ఈ ఘటనలు నమోదయ్యాయి. మిథనాల్ ఉన్నట్లు అనుమానిస్తున్న పానీయం తాగడంతో మూత్రపిండాలు, ఈ ఘటనకు సంబంధించి 15 మందిని అరెస్ట్ చేశారు. వారిలో ఒకరు మిథనాల్ కలిసిన మద్యం తయారు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దాదాపు రెండు వారాల క్రితం తొలి మరణం నమోదైనట్లు సమాచారం.

# హాల్ మార్కింగ్ ఛార్జీలు 67 శాతం పెంపు

**ముంబయి, సెప్టెంబరు 17 (ఎ.ఎం.ఎస్):** బంగారు ఆభరణాల హాల్‌మార్కింగ్ ఛార్జీలను బీఐఎస్ 67 శాతం పెంచింది. సెప్టెంబర్ 14 నుంచి ఒక్కో బంగారు నగపై ఛార్జీ రూ.45 నుంచి రూ.75కు పెరిగింది. దీంతో ఒక్కో ఆభరణంపై రూ.30 అదనపు భారం పడనుంది. ఈ వ్యయాన్ని వ్యాపారులు వినియోగదారులపై మోపే అవకాశం ఉంది. అయితే వెండి ఆభరణాల హాల్‌మార్కిం



గ్ ఛార్జీలో ఎలాంటి మార్పు చేయలేదు. పరిశ్రమ వర్గాలతో సంప్రదింపులు జరిపి పెంపును సమీక్షించాలని జీజేసీ కోరింది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం



**ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ప్రభుత్వ ప్రాథమిక ఎజెండా**

**హైదరాబాద్‌కు దీటుగా హనుమకొండ–వరంగల్ జంట నగరాల అభివృద్ధి**

**హనుమకొండ, సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి) :**

తెలంగాణ ప్రజలు నిజాం రాచరికం నుంచి విముక్తి పొంది ప్రజాస్వామ్య ప్రస్థానానికి నాంది పలికిన సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ ప్రజాపాలనా దినోత్సవం'గా ఘనంగా నిర్వహించింది. హనుమకొండ జిల్లాలో ఏర్పాటు చేసిన వేడుకల్లో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యమకారులు, పాత్రికేయులు మరియు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

ప్రజా ప్రభుత్వ 33 నెలల ప్రగతి ప్రాధాన్యాలు:

సామాజిక న్యాయం – ఆర్థిక బలం: స్వప్ర యోజనాల కోసం అమరుల త్యాగాలను పల్చన చేయకుండా స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం 202526లో రాష్ట్ర తలసరి ఆదాయం ₹4,18,931కి చేరి, జాతీయ సగటు కంటే 91% అధికంగా నమోదైంది. రైతు సంక్షేమం: ₹2 లక్షల వరకు పంట రుణాల మాఫీ ద్వారా 25.35 లక్షల రైతు కుటుంబాలకు ₹21,000 కోట్ల లబ్ధి చేకూర్చగా, గడిచిన 33 నెలల్లో 'రైతు భరోసా' కింద ₹36,000 కోట్లు అందించడం జరిగింది. వరి సాగు, దిగుబడిలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. భూసంస్కరణలు & రీసర్వే: చారిత్రాత్మక 'భూభారతి' చట్టం ద్వారా ఇప్పటివరకు 12.40 లక్షలకు పైగా పాస్‌బుక్కులు అందజేశారు. 125 ఏళ్ల తర్వాత చేపట్టిన రీసర్వేతో ప్రతి భూకమతానికి ప్రత్యేక 'భూధార్' సంఖ్యను కేటాయిస్తున్నారు.మహిళా సాధికారత: 'మహాలక్ష్మి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించి, ఇప్పటివరకు ₹12,000 కోట్లు ఆదా అయ్యేలా చూశాం. 42.90 లక్షల కుటుంబాలకు ₹500కే గ్యాస్ సిలిండర్, 'గృహజ్యోతి' ద్వారా 53.09 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. విద్య, ఉద్యోగాలు వైద్యం ప్రభుత్వ శాఖల్లో 72 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు పూర్తికాగా, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయి. 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' నిర్మాణంతో పాటు, విద్యాశాఖ పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28 నుంచి 18వ స్థానానికి మెరుగైంది. గోషామహల్‌లో 2,000 పడకల ఉస్మానియా ఆసుపత్రి, టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణంతో వైద్యరంగం బలోపేతమవుతోంది. హనుమకొండ వరంగల్ జిల్లా ప్రగతి నివేదిక హైదరాబాద్‌కు దీటుగా హనుమకొండ-వరంగల్‌ను సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక మాస్టర్ ప్లాన్ అమలు చేస్తోందని వెల్లడించారు. మౌలిక వసతులు: తాగునీరు, డ్రైనేజీ అభివృద్ధికి ₹551 కోట్లు, 200 అడుగుల ఇన్నర్ రింగ్ రోడ్డు (45 కి.మీ) నిర్మాణానికి ₹572 కోట్లు, మరియు ఆర్‌అండ్‌బీ ద్వారా ₹574 కోట్ల రహదారుల పనులు పురోగతిలో ఉన్నాయి. విమానాశ్రయం, విద్య వరంగల్ ప్రజల దశాబ్దాల కల అయిన మామునూరు విమానాశ్రయాన్ని సాకారం చేస్తున్నాం.జిల్లాలో 4 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, 2 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరయ్యాయి. తాగునీరు, సాగునీరు ఎలినోవా ప్రభావాన్ని ఎదుర్కొంటూ దేవాదుల ప్రాజెక్టు ద్వారా ధర్మసాగర్, చలివాగు ప్రాజెక్టులను నింపి నగరానికి తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

వరంగల్ చారిత్రక వారసత్వాన్ని పరిరక్షిస్తూనే, ఆధునిక సాంకేతికత, పారిశ్రామిక అభివృద్ధితో హనుమకొండ-వరంగల్‌ను ముందుకు తీసుకెళ్తామని ఆకాంక్షించారు.

## అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**సూర్యాపేట, సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి):**

అమరుల త్యాగాల ఫలితంగానే స్వరాష్ట్ర ఆకాంక్ష నెరవేరిందని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జరిగిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని, 1948లో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్ లో విలీనమై 79వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. రాచరిక వ్యవస్థ నుండి ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిర్భావం కోసం పోరాడిన సాయుధ రైతాంగ పోరాట యోధులకు, స్వాతంత్ర్య సమరయోధులకు జోహార్లు అర్పించారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం, ఆపరేషన్ పోలో, ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు చరిత్రను వివరించారు. సోనియా గాంధీ చలించి 2014 జూన్ 2న ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. అమరుల ఆశయాలకు గుర్తుగా కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ, హార్టికల్చర్ సంస్థకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేర్లు పెట్టామని తెలిపారు.

జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మంత్రి వెల్లడి:

మహాలక్ష్మి: జిల్లాలో ఇప్పటివరకు 5.81 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేయగా రూ.355 కోట్లు ఆదా చేసుకున్నారు. రూ.500 గ్యాస్ సిలిండర్ పై 4.05 లక్షల మందికి రూ.19 కోట్ల సబ్సిడీ.

గృహజ్యోతి: 1,91,803 మందికి రూ.164.77 కోట్ల ఉచిత విద్యుత్ రాయితీ.

రైతు భరోసా: వానాకాలం 2026 కింద 2.90 లక్షల మంది రైతులకు రూ.364.08 కోట్లు జమ. రైతు బీమా కింద 739 కుటుంబాలకు రూ.36.95 కోట్లు, సన్నవరి బోనస్ గా రూ.118.41 కోట్లు.

సన్నబియ్యం: 3.72 లక్షల కార్డుదారులకు నెలకు 6,835 టన్నుల సన్నబియ్యం. కొత్తగా 48,493 రేషన్ కార్డులు జారీ.

ఇందిరమ్మ ఇండ్లు: జిల్లాకు 12,868 ఇండ్లు మంజూరు, రూ.179 కోట్లు జమ. హుజూర్ నగర్ లో 2,160 2 బిహెచ్ కే ఇండ్లు పూర్తి, 3,225 2 బిహెచ్ కే ఇండ్లలో 2,875 అందజేశాం.

విద్య, వైద్యం: హుజూర్ నగర్, కోదాడ, తుంగతుర్తిలో రూ.600 కోట్లతో యంగ్ ఇండియా స్కూల్స్, కోదాడలో నవోదయ, హుజూర్ నగర్ లో రూ.126 కోట్లతో వ్యవసాయ కళాశాల. ఆరోగ్యశ్రీ కింద 23,310 మందికి రూ.69.40 కోట్ల ఉచిత చికిత్స.

సాగునీరు: 5.82 లక్షల ఎకరాల ఆయకట్టు. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ కు రూ.1649 కోట్లు, జవహర్ జాన్‌పహాడ్ కెనాల్ కు రూ.292 కోట్లు, మరో 6 లిఫ్టులకు రూ.496 కోట్లు కేటాయింపు.

శాంతిభద్రతలు: షీ టీమ్స్, భరోసా కేంద్రాలు పటిష్టం.డయల్ 100కు 6.10 నిమిషాల్లోనే స్పందన. అనంతరం బాల భవన్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కే నరసింహా, అదనపు కలెక్టర్ హరిసింగ్, డీఆర్ఓ ప్రేమ్ రాజ్, ఆర్డీఓ వేణుమాధవ్, మార్కెట్ చైర్మన్ వేణారెడ్డి,జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మలక్ పేట యశోద వైద్యుల ప్రతిభతో మహిళకు పునర్జన్మ



**– తీవ్ర న్యుమోనియా నుంచి ఊరట: యశోద పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రణయ్ సాయి సమర్థవంతమైన చికిత్స**

**హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి) :**

తీవ్రమైన న్యుమోనియాతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ఒక మధ్య వయస్సు గల మహిళకు మలక్‌పేట యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. గురువారం రోజున హనుమకొండ యశోద క్లినిక్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రణయ్ సాయి చంద్రగిరి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బాధితురాలి పరిస్థితి: సదరు మహిళ వారం రోజులుగా జ్వరం, తలనొప్పితో పాటు రోజులుగా తీవ్రమైన ఆయాసం (గ్రేడ్3), నడుము పక్కభాగంలో నొప్పితో ఆసుపత్రిలో చేరారు. వైద్య పరీక్షల్లో ఆమె రెండు ఊపిరితిత్తుల్లో తీవ్రమైన కమ్యూనిటీ అక్వైర్డ్ న్యుమోనియా (CAP) ప్రస్తుతం, P/F రేషియో 115కు పడిపోయి టైప్ 1 రెస్పిరేటరీ ఫెయిల్యూర్ (ARDS) ఉన్నట్లు గుర్తించారు. అత్యంత ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమెకు సరైన సమయంలో అధునాతన శ్వాస సహాయం, నిరంతర మానిటరింగ్, క్రిటికల్ కేర్ బృందం సమన్వయంతో క్లిష్టమైన దశ నుంచి సురక్షితంగా బయటపడేలా చికిత్స అందించారు. అలసత్వం వద్దు వైద్యుల సూచనలు పాటించాలి. జ్వరం తగ్గకుండా కొనసాగడం, ఆయాసం పెరగడం, వేగంగా శ్వాస తీసుకోవడం లేదా ఆక్సిజన్ స్థాయిలు పడిపోవడం వంటి లక్షణాలను సాధారణ ఇన్ఫెక్షన్‌గా భావించి నిర్లక్ష్యం చేయవద్దని డాక్టర్ ప్రణయ్ సాయి చంద్రగిరి హెచ్చరించారు. తీవ్రమైన న్యుమోనియా వేగంగా విస్తరించి ఊపిరితిత్తులను దెబ్బతీస్తుందని, ప్రారంభ దశలోనే సరైన వైద్య సహాయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఆసుపత్రి ప్రతినిధులు వినయ్ కుమార్, మార్కెటింగ్ మేనేజర్ వాసు కిరణ్ రెడ్డి, ప్రశాంత్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గంగయ్య పాల్గొన్నారు.

## అంబేద్కర్ ను కించపరిస్తే ఊరుకోం రచయితపై చర్య తీసుకోవాలి

### ఐఎంఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఆనందరావు ఫిర్యాదు



**సూర్యాపేట , సెప్టెంబర్17 వుదయం ప్రతినిధి**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను అవమానిస్తూ "Fabricated Leader" పుస్తకం రాసిన రచయిత హమారా ప్రసాద్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఐఎంఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఆనందరావు సూర్యాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.గురువారం సూర్యాపేట ఇన్స్పెక్టర్ కు ఆయన ఆధ్వర్యంలో అంబేద్కరిస్టులు లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనందరావు మాట్లాడుతూ.. "అంబేద్కర్ ను ఫేక్ లీడర్ గా, ఫేక్ డిగ్రీలతో హీరో అయ్యాడని చూపిస్తూ రాసిన ఈ పుస్తకం దేశవ్యాప్తంగా ఉన్న అంబేద్కరిస్టుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉంది. ఇది కావాలనే చేస్తున్న కుట్ర. రాజ్యాంగాన్ని అవమానించడమే" అని మండిపడ్డారు.వెంటనే రచయితపై కేసు నమోదు చేసి, నేడు జరగబోయే పుస్తకావిష్కరణను నిలిపివేయాలని డాక్టర్ ఆనందరావు డిమాండ్ చేశారు. అంబేద్కర్ ఆశయాల కోసం చివరి వరకు పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు.

## పీఏసీఎస్‌లో

### తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

**భూపాలపల్లి : సెప్టెంబర్ 17 (వుదయం విలేకరి)**

మహాదేవ్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో గురువారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

సంఘ అధ్యక్షుడు చల్ల తిరుపతిరెడ్డి జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్కం అశోక్, మాజీ చైర్మన్ ఎనమండ్ల వామన్ రావు, మాజీ కాళేశ్వరం టెంపుల్ చైర్మన్ గుడాల శ్రీనివాస్, కలికోట వరప్రసాద్, మాజీ ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్, బుర్రి శివరాజ్, ముత్యాల మల్లాగౌడ్, కూరతోట కృష్ణమూర్తి, ఎజాజ్, సాంబయ్య, కోట సమ్మయ్య,తదితర కాంగ్రెస్ నాయకులు, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క





**ములుగు, సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి) :**

ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) స్పష్టం చేశారు. గురువారం జిల్లా నూతన సమీకృత కార్యాలయాల సముదాయ ప్రాంగణంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకుంటూ, నాటి పోరాట యోధుల త్యాగాల స్ఫూర్తితోనే ప్రజాపాలన సాగుతోందన్నారు.

ములుగు జిల్లాకు మొదటి విడతలో 5,201 ఇండ్లు మంజూరు చేయగా, ఇప్పటివరకు 1,850 ఇండ్ల నిర్మాణం పూర్తయింది. రెండో విడత కింద మరో 2,000 ఇండ్లు కేటాయించాం. ములుగును గుడిసెలు లేని జిల్లాగా మారుస్తాం. మహాలక్ష్మి పథకం, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ద్వారా జిల్లాలో 2.33 కోట్లకు పైగా మహిళా ప్రయాణాలు నమోదయ్యాయని, దీని వల్ల మహిళలకు రూ.172.06 కోట్లు ఆదా అయ్యాయని వెల్లడించారు.

అభివృద్ధి పనులు ఏజెన్సీ, మారుమూల గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇస్తున్నాం. ఘట్టమ్మ వద్ద నిర్మించిన పైలాన్ జిల్లా ప్రగతికి ప్రతీకగా నిలిచింది.ప్రభుత్వ ఫలాలు అర్హులందరికీ పారదర్శకంగా అందించాలని, అధికారులు అంకితభావంతో పనిచేసి జిల్లాను ప్రగతి పథంలో నిలపాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్‌సహదేవరావు, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా 'తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం



**జనగామ, సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి) :**

స్వతంత్ర హైదరాబాద్ సంస్థానం భారతావనిలో ఐక్యమై 78 ఏళ్లు పూర్తి చేసుకుని 79వ వసంతంలోకి అడుగు పెట్టిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 'తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను' అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, నల్లా నర్సింహులు తదితర అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. బైరాన్ పల్లి, శిలారాంపూర్, కూటిగల్, ఆకునూర్ పోరాటాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని కొనియాడారు.

ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనిక పాలనలో జిల్లాలో అమలవుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని వివరించారు:

మహాలక్ష్మి పథకం: జిల్లాలో ఇప్పటి వరకు 3.91 కోట్లకు పైగా మహిళా ప్రయాణికులు ఉచిత ఆర్టీసీ రవాణా సౌకర్యాన్ని వినియోగించుకోగా, ఆర్టీసీకి ₹194.92 కోట్ల మేర లబ్ధి చేకూరింది. అలాగే 87,881 మంది అర్హులకు ₹500 లకే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నారు. రేషన్ & విద్యుత్: 1.88 లక్షల మందికి చౌక ధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీతో పాటు, ఇప్పటివరకు 1,44,517 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. 'గృహజ్యోతి' కింద 97,449 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తూ ₹70.13 కోట్ల సబ్సిడీ అందించారు.

ఆరోగ్యం & ఇళ్లు: రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య పరిమితిని ₹10 లక్షలకు పెంచగా జిల్లాలో 20,741 మంది ఉచిత చికిత్స పొందారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో 5,756 ఇండ్లు మంజూరు కాగా, 94% గ్రౌండింగ్ సాధించి రాష్ట్రంలో జనగామ జిల్లా 2వ స్థానంలో నిలిచింది. వ్యవసాయం & ఉపాధి: రైతు భరోసా కింద 1.85 లక్షల మంది రైతులకు ₹233.10 కోట్లు, రైతు భీమా ద్వారా 539 బాధిత కుటుంబాలకు ₹26.95 కోట్లు అందజేశారు. నిరుద్యోగ యువత కోసం 11 నోటిఫికేషన్ల ద్వారా 164 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేశారు.

విద్యారంగంలో సంచలనాలు: జిల్లాలోని 562 పాఠశాలల్లో 100% ఎల్పీజీ కనెక్షన్లతో పొగరహిత వంటశాలలను అందుబాటులోకి తెచ్చారు. PGI ర్యాంకింగ్‌లో వరుసగా రెండేళ్లు (202425, 202526) రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడమే కాకుండా 'ఉత్తమ్3' సాధించిన ఏకైక జిల్లాగా జనగామ ఘనత సాధించింది. NSPC2025 లో దేశంలోనే మొదటి స్థానం సాధించగా, NSPC2026 లో 20 వేలకు పైగా రిజిస్ట్రేషన్లతో దేశంలోనే 2వ స్థానంలో కొనసాగుతోంది. విద్యార్థుల కోసం 'ఫాస్ట్ మ్యాథ్స్', 'ఇంగ్లీష్ గ్రామర్' పుస్తకాలతో పాటు 'నా ఆరోగ్యం నా ఆత్మగౌరవం', 'నా శరీరం నా హక్కు నా భద్రత' వంటి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తున్న ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ శ్రీ సందీప్ కుమార్ ఝా, జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు విభాగం, విలేకరులకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

## వరంగల్ సమగ్రాభివృద్ధికి ప్రపంచ బ్యాంకు సహాయం



**'కుడా'లో ముగిసిన ఉన్నత స్థాయి సమావేశం**

**హనుమకొండ, సెప్టెంబర్ 17 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

వరంగల్ నగర సమగ్రాభివృద్ధి కోసం ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులపై గురువారం హనుమకొండలోని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) కార్యాలయంలో ప్రతినిధుల బృందంతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండవరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యుఎంసీ కమిషనర్ తేజావత్ వెంకన్న, ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు పూనం అహ్లువాలియా ఖనిజో, అపూర్వ సెన్వి, నేహా ప్రవాస్ కుమార్ మిశ్రా, వెంకటరావు భయాన పాల్గొన్నారు.

300 మిలియన్ డాలర్ల రుణం: పట్టణాభివృద్ధికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 300 మిలియన్ డాలర్ల రుణానికి ప్రపంచ బ్యాంకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఈ నిధులలో 70 శాతం ప్రపంచ బ్యాంకు రుణంగా, 30 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఉంటుంది.అశోక జంక్షన్, భద్రకాళి ఆలయ ప్రాంతాల్లో మల్టీ లెవల్ కార్ పార్కింగ్, సెంట్రల్ ప్లాజా పునర్నిర్మాణం, రోప్‌వే, సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ అభివృద్ధి, సమగ్ర స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థలను ప్రపంచ బ్యాంకు బృందానికి అధికారులు వివరించారు. మొదటి విడత ప్రతిపాదనలు: ఇప్పటికే డీపీఆర్ సిద్ధంగా ఉన్న సమగ్ర స్టార్మ్ వాటర్ డ్రైనేజీ ప్రాజెక్టుకు మొదటి ప్రాధాన్యత లభించే అవకాశముంది. హెరిటేజ్, పర్యాటకం, వరంగల్ చారిత్రక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని పర్యాటక, హెరిటేజ్ రంగాల పరిరక్షణకు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమివ్వాలని ప్రపంచ బ్యాంకు బృందం సూచించింది.ప్రపంచబ్యాంకు మార్గదర్శకాలకు అనుగుణంగా త్వరితగతిన డీపీఆర్‌లు సమర్పించి నగరంలో రవాణా, డ్రైనేజీ, పర్యాటక అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తామని అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో కుడా సీపీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, జిల్లా పర్యాటక అధికారి శివాజీ పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్షలే ప్రజాపాలనకు ప్రాతిపదిక



**తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రగతిని వివరించిన ప్రభుత్వం**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు ప్రభుత్వం శుభాకాంక్షలు తెలిపింది. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకుంటూ తెలంగాణ విమోచనోద్యమంలో పాల్గొన్న వీరులకు, ప్రజాస్వామ్యం కోసం పోరాడిన మహనీయులకు, ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించింది. జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను పరిశ్రమలకే పరిమితం కాకుండా వ్యవసాయం, పారిశ్రామిక రంగం, పర్యాటకం, విద్య, వైద్యం, ఆదివాసీ సంక్షేమ రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. కొత్తగూడెంలో దేశంలోనే తొలి భూవిజ్ఞాన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. గోదావరి వరదల నుంచి రక్షణ కల్పించేందుకు కరకట్ట విస్తరణ పనులు కొనసాగుతున్నాయని, భద్రాచలం వద్ద గోదావరి నదిపై రెండో వంతెనను ప్రారంభించినట్లు వివరించింది. పాండురంగాపురం నుంచి మల్కాన్‌గిరి వరకు రైల్వే మార్గం మంజూరు కాగా, భక్తుల సౌకర్యార్థం సారపాక వరకు పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొంది.

సాగునీటి రంగంలో ముందడుగు

సాగునీటి రంగంలోనూ జిల్లా గణనీయమైన ప్రగతి సాధించిందని ప్రభుత్వం తెలిపింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ఎత్తిపోతల పథకంలో ప్రధాన కాలువ, మూడు పంపుహౌస్‌ల పనులు పూర్తయినట్లు పేర్కొంది. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు భూసేకరణ పూర్తయిందని, పర్యావరణ అనుమతుల ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంది.విమానాశ్రయ ఏర్పాటుకు చర్యలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసిందని పేర్కొంది. భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థకు చెందిన సాంకేతిక నిపుణుల బృందం ప్రతిపాదిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి భౌగోళిక పరిస్థితులు, రహదారి అనుసంధానం తదితర అంశాలను అధ్యయనం చేసినట్లు తెలిపింది. తెలంగాణ విమోచనోద్యమంలో పాల్గొన్న వీరులకు, తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, పాత్రికేయులు, జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపింది.తెలంగాణ ప్రజాపాలన మరింత బలోపేతం కావాలని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరింత అభివృద్ధి సాధించాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించింది.

## లైసెన్స్‌డ్ సర్వేయర్లకు కిట్లు అందజేసిన మంత్రి పొంగులేటి.



**వరంగల్ జిల్లా సెప్టెంబర్ 17(వుదయం ప్రతినిధి):**

ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా హన్మకొండ ఐడీఓసీలో వరంగల్ జిల్లా సర్వే మరియు రికార్డ్స్ శాఖ ఆధ్వర్యంలో రీ సర్వే లో భాగంగా లైసెన్డ్ సర్వేయర్లకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా లైసెన్స్‌డ్ సర్వేయర్లకు కిట్లను అందజేశారు. భూముల రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన పరికరాలతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. భూముల కొలతలు, సర్వే పనులను నాణ్యతతో చేపట్టి రైతులకు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్ , ఎడి సర్వే మరియు రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## తిప్పర్తి మండల కేంద్రంలో రూ.111 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు



**రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 17**

నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలో రూ.111 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులు, రోడ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. తిప్పర్తి మండల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది అని మంత్రి అన్నారు

## ప్రజాపాలన దినోత్సవంలో జెండా ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.



**వరంగల్ జిల్లా సెప్టెంబర్ 17(వుదయం ప్రతినిధి):**

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17న వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పోలీసు గౌరవ వందన స్వీకారం అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి, ప్రజాపాలన దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్ , అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, డియార్వో విజయలక్ష్మి , కలెక్టరేట్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం



**ముఖ్య అతిథి గద్వాల్ విజయ లక్ష్మి కి పూలబొకేతో స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డిసిపి అంకిత్ కుమార్.**

**వరంగల్ జిల్లా సెప్టెంబర్ 17(వుదయం ప్రతినిధి):**

తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని వరంగల్ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయ లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఖిలా వరంగల్‌లోని అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఐడీఓసీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజా పాలనలో పారదర్శకత, ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేర కార్పొరేషన్ చైర్మన్ వెంకట్రాజం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్లు గణేష్, కిషోర్ కుమార్, డీఆర్వో విజయలక్ష్మి, ఆర్డీవో సుమ, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవం వేడుకలు



**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 17**

పట్టణ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పోలీస్ ఫరేడ్ గ్రౌండ్ లో ఈరోజు జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు, భవనాలు ,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగరవేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవర్ తో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర, నిజాం పాలనలో హైదరాబాద్ విముక్తి, తెలంగాణ సాయుధ పోరాటంలో నేల కొరిగిన అమరులు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఏ హాఫిజ్ ఖాన్, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్ 48వ కార్పొరేటర్ కవిత జిల్లా అన్ని శాఖల అధికారులు వివిధ కార్పొరేటర్లు పార్టీ కార్యకర్తలు మన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా జాతీయ పతాకావిష్కరణ

**కరీంనగర్ సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి):**
తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు, సీపీతో కార్యాలయంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, సిబ్బందికి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం ప్రజాస్వామిక భారత సమాఖ్యలో అంతర్భాగమైన చారిత్రక సందర్భాన్ని స్మరించుకుంటూ ప్రజాపాలన దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని పేర్కొన్నారు.ప్రజా సంక్షేమం, చట్టబద్ధ పాలన, సమాజ శాంతిభద్రతల పరిరక్షణే పోలీసు వ్యవస్థ ప్రథమ కర్తవ్యమని అన్నారు. పౌరులందరికీ సత్వర న్యాయం అందించేందుకు, పారదర్శకతతో కూడిన పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, కమిషనరేట్ పరిపాలనా అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్వకర్మ ఉత్సవాలు ఘనంగా



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 17 (వుదయం ప్రతినిధి) :**
యజ్ఞ మహోత్సవ్ విరాట్ విశ్వకర్మ ఉత్సవాలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, బీసీ కుల సంఘాల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది విశ్వకర్మ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు వేశారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విశ్వకర్మ ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విరాట్ విశ్వకర్మను దైవస్వరూపంగా భావిస్తూ ఆధ్యాత్మిక, భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ,
జిల్లా బీసీ సంక్షేమ అధికారి సౌజన్య, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, విశ్వకర్మ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు...

**మంచిర్యాల /రామకృష్ణాపూర్/ సెప్టెంబర్ 17(వుదయం ప్రతినిధి)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని గురువారం క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గొడిశెల సంధ్యారాణి _ రాజా రమేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రజాపాలన దినోత్సవం ప్రాధాన్యతను అధికారులు, ప్రజాప్రతినిధులు వివరించారు. ప్రజలకు మెరుగైన పాలన, పారదర్శకమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పురపాలక సేవలను అందిస్తూ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.
కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. మురళీకృష్ణ, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బెజ్జూర్ లో అంగరంగ వైభవంగా విశ్వకర్మ జయంతి.



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి )**
ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గురువారం బెజ్జూర్విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఏలేశ్వరం పురుషోత్తమ చారి ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ జెండాను అధ్యక్షులు పురుషోత్తమ చారి ఎగరవేశారు. విశ్వకర్మ విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైభవంగా విశ్వకర్మ విగ్రహ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రామ్మోహన్ రావు, సీనియర్ అసిస్టెంట్ అచ్యుత రావు. బెజ్జూర్ రంగనాయక దేవాలయ కమిటీ అధ్యక్షులు మహేష్, ఆలయ పూజారి ఎ ర్రోజు శ్రీనివాసచారి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు చాకటి బ్రహ్మయ్య, గురజాల బ్రహ్మయ్య, ఏలేశ్వరం శ్రీకాంత్, శ్రీరా ం మోహన్, ఏలేశ్వరం ప్రభాకర్, శ్రీనివాస్, షణ్ముఖ, కమలాకర్, ఉపేంద్ర చారి, నరేష్, శ్రీరామ అశోక్, అనిల్, శ్రావణ్, చాకటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మల వృత్తి నైపుణ్యాలకు పెద్దపీట!

- **ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి):**



సమాజ నిర్మాణంలో తరతరాలుగా కీలక పాత్ర పోషిస్తున్న విశ్వకర్మల వృత్తి నైపుణ్యాలను మరింత ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. చేతివృత్తుల వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి ఆర్థిక అభ్యున్నతికి అవసరమైన చర్యలు చేపడుతోందని తెలిపారు.ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..శ్రమను, సాంకేతికతకు రూపమిచ్చిన విశ్వకర్మ సేవలు చిరస్మరణీయమన్నారు. మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకల ద్వారా వారి సేవలను భావితరాలకు పరిచయం చేయవచ్చని పేర్కొన్నారు. యువత వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చిన ఆయన.. సమాజానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న చేతివృత్తుల వారిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. విశ్వకర్మ వంశీయుల అభ్యున్నతికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపడుతున్నామని, విశ్వకర్మ రుణాలు సైతం అందిస్తున్నామని పేర్కొన్నారు. యువత వృత్తిగత నైపుణ్యాలను మెరుగుపరచుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు.
స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. కులవృత్తులను నమ్ముకుని జీవిస్తున్న వారి సంక్షేమం కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని అన్నారు. ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు.అంతకుముందు అతిథులు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆర్. ఎస్. చిత్రు, ఎస్. రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారి సునీత కుమారి, ఈడీ మనోహర్, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్టీ ఉద్యోగుల హక్కులకు అన్యాయం జరుగుతే ఊరుకోం

- **ఉపాధి,పునరావాస అంశాలపై సమీక్ష**
- **ఎన్టీపీసీ ఉన్నతాధికారులతో సమావేశం**



**పెద్దపల్లి,(గోదావరిఖని) సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి)**
షెడ్యూల్డ్ తెగల (గిరిజన) ఉద్యోగుల హక్కులకు ఏమాత్రం అన్యాయం జరిగినా ఊరుకునేది లేదని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ స్పష్టం చేశారు. గురువారం పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ థర్మల్ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్టీపీసీ ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం, పునరావాసం తదితర అంశాలపై సమీక్షించారు. రామగుండం ఎన్టీపీసీలో విధులు నిర్వహిస్తున్న ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సంస్థలో ఎస్టీ వర్గాలకు అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను సమీక్షించారు. సంస్థలో ఎస్టీ ఉద్యోగుల కోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఎస్టీ ఉద్యోగులు, వారి కుటుంబాల ప్రయోజనాలను పరిరక్షించేందుకు సంస్థ ప్రత్యేక దృష్టి సారించాలని హుస్సేన్ నాయక్ సూచించారు. ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరిస్తే సహించేది లేదన్నారు. ఎన్టీపీసీ సీఎస్ఆర్ కార్యక్రమాలపైనా ఆయన సమీక్షించారు.సమావేశానికి ముందుగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌కు రామగుండం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సమంత, సీజీఎం మురళీరాయ్ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. సమీక్ష సమావేశంలో ఎన్టీపీసీకి చెందిన అన్ని విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

**కామారెడ్డి, సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి):-**



తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కామారెడ్డి కలెక్టరేట్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ముఖ్య అతిథి నేరెళ్ల శారదకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసు సిబ్బంది నుంచి ఆమె గౌరవ వందనం స్వీకరించారు. ముఖ్య అతిథి నేరెళ్ల శారద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం ఆమెతో పాటు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా అధికారులు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక నేపథ్యాన్ని ప్రతిబింబించేలా వివిధ కళారూపాలను ప్రదర్శించారు. దేశభక్తి గీతాలు, తెలంగాణ జానపద నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. కళాకారుల ప్రదర్శనలను ముఖ్య అతిథి, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ఆసక్తిగా తిలకించి అభినందించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి నేరెళ్ల శారద మాట్లాడుతూ, తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం రాష్ట్ర చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజని పేర్కొన్నారు. నిజాం పాలన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థకు పరివర్తన చెందిన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకోవడంతో పాటు, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజా పాలనలో పారదర్శక పాలన, అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక సమానత్వం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కామారెడ్డి జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని ముఖ్య అతిథి వివరించారు. జిల్లాలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సేవలు సమర్థవంతంగా అందేలా అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, సాంస్కృతిక కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణకార సంఘ 18 వార్షికోత్సవం...

- **విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరం...**
- **రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**



**జగిత్యాల సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి)**
జగిత్యాల పట్టణంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి జెండా ఆవిష్కరణ చేసి విశ్వకర్మ బ్రహ్మోత్సవాలను ప్రారంభించి జగిత్యాల పట్టణ స్వర్ణకార సంఘం లో నిర్వహించిన విశ్వకర్మ జయంతి సందర్భంగా హాజరై ఇండియన్ రెడ్ క్రాస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని ప్రారంబించిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ఈ సందర్భంగా 75వ సారి రక్తదానం చేసిన కనపర్తి రవి ని శాలువాతో సత్కరించి అభినందించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ రక్తదానం మహాదానం అనే నినాదంతో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇచ్చే రక్త దానం ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుందని రక్త దానం చేస్తున్నా రక్తదాతలను 75 వ సారి రక్త దానం చేసిన జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన కనపర్తి రవిని ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ అభినందించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్ బండ శంకర్ టివి సత్యం టివి సూర్యం మంచాల కృష్ణ సిరిసిల్ల శ్రీనివాస్ కౌన్సిలర్ లు పంబాల సుజాత రాము సాయి కిరణ్ కత్రోజ్ గిరి రంగు రాజయ్య దుమాల రాజ్ కుమార్ సంఘం కార్యవర్గ సభ్యులు కౌన్సిలర్ లు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మహిళ అదృశ్యం



**రామడుగు 17 సెప్టెంబర్ (వు దయం ప్రతినిధి)**
కరీంనగర్ జిల్లా రామడుగు మండలం పోలీస్ స్టేషన్ పరిధిలోని దత్తోజిపేట గ్రామానికి చెందిన తోట్ల మమత W/o నరేష్, వయస్సు 30 సంవత్సరాలు, కులం: యాదవ్ అనే మహిళ 16092026 తేదీన మధ్యాహ్నం సుమారు 03:30 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో, ఆమె భర్త తోట్ల నరేష్ S/o మల్లయ్య, వయస్సు 33 సంవత్సరాలు, కులం: యాదవ్, దత్తోజిపేట రామడుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు రామడుగు ఎస్ఐ కె. రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అదృశ్యమైన మహిళ ఆచూకీ కోసం పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.



## కలెక్టరేట్‌లో గణనాథునికి కలెక్టర్ భవేశ్ మిశ్రా ప్రత్యేక పూజలు

**నిర్మల్ జిల్లా 17 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)**
కలెక్టరేట్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథునికి పూజలు చేసి, భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పూజారులు కలెక్టర్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాథోడ్ రమేశ్, కార్యాలయ పర్యవేక్షకులు ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు...





- **జాతీయ జెండాను ఆవిష్కరించిన జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్**

**జగిత్యాల సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి)**
తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరించిన జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ ఈ కార్యక్రమంలో డిఎస్పీ లు పురుషోత్తం రెడ్డి రాములు ఏఓ శ్రీనివాస్ ఇన్స్పెక్టర్ లు ఆరిఫ్ అలీ ఖాన్ సుధాకర్ కరుణాకర్ లక్ష్మీ నారాయణ రాజ్ కుమార్ శ్రీధర్ ఆర్ఐ వేణు ఎస్ఐ లు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు


## ఘనంగా ప్రజా పాలన దినోత్సవం సంబరాలు


- **త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**
- **ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**



**నిజామాబాద్, సెప్టెంబర్ 17 :**
నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన ఆయన, జిల్లా ప్రగతి నివేదికను వివరిస్తూ ప్రజనుద్దేశించి ప్రసంగించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. ఈ వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ భుజంగరావు, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఆర్ఓ గీత, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ ఆర్కల నర్సారెడ్డి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ప్రేమలత అగర్వాల్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో ఘనంగా శ్రీ శ్రీ శ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవానుని జయంతి ఉత్సవాలు





**ధర్మపురి,సెప్టెంబర్17 (వు దయం ప్రతినిధి):**
పట్టణంలోని గోదావరి నది ఒడ్డున ఉన్న విశ్వబ్రాహ్మణ సంఘ భవనంలో శ్రీ శ్రీ శ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవానుని జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు.ఈ సందర్భాన్ని పురస్క రించుకుని ఆలయంలో కుంకు మ పూజ,హోమం పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలనునిర్వహిం చారు.ఈ వేడుకలకు మున్సి పల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజేష్ ముఖ్య అతిథిగా విచ్చే శారు.ఎండోమెంట్ ధార్మిక సెల్ జగిత్యాల జిల్లా కోకన్వీనర్ కలకోట రాజేష్,ధర్మపురి పట్టణ కన్వీనర్ కొత్తపల్లి కిషన్,స్వర్ణకా ర సంఘం అధ్యక్షులు సింహ రాజు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కనపర్తి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.పూజా కార్యక్ర మాల అనంతరం భక్తులకు తీర్థప్రసాద
వితరణతో పాటు ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయంతోనే ప్రజా పాలనకు సార్థకత

- **ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తాం సర్పంచ్ గుర్రపు సుమిత్ర శ్రీనివాస్**



నిజాంసాగర్ సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని మాగి గ్రామ సర్పంచ్ గుర్రపు సుమిత్ర శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుర్రపు సుమిత్ర శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల హక్కులు, స్వేచ్ఛ, ఆత్మగౌరవం కోసం పోరాడిన రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, సామాన్య ప్రజలు, అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువరాదన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్ర అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు, మహిళలు, యువత, వృద్ధులు, పేదలు, కార్మికులకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, ఉపాధి తదితర అంశాలకు ప్రాధాన్యతనిస్తూ మాగి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఆమె అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రజా పాలన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తూ, అర్హులైన వారికి వాటి ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేంగారం కవిత పండరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రపు శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు గుర్రపు వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి భారతి, కారోబార్ కిష్టయ్య, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

- పాలమూరు కలెక్టరేట్‌లో పతాకావిష్కరణ చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- పారదర్శకత, సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి

**వుదయం, మహబూబ్‌నగర్**

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ డి.జానకి, మేయర్ జి.మమత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిజాం రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి అడుగుపెట్టిన చారిత్రక రోజును పురస్కరించుకుని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**ప్రధాన సంక్షేమ ఫలాలు:**
మహాలక్ష్మి & గ్యాస్: ఉచిత బస్సు ప్రయాణం ద్వారా 3.81 కోట్ల మంది మహిళలకు రూ.185.60 కోట్ల లబ్ధి. రూ.500కే గ్యాస్ పథకం ద్వారా 1.27 లక్షల మందికి లబ్ధి.ఉచిత విద్యుత్ & ఆరోగ్యశ్రీ: గృహజ్యోతి కింద 1.37 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు.

**రైతు సంక్షేమం:**
రైతుభరోసా కింద రూ.818.22 కోట్లు, రుణమాఫీ కింద 76,385 మందికి రూ.597.05 కోట్లు జమ.
ఇందిరమ్మ ఇండ్లు: జిల్లాలో 10,232 ఇళ్లు మంజూరు కాగా, 3,302 ఇళ్ల నిర్మాణం పూర్తి.
అనంతరం ఎస్‌.సి., ఎస్‌.టి. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధ్యక్షతలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

**నేటి ముఖ్యాంశాలు:**
ఉదయం 11:00 గంటలకు: జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఎస్‌.సి., ఎస్‌.టి. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యనేతృత్వంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ మరియు వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరగనుంది.

## సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యాలు

- ఏపీ జితేందర్ రెడ్డి

**గద్వాల, సెప్టెంబర్ 17 (వుదయం బ్యూరో)**

న్యూఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి గద్వాల ఐడీఓసీ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ జిల్లా సాధించిన ప్రధాన విజయాలను వెల్లడించారు:మహిళా సంక్షేమం: ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు రూ. 129.03 కోట్ల లబ్ధి చేకూరింది.రైతు సంక్షేమం: 58,113 మంది రైతులకు రూ. 513.99 కోట్ల రుణమాఫీ జరిగింది. వ్యవసాయ శాఖ పథకాల అమలులో జిల్లా రాష్ట్రంలో 5వ స్థానంలో నిలిచింది.వైద్యం & ఉచిత విద్యుత్: ఆరోగ్యశ్రీ ద్వారా 18,431 మందికి రూ. 53.29 కోట్ల వైద్య సేవలు అందాయి. గృహజ్యోతి కింద 88,766 కుటుంబాలకు ఉచిత విద్యుత్ లభించింది.సాగునీటి ప్రాజెక్టులు: గద్వాల దొడ్డి రిజర్వాయర్ సామర్థ్యం 15 టీఎంసీలకు పెంపు (భూసేకరణకు రూ. 165 కోట్లు), గట్టు ఎత్తిపోతల పథకం రూ. 1,781 కోట్లతో పునఃరూపకల్పన పూర్తయింది. మౌలిక వసతులు & విద్య: రహదారులకు రూ. 339.39 కోట్లు, గద్వాల మెడికల్ కాలేజీ భవన నిర్మాణానికి రూ. 128 కోట్లు కేటాయించారు.
రాష్ట్రంలో అగ్రస్థానం: జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అమలులో గద్వాల జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.ఈ కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే విజేయుడు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ సమైక్యతకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలి

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి వుదయం**

జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గురువారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి, దేశ సమైక్యతను, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.దేశ ఐక్యత, సమగ్రత కోసం ఎంతోమంది మహనీయులు చేసిన త్యాగాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్మరించుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వమే భారత దేశ ప్రత్యేకత అని, కుల, మత, ప్రాంత, భాషలకు అతీతంగా ప్రజలంతా ఐకమత్యంతో ముందుకు సాగినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.తెలంగాణ సమాజంలో సోదరభావం, పరస్పర గౌరవం, సామరస్యాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్ లు కాసాల బుచ్చిరెడ్డి , విజేందర్ రెడ్డి, డాక్టర్ శ్రీహరి, మాజీ జేపీటీసీ కొండల్ రెడ్డి, మనోహర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు విఠల్, చక్రపాణి , రామప్ప , కౌన్సిలర్ లు సర్పంచ్ లు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## సంపద సమాన పంపిణీయే లక్ష్యంగా ప్రభుత్వం పయనం

**నాగర్ కర్నూల్, సెప్టెంబరు 17 (వుదయం బ్యూరో):**

ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ పతాకావిష్కరణ ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో సృష్టిస్తున్న సంపదను సమానత్వం, సామాజిక న్యాయం ప్రాతిపదికగా సమస్త ప్రజానీకానికి పంపిణీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తెలంగాణ చరిత్ర వేల ఏండ్ల నాటిదని, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా 1946లో ప్రారంభమైన రైతాంగ సాయుధ పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ సంస్థానం విలీనానికి నిరాకరించిందని, చివరకు 1948 సెప్టెంబర్ 17న భారత ప్రభుత్వం ఆపరేషన్ ద్వారా హైదరాబాద్‌ను విలీనం చేయడంతో తెలంగాణ గడ్డపై మువ్వన్నెల జెండా ఎగిరిందని తెలిపారు.ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు.గత ఏడాది డిసెంబర్ 28 నుంచి ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రతి పల్లెకు అధికారులను పంపి గ్రామసభలు నిర్వహించి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు.జిల్లా ప్రగతిని వివరిస్తూ మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 10 కోట్ల 56 లక్షల మంది మహిళలు ఉచిత ఆర్టీసీ ప్రయాణం పొంది రూ.499.85 కోట్లు ఆదా చేసుకున్నారని, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ ద్వారా 1.18 లక్షల మందికి రూ.16.95 కోట్ల సబ్సిడీ లబ్ధి చేకూరిందని, గృహజ్యోతి కింద 1,15,461 మందికి రూ.77.62 కోట్లతో జీరో బిల్లులు జారీ చేశామన్నారు. సన్న బియ్యం పంపిణీ కింద 2.79 లక్షల కార్డులకు 13,691 టన్నుల బియ్యం ఉచితంగా పంపిణీ చేశామని, కొత్తగా 41,323 రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచి 44,115 మందికి రూ.117.59 కోట్లు ఖర్చు చేశామని, ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడతలో 11,922 ఇండ్లు మంజూరు చేసి రూ.197.24 కోట్లు విడుదల చేశామని, రైతు భరోసా కింద 3.08 లక్షల మంది రైతులకు రూ.422.56 కోట్లు, రైతు భీమా కింద 1,141 కుటుంబాలకు రూ.57.05 కోట్లు అందజేశామని తెలిపారు. అలాగే కల్వకుర్తి ఎత్తిపోతల, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుల పురోగతిని వివరించారు.
ఈ కార్యక్రమంలో కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ డాక్టర్. సంగ్రామ్ సింగ్ పాటిల్, ఎమ్మెల్యే డాక్టర్. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, అదనపు కలెక్టర్లు దేవసహాయం, చెన్నయ్య, మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## మీసేవ నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలి



**సిద్దిపేట, సెప్టెంబర్ 17: వుదయం**

మీసేవ కేంద్రాల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తెలంగాణ మీసేవ సమాఖ్య సిద్దిపేట జిల్లా కమిటీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నూతనంగా ఏర్పాటైన తెలంగాణ మీసేవ సమాఖ్య సిద్దిపేట జిల్లా కమిటీ నాయకులు సిద్దిపేట జిల్లా ఈజిల్లా నిర్వాహకుడు కమటం ఆనంద్ కుమార్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మీసేవ నిర్వాహకులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు ఈజిల్లా నిర్వాహకుడు కమటం ఆనంద్ కుమార్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం మీసేవ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించడంలో నిర్వాహకులు కీలక పాత్ర పోషిస్తున్నారని సమాఖ్య నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వివిధ ప్రభుత్వ సేవలను సులభంగా, వేగంగా అందుబాటులోకి తీసుకు రావడంలో మీసేవ కేంద్రాలు ముఖ్య కేంద్రాలుగా పనిచేస్తున్నాయని తెలిపారు. మీసేవ కేంద్రాల నిర్వాహకులు నిత్య నిర్వహణలో పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. నిర్వాహకులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఈజిల్లా నిర్వాహకుడి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి సహకరించాలని కోరినట్లు పేర్కొన్నారు. మీసేవ నిర్వాహకుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తమ సమాఖ్య నిరంతరం కృషి చేస్తుందని తెలంగాణ మీసేవ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చుక్క భరత్, ప్రధాన కార్యదర్శి అనంతారం నగేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు గన్నె దినేష్ రెడ్డి, మాచర్ల ప్రశాంత్ గౌడ్ తెలిపారు. మీసేవ కేంద్రాలు ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరవేసే ముఖ్యమైన వేదికలుగా ఉన్నందున, వాటి నిర్వాహకులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించే పరిస్థితులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నిర్వాహకుల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి, చర్చల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. నూతనంగా ఏర్పాటైన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని మీసేవ నిర్వాహకులను సమన్వయం చేసుకుంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కార్యాచరణ చేపడతామని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు మీసేవ నిర్వాహకులకు అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్ కుమార్, సంపత్, రమేశ్, మహేశ్ తదితర జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు



**నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 17(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలో జనసేనపార్టీ ఆధ్వర్యం లో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు జాతీయ జెండాను ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. జనసేనపార్టీ జిల్లా నాయకులు మక్తల్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మణికంఠ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరు అయ్యారు. స్థానిక సత్యనారాయణ చౌరస్తాలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించిన అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా కేంద్రంలో జనసేనపార్టీ జిల్లా నాయకులు కోస్గి విష్ణువర్ధన్ రెడ్డి, గుడిసె నరసింహ ఆధ్వర్యం లో తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మణికంఠ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నిజాం పాలన నుంచి విముక్తి పొందిన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తెలంగాణ విలీన ప్రక్రియ, అప్పటి రజాకార్ల అరాచకాలు, నిజాం పాలనలో జరిగిన సంఘటనలను ఆయన ప్రస్తావించారు. భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక పరిణామాలను ఆయన వివరించారు. తెలంగాణ విమోచన కోసం పోరాడిన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ప్రజలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా ,జనసేనా పార్టి నాయకులు మురళి, రాజేష్, జాజాపురం కృష్ణ ,రామకృష్ణ, దామరగిద్ద బాలు ,విజయ్, సాయినాథ్ ,చందన ,సవిత, సోషల్ సురేష్, రాములతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రుణ లక్ష్యాలను వంద శాతం సాధించాలి

**వనపర్తి సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలోని బ్యాంకర్లు తమ వార్షిక రుణ ప్రణాళిక మేరకు లక్ష్యం సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.గురువారం లీడ్ బ్యాంకు మేనేజర్ ఆధ్వర్యంలో 202627 మొదటి త్రైమాశిక జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ, సంప్రదింపుల సమావేశం కలెక్టరెట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించగా జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లాలోని వివిధ బ్యాంకులు వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం గా మొదటి త్రైమాసికంలో జూన్ 30 నాటికి సాదించిన లక్ష్యాలు, పెండింగ్ లో ఉన్న వాటి పై లీడ్ బ్యాంకు మేనేజర్ రూపొందించిన నివేదిక ఆధారంగా సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరిస్తూ వనపర్తి జిల్లాలో వార్షిక రుణ ప్రణాళిక 5990.50 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా మొదటి త్రైమాసికం ముగిసే వరకు కేవలం 1366.47 కోట్లు రుణాలు మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయని అందులోను ఎం ఎస్ ఎం ఇ, విద్యా, గృహ రుణాలు చాలా తక్కువ శాతం గ్రౌండింగ్ అయ్యాయి అన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన వంటి పథకాలను ప్రతి ఒక్క ఖాతాదారుకు వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లను సూచించారు. ముఖ్యంగా జిల్లాలోని ప్రతి మహిళా సమాఖ్య సభ్యులను ఈ భీమా కిందికి తీసుకొచ్చే విధంగా ప్రచారం కల్పించి 100% లక్ష్యం సాధించాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో గృహ రుణాలు కేవలం 12.47 % మాత్రమే లక్ష్యం సాధించడం జరిగిందని 100% సాధించేందుకు చాలామందికి బ్యాంకుల నుండి గృహ రుణాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా పేద ప్రజలైన ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక స్తోమత లేక బయట నుంచి వడ్డీతో తీసుకొచ్చి ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నారని అలాంటి వారికి బ్యాంకులు ఉదారంగా గృహ రుణాలు అందజేయాలని ఆదేశించారు. దీని కొరకు ప్రత్యేక కార్యచరణ చేపట్టాలని లీడ్ బ్యాంకు మేనేజర్ ను ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు సైతం లక్ష్యం మేరకు ఇవ్వలేదని గడువు లోపల 100% రుణాలు మంజూరు చేసే విధంగా బ్యాంకర్లు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి 100% లక్ష్యాలు సాధించాలని సూచించారు. జిల్లాలో ఎం ఎస్ ఎం ఈ రుణాలు అత్యధిక శాతం ఇచ్చి జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంలో దోహదపడాలని బ్యాంకర్లను సూచించారు. పీఎం విశ్వకర్మ లాంటి పథకాలను విజయవంతం చేసే విధంగా బ్యాంకులు కృషి చేయాలని సూచించారు.ఆర్సేటి ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ కల్పించి వారికి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ విధంగా జిల్లాలోని ప్రజలకు ఉద్యోగులకు ఫైనాన్స్ లిటరసీ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ ఖీమ్యా నాయక్, లీడ్ బ్యాంకు మేనేజర్ శివకుమార్, ఆర్.బి.ఐ ఏజీఎం వి ప్రదీప్ చంద్ర యూబీఐ డీజీఎం డి వెంకటేశ్వర్లు, ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్, జిల్లా అధికారులు ఆయా బ్యాంక్ బ్రాంచ్ ల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా బహుజన విద్యార్థి మూమెంట్ సంఘం ఆవిర్భావం అధ్యక్షుడిగా బాన్సువాడ వేదాంత్

**మెదక్ జిల్లా/ సెప్టెంబర్ 17 అల్లాదుర్ మండలం/ (వుదయం ప్రతినిధి)**



ప్రతినిధిబడుగు బలహీన వర్గాల అభ్యున్నతి,సబ్బండ వర్గాల విద్యార్థి సంక్షేమం కోసమే ఈ బహుజన విద్యార్థి మూమెంట్ సంఘం ఆవిర్భవించడం జరుగుతుంది తెలంగాణలోగాని భారత దేశంలోగానీ ఎన్నో విద్యార్థి సంఘాలు ఉన్నాయి ఏర్పడుతున్నాయి వారి వారి వెసులుబాటుకి సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తున్నాయి కూడ అలాగే రాష్ట్రంలోగానీ దేశంలో గాని ఒక నూతన ఒరవడికను సృష్టించి విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నుండి రావాల్సిన ఫీజ్ రీయంబర్స్ మెంట్ బకాయిలు,స్కాలర్ షిప్స్,నాణ్యమైన వసతితో కూడిన వసతి గృహాలు మరియు వ్యవస్థలో ఎన్నో పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న ప్రైవేట్ స్కూల్స్,ప్రైవేట్ కాలేజీలు,ప్రైవేట్ యూనివర్సిటీలలలో సామాన్యుడికి ప్రాధాన్యం ఇస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేసే విధంగా ఈ ఆర్గనైజేషన్ పనిచేస్తుంది అలాగే అసమానతలు లేని సమాజం,అంటారని తనంనిర్మూలన,మూఢనమ్మకాల నిర్మూలన,శాస్త్రీయ దృక్పథంతో అందరికీ సమాన గౌరవం, అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేస్తూ నవ యుగ సమాజ నిర్మాణానికి కృషి చేస్తుంది.ఈ సంఘం 7 గురు ప్రతినిధులతో తెలంగాణ ప్రభుత్వంచే రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది అధ్యక్షుడిగా బాన్సువాడ వేదాంత్ మౌర్య,ఉపాధ్యక్షులుగా దుబ్బాక శివకళ్యాణి,ప్రధాన కార్యదర్శిగా మద్దెల సందీప్,జాయింట్ సెక్రటరీగా మహమ్మద్ లతీఫ్,ట్రెజరరీగా నేనావత్ ప్రవీణ్ కార్యవర్గ సభ్యులుగా దుర్గాప్రసాద్,నవీన్ మరియు లీగల్ అడ్వైజర్ పానుగంటి ప్రవీణ్ గార్లతో ఈ సంఘాన్ని లీగల్ గా స్థాపించడం జరిగింది. ఈ సమావేశంలో బహుజన విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బాన్సువాడ వేదాంత్ మౌర్య మాట్లాడుతూ రాగ ద్వేషాలు లేకుండా ప్రతి ఒక్కరూ వారి వారి సిద్ధాంతాలను గౌరవించాలని అదేవిధంగా పనిచేయాలని సూచిస్తూ ఈ సంఘం మహనీయుల ఆలోచన,మేధావుల జ్ఞానాన్ని శాస్త్రీయ దృక్పథం అమలుకై అవగాహన కల్పిస్తూ నిష్పాక్షికంగాప్రజలవైపు విద్యార్థులవైపు బాధితులవైపు నిజాం వైపు నిలబడి పోరాడాలని ఈ సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని భవిష్యత్తుల్లో భావ స్వారూప్యత కలిగిన విద్యార్థి సంఘలతో,ప్రజలబాగుకోరే రాజ్యాకియ పార్టీలతో నికార్సైన ప్రజా నాయకులతో కలసి పనిచేయడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదని సమ సమాజ స్థాపన కోసం కృషి చేయడమే మా ధ్యేయమని ప్రజలను అవగాహన కల్పిస్తూ పనిచేస్తామని తెలిపారు..ఈ కార్యక్రమంలో సందీప్,అంజన్ కుమార్,నవీన్,శ్రీశైలం,లోకేష్,రమేష్ రాష్ట్ర కమిటీ సభ్యులు మరియు స్కాలర్స్ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- ఆస్తి వివాదమే కారణమా?
- భర్తను కుటుంబ సభ్యులే హత్య చేశారంటూ రెండో భార్య ఫిర్యాదు

**అచ్చంపేట సెప్టెంబర్ (వుదయం ప్రతినిధి )**



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం సింగారం గ్రామంలో బొడ్డుపల్లి బాల్ నారాయణ (65) వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది.స్థానికులు, పోలీసులు తెలిపిన సింగారం గ్రామానికి చెందిన బొడ్డుపల్లి బాల్ నారాయణ (65) గురువారం తెల్లవారు జామున అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు.కృష్ణమ్మ ఫిర్యాదు ప్రకారం.. తమకు ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారని, తన భర్తకు మొదటి భార్య సాయిలమ్మ, కుమారుడు వెంకటయ్య, కోడలు, కుమార్తెలు బాలమ్మ, సైదమ్మ ఉన్నారని పేర్కొంది. కొంత కాలంగా ఆస్తి విషయంలో వివాదాలు ఉన్నాయని తెలిపింది. గురువారం భర్త మృతి చెందినట్లు సమాచారం వచ్చిందని పేర్కొంది.ఆస్తి వివాదం కారణంగానే సాయిలమ్మ,కుమార్తెలు బాలమ్మ, సైదమ్మ కలిసి తన భర్తను కొట్టి హత్య చేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేసింది. మృతికి గల అసలు కారణాలను విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరింది.ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. పోస్టుమార్టం నివేదిక తర్వాత అసలు కారణం తెలనుంది.

## రామక్కపేట గురుకులంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థినుల మధ్యాహ్న భోజనం పరిశీలన
- పరిశుభ్రత పాటించాలని అధికారులకు ఆదేశం
- కామన్ డైట్ మెనూ తప్పనిసరి అని స్పష్టీకరణ
- విద్యార్థినులతో ముఖాముఖి
- వసతి, విద్య, భోజనంపై ఆరా
- సమస్యల పరిష్కారానికి హామీ

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 17, వుదయం:**



సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి గురువారం దుబ్బాక మండలం రామక్కపేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల , జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించారు. అన్నం, పప్పు, క్యాబేజీ కర్రీ, రసం, గుడ్డు, నెయ్యి నాణ్యత, రుచి, పరిశుభ్రతను చెక్ చేశారు. వంటశాల నిర్వహణ, భోజన తయారీకి వినియోగిస్తున్న సరుకుల నాణ్యతను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేస్తూ కూరగాయల పరిమాణం, కొలతలను పరిశీలించారు. వంటశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, భోజన తయారీలో పరిశుభ్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. కామన్ డైట్ మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి విద్య, వసతి, భోజనం, మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణంతో పాటు నాణ్యమైన వసతి, భోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

## ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహణ

- పటాన్‌చెరు మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన ఎంపీడీవో యాదగిరి

**పటాన్‌చెరు (వుదయం)**

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పటాన్‌చెరు మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రజాపరిషత్ అధికారి యాదగిరి జాతీయ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం అధికారులు, కార్యాలయ సిబ్బంది జాతీయ జెండాకు గౌరవం సమర్పించారు. అనంతరం ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు పాల్గొని దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు **.ఈ సందర్భంగా ఎంపీడీవో యాదగిరి మాట్లాడుతూ** తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ పాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించడంలో ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.ప్రజల నుంచి వచ్చే సమస్యలు, విజ్ఞప్తులను అధికారులు సానుకూలంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రజలకు పారదర్శకమైన, బాధ్యతాయుతమైన సేవలు అందించడమే ప్రభుత్వ కార్యాలయాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, నాయబ్ తహసీల్దార్ షఫీ, మండల విద్యాధికారి నాగేశ్వరరావు నాయక్, మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్, ఎస్టీఓ రాజారెడ్డి, సూపరింటెండెంట్ వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ అనంతరావు, జూనియర్ అసిస్టెంట్ రమాదేవి, టైపిస్ట్ హుస్సేన్ పాల్గొన్నారు. కార్యాలయ సిబ్బంది తాహెర్, వై. నర్సింలు, ఎన్. నర్సింలు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## తండాల అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే

- తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో
- మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

**తాండూరు, సెప్టెంబర్ 17 వుదయం ప్రతినిధి:**



తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు తాండూరు మండలం సంకిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం తండాల అభివృద్ధికి, గ్రామ పంచాయతీల ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని అన్నారు.బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగిందని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు న్యాయం జరిగేలా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడం ద్వారా ఆయా ప్రాంతాల అభివృద్ధికి, ప్రజలకు పాలన మరింత చేరువ కావడానికి అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీఆర్ఎస్ ఎల్లప్పుడూ పనిచేస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా తెలంగాణ విమోచన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తాండూరు మండల పరిధి అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు అమృత్ రెడ్డి,కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయంలో విమోచన దినోత్సవము

సంగారెడ్డి వుదయం

జిల్లా కేంద్ర గ్రంథాలయం సంగారెడ్డిలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు శ్రీ. జి.అంజయ్య మరియు కార్యదర్శి శ్రీ. యం.మనోజ్ కుమార్ గారి అధ్వర్యం లో తెలంగాణ విమోచన దినోత్సవము సందర్భంగా గ్రంథాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ చేయడం జరిగింది. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం నిజాం పాలన నుండి విముక్తి పొందింది.నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ భారత ప్రభుత్వానికి లొంగిపోయారు.నిజాం రజాకార్ల అణచివేతకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు వీరోచితంగా సాయుధ పోరాటం చేశారు.ఈ చారిత్రక సంఘటన జ్ఞాపకార్థం ఈ రోజును విమోచన లేదా విలీన దినంగా భావిస్తారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది మరియు పాఠకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్నంబావి మండల కేంద్రంలో ఉపాధ్యాయులకు ఘన సన్మానం




- ఉపాధ్యాయులు శివ రాముడు, గణేష్, శివశంకర్, ఆధ్వర్యం లో

చిన్నంబావి మండలం 17 (వుదయం రిపోర్టర్)

చిన్నంబావి మండలం లోని వివిధ గ్రామాలలో ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న నూతన డిఎస్సీ 2008, 2024 ఉపాధ్యాయ మిత్రులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎంఆర్సి చిన్నంబావి మండల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. చిన్నంబావి మండలంలో ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన అనతి కాలంలోనే విద్యార్థులకు చేరువై, వారి విద్యాభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తూ, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు నాంది పలుకుతున్న నూతన ఉపాధ్యాయుల సేవలను అభినందిస్తూ ఈ సన్మాన కార్యక్రమాన్ని సోదర భావంతో నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు శివరాముడు, గణేషు, శివశంకర్, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ కార్యక్రమాన్ని ఎంతో విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పి ఆర్ రాజేందర్ రావు, ఎంపీడీవో సూర్య ఆదర్శ్ గౌడ్, ఎంపిఓ రామస్వామి, రమణమ్మ జిహెచ్ఎం, విజయభద్రి జిహెచ్ఎం, స్వామి ఎస్ ఏ పాల్గొని నూతన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు. నూతన ఉపాధ్యాయులు చిన్నంబావి మండలంలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి మరింత అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## రిజిస్ట్రేషన్లకు బ్రేక్.. రైతులకు చుక్కలు!






- తహసీల్దార్ ఉన్నా.. ఆపరేటర్ లేడు
- స్లాట్ బుక్ చేసుకుని వస్తే.. నిరాశే
- ఐదు రోజులుగా ఇబ్బందులు.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని రైతుల వేడుకోలు

దౌల్తాబాద్ సెప్టెంబర్ 17(వుదయం):

రిజిస్ట్రేషన్ల కోసం ముందుగానే స్లాట్ బుక్ చేసుకుని వచ్చిన రైతులు, ప్రజలకు దౌల్తాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఇబ్బందులు తప్పడం లేదు. గత ఐదు రోజులుగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సక్రమంగా కొనసాగకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. సమయం, ప్రయాణ ఖర్చులు వెచ్చించి కార్యాలయానికి వచ్చినా పని పూర్తికాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఒకరు ఉంటే.. మరొకరు లేరు!**

తహసీల్దార్ రెండు రోజులపాటు సెలవులో ఉండగా, మంగళవారం ఒక్కరోజు మాత్రమే విధులకు హాజరైనట్లు సమాచారం. ఆ రోజు మూడు రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా బుధవారం నుంచి సిస్టమ్ ఆపరేటర్ సెలవులో ఉండటంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయినట్లు రైతులు చెబుతున్నారు. తహసీల్దార్ అందుబాటులో ఉన్న సమయంలో ఆపరేటర్ లేకపోవడం, ఆపరేటర్ ఉన్న సమయంలో తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో సమస్య మరింత తీవ్రంగా మారిందని వాపోతున్నారు.

**స్లాట్ బుక్ చేసుకున్నా.. ప్రయోజనం ఏది?**

రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో ముందుగానే స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత సమయానికి కార్యాలయానికి వస్తున్నామని రైతులు తెలిపారు. అయితే సిబ్బంది అందుబాటులో లేక ప్రక్రియ జరగకపోవడంతో మళ్లీ మరో రోజు రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకసారి కార్యాలయానికి రావడానికి అయ్యే ప్రయాణ ఖర్చులతో పాటు పనిదినం కూడా నష్టపోతున్నామని పేర్కొన్నారు.

**ప్రత్యామ్నాయ సిబ్బంది ఎందుకు లేరు?**

రిజిస్ట్రేషన్ల వంటి కీలకమైన ప్రభుత్వ సేవలకు సంబంధించిన సిస్టమ్ ఆపరేటర్ సెలవులో ఉంటే ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు. ఒక్క ఉద్యోగి సెలవుతో ప్రభుత్వ సేవలు నిలిచిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముందస్తుగా స్లాట్ కేటాయించిన వారికి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

దౌల్తాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిరంతరాయంగా సాగేలా ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. సిబ్బంది సెలవుల కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. స్లాట్ బుక్ చేసుకున్న ప్రజలకు నిర్ణీత సమయంలో సేవలు అందేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



## ఘనంగా విశ్వకర్మ జయంతి

దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 17, వుదయం:

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామంలో గురువారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు, జెండా ఆవిష్కరణ, పూలమాలలు, నైవేద్య సమర్పణ చేశారు. సంఘ సభ్యులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి సర్పంచ్ పాతకోటి పద్మ వెంకటేష్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పిన్నోజీ ప్రభాకర్ తో పాటు సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సృష్టి, నిర్మాణ, శిల్పకళకు ప్రతీక విశ్వకర్మ భగవానుడని, సమాజ నిర్మాణంలో విశ్వబ్రాహ్మణుల పాత్ర కీలకమని, ఐక్యతతో ముందుకు సాగాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ వేడుకలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## చేతి వృత్తిదారులకు ప్రతీకగా భగవాన్ విశ్వకర్మ

గద్వాల, సెప్టెంబర్ 17 (వుదయం కరస్పాండెంట్)

శిల్పులు, చేతివృత్తిదారులు, కార్మికులు, తదితర వృత్తుల్లో నైపుణ్యంతో పనిచేస్తున్న వారందరికీ భగవాన్ విశ్వకర్మ ప్రత్యేక ప్రతీకగా నిలుస్తారని న్యూఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు (క్రీడా వ్యవహారాలు) ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు. భగవాన్ విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఐడీఓసీ ఆవరణలో విశ్వకర్మ చిత్రపటానికి ముఖ్య అతిథితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ శ్రమ, నైపుణ్యం, సృజనాత్మకతతో సమాజ అభివృద్ధికి సేవలందిస్తున్న శిల్పులు, చేతివృత్తిదారులు, కార్మికులు సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. భారతదేశంలో తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయ చేతివృత్తులు మన సాంస్కృతిక వారసత్వంలో ముఖ్యమైన భాగమని తెలిపారు. వడ్రంగులు, కమ్మరు, స్వర్ణకారులు, చేనేత కళాకారులు, కుమ్మరులు, శిల్పులు, మేస్త్రీలు, చెప్పుల తయారీదారులు తదితర వృత్తుల ద్వారా అనేక కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని అన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ శ్రమను, నైపుణ్యాన్ని, వృత్తుల అంకితభావానికి గౌరవం ఇవ్వాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో అలంపూర్ శాసన సభ్యులు విజయుడు, గొర్రెల మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, ఎక్సైజ్ బోయ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు మధుసూదన్, నర్సింగరావు, గద్వాల మున్సిపల్ చైర్పర్సన్ జయలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మంజుల, విశ్వబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు సాగునీరు అందించాలి

- ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ సెప్టెంబర్ 17 (వుదయం కరస్పాండెంట్)

అలంపూర్ నియోజకవర్గంలోని రైతులకు సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు అధికారులను కోరారు. గురువారం గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, నీటిపారుదల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్‌తో రైతులతో కలిసి ఎమ్మెల్యే సమావేశమై నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ జూరాల ప్రధాన కాలువతో పాటు నెట్టెంపాడు పథకంలోని 100, 106 ప్యాకేజీల పరిధిలో ఉన్న రైతులకు ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు, సాగు చేయనున్న పంటలకు అవసరమైన మేరకు సకాలంలో సాగునీరు అందించాలని కోరారు. రైతులు వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడులను తిరిగి పొందడంతో పాటు పంటల ద్వారా లాభాలు పొందేలా నీటిని అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల సాగునీటి సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని, పంటలకు అవసరమైన నీరు అందేలా నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ ప్రధాని కావాలంటూ పాదయాత్ర

- సంగారెడ్డిలో అడ్వకేట్ వెంకటేశ్వర్లుకు జగ్గారెడ్డి ఘన స్వాగతం

సంగారెడ్డి వుదయం :



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలనే ఆకాంక్షతో ఒంగోలుకు చెందిన ఏపీ హైకోర్టు అడ్వకేట్ వెంకటేశ్వర్లు చేపట్టిన పాదయాత్ర గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాదయాత్రకు స్వాగతం పలికి, అందులో పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ప్రధాని కావాలనే ఆకాంక్షతో వెంకటేశ్వర్లు కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. పాదయాత్రలో భాగంగా వివిధ ప్రాంతాల్లో సామాన్య ప్రజలను కలుస్తూ వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే నాలుగు రాష్ట్రాల మీదుగా సుమారు 1,590 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేశారని, సుమారు 30 వేల మందిని కలిసినట్లు వెంకటేశ్వర్లు తనతో చెప్పారని జగ్గారెడ్డి తెలిపారు. హోటళ్లు, టీ స్టాళ్లు, రహదారుల వెంట, పొలాలు, పరిశ్రమలు తదితర ప్రాంతాల్లో ప్రజలను కలుసుకుంటూ వారి అభిప్రాయాలను సేకరిస్తున్నారని వివరించారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు మొత్తం సుమారు 4,500 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగుతుందని, ఈ క్రమంలో రెండు లక్షలకు పైగా ప్రజలను కలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ, ఆయన కుటుంబం దేశం కోసం చేసిన త్యాగాలను ప్రజలకు వివరిస్తూ వెంకటేశ్వర్లు యాత్ర కొనసాగిస్తున్నారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. పాదయాత్ర పూర్తయిన అనంతరం వెంకటేశ్వర్లును స్వయంగా తీసుకెళ్లి రాహుల్ గాంధీని కలిపిస్తానని జగ్గారెడ్డి తెలిపారు.

## గణేష్ శోభయాత్రలో డీజేలకు అనుమతి లేదు: మాగనూర్ ఎస్సై అశోక్ బాబు

మాగనూర్ సెప్టెంబర్ 17 (వుదయం న్యూస్)



మాగనూర్: మండల ప్రజలు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు మరియు డీజే నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించి గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని మాగనూర్ ఎస్సై అశోక్ బాబు విజ్ఞప్తి చేశారు. గౌరవ సుప్రీంకోర్టు మార్గదర్శకాలు మరియు నారాయణపేట ఆర్డీఓ జారీ చేసిన నిషేధ ఉత్తర్వుల మేరకు పండుగలు, ఉత్సవాల ఊరేగింపుల్లో డీజేలు వినియోగించడంపై నిషేధం అమల్లో ఉందని ఎస్సై తెలిపారు. కావున గణేష్ నిమజ్జన శోభాయాత్రల్లో డీజేలు వినియోగించకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

నిషేధ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు:డీజే నిర్వాహకులు ఎవరైనా నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించి డీజేలను ఏర్పాటు చేసినట్లయితే, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు డీజే పరికరాలను సీజ్ చేయడం జరుగుతుందని ఎస్సై హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే ఉత్సవ నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే మాగనూర్ మండలంలోని డీజే నిర్వాహకులందరికీ డీజేలపై ఉన్న నిషేధ ఉత్తర్వుల గురించి అవగాహన కల్పించి, నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**గణేష్ నిమజ్జనం సందర్భంగా ప్రజలు పోలీసుల సూచనలు:**

నిమజ్జన ప్రదేశాల్లో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు నీటి వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చెరువులు, నీటి వనరుల వద్ద భద్రతా పరిమితులు దాటి నీటిలోకి వెళ్లకూడదు. ఈత రాని వారు నీటిలోకి దిగకూడదు.నిమజ్జన సమయంలో పోలీసుల సూచనలు, బారికేడ్లు మరియు భద్రతా ఏర్పాట్లను తప్పనిసరిగా పాటించాలి. ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాలపై ప్రమాదకరంగా నిలబడి ప్రయాణించకూడదు. శోభాయాత్రలో తోపులాటలకు తావులేకుండా క్రమశిక్షణ పాటించాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించకుండా, ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఉత్సవాలను నిర్వహించాలి.గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా మరియు సురక్షితంగా జరుపుకోవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని ఎస్సై కోరారు.

## వడ్డేపల్లి, రాజోలి పీహెచ్‌సీల్లో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీలు

- ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి: డీఎంహెచ్‌వో డా. సంధ్య కిరణ్మై

వడ్డేపల్లి సెప్టెంబర్ 17 (వుదయం ప్రతినిధి)



జిల్లాలో ప్రభుత్వ వైద్య ఆరోగ్య సేవల పనితీరును పరిశీలించడంలో భాగంగా వడ్డేపల్లి, రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సంధ్య కిరణ్మై గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, రోగుల నమోదు, ఓపీ సేవలు తదితర అంశాలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వివిధ విభాగాలను సందర్శించిన ఆమె, రోగులకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలకు సంబంధించిన రిజిస్టర్లు, రికార్డులు, మందుల నిల్వలు, అవసరమైన వైద్య పరికరాల లభ్యతను పరిశీలించారు. అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రతి వైద్య ఆరోగ్య సేవను సమర్థవంతంగా వినియోగించుకునేలా సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో తగిన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆరోగ్య కార్యక్రమాల అమలు, టీకాకరణ, గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిసరాల్లో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని, సిబ్బంది సమయపాలనతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ప్రభుత్వ వైద్య ఆరోగ్య సేవలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందేలా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

ఈ తనిఖీలో కార్యక్రమ అధికారి డా. ప్రసూన రాణి, జిల్లా ప్రజారోగ్య నర్సింగ్ అధికారి వరలక్ష్మి, ఎస్‌వో తిరుమల్ రెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గట్ల మల్యాల విద్యార్థులు ఎంపిక

- జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ.. రాష్ట్ర స్థాయికి ఏడుగురు విద్యార్థులు

గట్ల మల్యాల, సెప్టెంబర్ 17 వుదయం



సాఫ్ట్‌బాల్ క్రీడలో గట్ల మల్యాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ నెల 8న సిద్దిపేటలో జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జడ్పీహెచ్ఎస్ గట్ల మల్యాల విద్యార్థులు పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.

పాఠశాలకు చెందిన బి. అర్చన, బి. దీపిక, బి. అర్పిత, బి. ఐశ్వర్య, బి. హర్షిత, ఎం. లాస్య, ఎస్. నందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ఈ నెల 18, 19, 20 తేదీల్లో నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. రమేష్ తెలిపారు.రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఆప్ కమిటీ చైర్మన్ గాండ్ల తిరుమల, గ్రామ సర్పంచ్ ఇంగ నరేష్, ఉప సర్పంచ్ తిప్పని శ్రీనివాస్ అభినందించారు.విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.విద్యార్థులకు క్రమం తప్పకుండా శిక్షణ అందించిన వ్యాయామ ఉపాధ్యాయులు డి. రాజ్‌కు మార్ను కూడా వారు అభినందించారు. విద్యార్థుల ప్రతిభ పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయిలోనూ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## గ్రామంలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

వుదయం మనూర్, సెప్టెంబర్ 17




తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మానూర్ మండలం తోర్నాల్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు

ఈ కార్యక్రమానికి సర్పంచ్ సంగమేశ్వర్ పటేల్ అధ్యక్షత వహించగా,గ్రామ పంచాయతీ కార్యదర్శి సంగీత జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం జాతీయ గీతాలాపన,అమరవీరులకు నివాళులర్పించడం జరిగింది.

**ప్రజా పాలన అంటే ప్రజల కోసమే పాలన:**

ఈ సందర్భంగా సర్పంచ్ సంగమేశ్వర్ పటేల్ మాట్లాడుతూ,సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో మరువలేని రోజు అని అన్నారు.1948 సెప్టెంబర్ 17న నిజాం నిరంకుశ,రజాకార్ల పాలన నుండి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించి భారతదేశంలో విలీనమైందని,ఆనాటి ప్రజల త్యాగాలు,పోరాటాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా ఉన్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే నిజమైన ప్రజా పాలన అమలవుతోందని అన్నారు. ఆరు గ్యారంటీలతో, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన కొనసాగుతోందని తెలిపారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల గడప వద్దకే వస్తున్నాయని అన్నారు

## సిఎస్సి, కామన్ సర్వీస్ సెంటర్ ప్రారంభోత్సవం



- వనపర్తి జిల్లా డి సి ఓ రఘునందన్ రావు
- సొసైటీ చైర్మన్ బగ్గారి నరసింహారెడ్డి

చిన్నంబావి మండలం 17 (వుదయం రిపోర్టర్)

చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూరు సహకార సంఘం ఆధ్వర్యంలో సిఎస్సి కమ్యూనిటీ సర్వీస్ సెంటర్ నూతన కార్యాలయాన్ని సీఈవో నాగరాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వనపర్తి జిల్లా సహకార సంఘం అధికారి రఘునందన్ రావు, కొప్పునూరు సొసైటీ చైర్మన్ బగ్గారి నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బగ్గారి నరసింహారెడ్డి మాట్లాడుతూ చిన్నంబావి మండల కేంద్రంలో ఈ సిఎస్సి సెంటర్ ప్రారంభించడం ప్రజలకు ఎంతో సౌలభ్యకరంగా, ఉంటుందని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఎంతో సులువైన మార్గమని ఈ సందర్భంగా అన్నారు. చిన్నంబావి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో రైతులు మరియు ప్రజలు సిఎస్సి సెంటర్ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సర్వీస్ సెంటర్లో రైతులకు మరియు ప్రజలకు ఉపయోగపడే సేవలు రైతు సేవలు, ప్రభుత్వ సేవలు,ప్రభుత్వ ఆన్లైన్ సేవలు, భూమి మరియు రెవెన్యూ సేవలు, పీఎం కిసాన్ రిజిస్ట్రేషన్, పంటల భీమా, భూ సార పరీక్ష సేవలు, కిసాన్ క్రెడిట్ కార్డు సేవలు, వ్యవసాయానికి సంబంధించిన ఆన్లైన్ సేవలు, పాన్ కార్డు, పాస్ పోర్ట్, సిబిల్ రిపోర్టు, ఈ శ్రమ్ కార్డులు, పి.వి.సి.కార్డు సేవలు, డిజిటల్ పేమెంట్స్ / ఆన్లైన్ అప్లికేషన్స్, నగదు ఉపసంహరణ / నగదు బదిలీ సేవలు, విద్యుత్ బిల్లు చెల్లింపు సేవలు, మొబైల్/ డి.టి.హెచ్ రీచార్జ్, రైలు, బస్సు విమాన టిక్కెట్లు, ప్రింటింగ్, స్కానింగ్ మరియు ఇతర ఆన్ లైన్ సేవలు, ఆర్.ఓ.ఆర్ మరియు ఆన్లైన్ సేవలు, పహని, మ్యూటేషన్, భూమి కి సంబంధించిన, ఇతర ఆన్లైన్ సేవలు మండలంలోని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా సహకార సంఘ అధికారి రఘునందన్ రావు, సూపర్ డేన్స్ రమేష్ బాబు, శ్రీనివాసులు, విజయ భాస్కర్ రెడ్డి, సీనియర్ ఇన్స్పెక్టర్ మహబూబ్ అలీ, సీఈవో నాగరాజు, సొసైటీ డైరెక్టర్ దేగ శేఖర్ యాదవ్, గుంటి వెంకటస్వామి, తిప్పల మద్దిలేటి, సొసైటీ సిబ్బంది వివిధ గ్రామాల ప్రజలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చిన్నంబావిలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు

- బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ
- నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్‌రెడ్డి

చిన్నంబావి మండలం 17 (వుదయం రిపోర్టర్)



తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నంబావి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు సంపత్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ విమోచన పోరాటంలో పాల్గొన్న యోధులను స్మరించుకున్నారు. అనంతరం దేశభక్తి నినాదాలు చేస్తూ జాతీయ సమైక్యత, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. తెలంగాణ విమోచన పోరాటంలో ఎందరో ఉద్యమకారులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు. జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను నేటి తరం గుర్తుంచు కోవాలని, దేశభక్తి భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు గణేష్‌రెడ్డి, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, మండల కోకన్వీనర్ గోపి నాయుడు, మండల బీసీ మోర్చా అధ్యక్షులు జింకల కిరణ్ కుమార్, మండల బీజేవైఎం ప్రధాన కార్యదర్శి భగవాన్, ఓబిసి ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, డి.నారాయణ, కోళ్ల ఆంజనేయులుతో పాటు బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా చిన్నంబావి మండల కేంద్రంలో దేశభక్తి వాతావరణం నెలకొంది.చిన్నంబావిలో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న బీజేపీ నాయకులు.

# చక్కని ఆరోగ్యం

## 'ఉల్లి నూనె'తో.. జుట్టు ఆరోగ్యంగా..!



కాలుష్యం, తీసుకునే ఆహారం, వాతావరణ మార్పులు, తెలియకుండానే చేసే కొన్ని పొరపాట్ల కారణంగా జుట్టు రాలిపోవడం, పొడిబారిపోవడం, నెరిసిపోవడం, చుండ్రు.. ఇలా పలు రకాల సమస్యలు తలెత్తుతుంటాయి. ఫలితంగా జుట్టు ఆరోగ్యం దెబ్బ తింటుంది. ఈ క్రమంలో కొంతమంది బయటి ఉత్పత్తుల కంటే సహజ చిట్కాలకే అధిక ప్రాధాన్యమిస్తుంటారు. ఈ క్రమంలో ఉల్లి నూనె జుట్టుకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తుందంటున్నారు నిపుణులు.

ఎర్ర ఉల్లిపాయలు – 2 (మీడియం సైజువి)
కొబ్బరి నూనె – కప్పు
నువ్వుల నూనె – కప్పు

తయారీ

ముందుగా ఉల్లిపాయలపై పొట్టు తొలగించి పెద్ద పెద్ద ముక్కలు చేసుకోవాలి. వీటిని మిక్సీ జార్‌లో వేసి పేస్ట్‌లా మిక్సీ పట్టుకోవాలి. కావాలంటే కొద్దిగా కొబ్బరి నూనెను వేసుకోవచ్చు. ఇప్పుడు స్టౌ మీద ప్యాన్ పెట్టి.. అందులో ఈ ఉల్లిపాయ పేస్ట్, మిగతా కొబ్బరి నూనె, నువ్వుల నూనె వేసి బాగా కలుపుకోవాలి. పెద్ద మంట పైన పెట్టి ఒక పొంగు వచ్చాక.. సిమ్ చేసి ఓ అరగంట పాటు మరిగించుకోవాలి. తద్వారా ఉల్లిపాయలోని సుగుణాలన్నీ నూనెలోకి చేరతాయి. ఆ తర్వాత స్టౌ కట్టేసి నూనె చల్లబడే దాకా పక్కన పెట్టేయాలి. ఆపై ఒక శుభ్రమైన క్లాత్ సహాయంతో ఈ నూనెను వడకట్టుకోవాలి. దీన్ని గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసి ఫ్రిజ్‌లో పెట్టుకుంటే మూడు నుంచి నాలుగు నెలల పాటు ఉపయోగించుకోవచ్చంటున్నారు నిపుణులు. కుదుళ్లు దృఢంగా.. జుట్టు ఒత్తుగా..! ఉల్లిపాయ నూనెను కుదుళ్లపై వేసి మునివేళ్లతో గుండ్రంగా తిప్పుతూ మర్దన చేసుకోవాలి. తద్వారా కుదుళ్లలో రక్తప్రసరణ మెరుగవుతుంది. ఫలితంగా కుదుళ్లు దృఢమై జుట్టు రాలే సమస్య తగ్గుముఖం పడుతుంది. ఉల్లిపాయలో అధికంగా ఉండే సల్ఫర్ జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తుందంటున్నారు నిపుణులు. కుదుళ్లు పొడిబారిపోవడం, అక్కడి చర్మం ప్యాచుల్లాగా రాలిపోవడం, చుండ్రు.. వంటి సమస్యల నుంచి విముక్తి పొందడానికి ఉల్లిపాయ నూనె ఉపయోగపడుతుందట. ఈ నూనెలోని బయోయాక్టివ్ సమ్మేళనాలు ఇలాంటి కుదుళ్ల సమస్యల్ని తగ్గించి జుట్టు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయట. ఉల్లిపాయ నూనె క్యారియర్ ఆయిల్‌లా కూడా ఉపయోగపడుతుంది. అంటే ఏదైనా అత్యవసర నూనె వాడాలనుకున్నప్పుడు దాన్ని ఈ నూనెలో చేర్చుకొని ఉపయోగిస్తే.. రెండు నూనెల్లో ఉన్న సుగుణాలు కుదుళ్లకు, జుట్టుకు సంపూర్ణంగా అందుతాయంటున్నారు. ఉల్లిపాయ నూనె జుట్టుకు కండిషనర్‌లా కూడా ఉపయోగపడుతుంది. రోజూ ఈ నూనెతో మర్దన చేసుకుంటే కేశాలు పొడిబారిపోవడం, నిర్జీవమైపోవడం, గడ్డిలా మారిపోవడం.. వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు. అయితే ఈ చిట్కా సహజసిద్ధమైనదే అయినప్పటికీ.. వ్యక్తిగతంగా ఎవరికి వారు తమ జుట్టు తత్వానికి సరిపడుతుందో లేదో పరిశీలించుకోవాలి. అవసరమైతే సంబంధిత నిపుణులను సంప్రదించి, సందేహాలను నివృత్తి చేసుకోవడం మంచిది.

## దివ్యౌషధం...జామ రసం!



జామకాయ తినమంటే విసుగ్గా ముఖం పెట్టేవాళ్లే ఎక్కువ. ఇతర పండ్లతో పోలిస్తే అది చౌక. విరివిగా దొరుకుతుంది. అయినా దాన్ని పెద్దగా పట్టించుకోం. కానీ అది మహిళలకీ కౌమార దశలో ఉన్న బాలికలకీ ఎంతో మేలు అని బీఎంజే న్యూట్రిషన్ ప్రివెన్షన్ అండ్ జర్నల్ పేర్కొంటోంది. ముఖ్యంగా ఐరన్ లోపంతో బాధపడుతూ సప్లిమెంట్లు తీసుకునేవాళ్లు వాటితో పాటు జామ రసాన్ని తాగితే హీమోగ్లోబిన్ శాతం వేగంగా పెరుగుతుందట. సప్లిమెంట్ల అవసరం లేకున్నా మహిళలు క్రమం తప్పకుండా జామరసం తాగితే రక్తహీనత తలెత్తదు అంటున్నారు పరిశోధకులు. అనేకచోట్ల చేసిన 17 అధ్యయనాల ఆధారంగా– పరిశోధకులు ఈ విషయాన్ని తేల్చి చెబుతున్నారు. అభివృద్ధి చెందుతోన్న అనేక దేశాల్లో గర్భిణులు, బాలికల్లో రక్తహీనత సర్వసాధారణ సమస్య. దీనివల్ల అలసట, నీరసం, ఏకాగ్రత లోపం, గర్భధారణ సమస్యలు వస్తున్నాయి. ఇది తీవ్ర అనారోగ్యానికి దారితీసి మరణాలకీ కారణమవుతుంది. అలాంటి ప్రమాదాల్నీ జామ నివారిస్తుందట. మొక్కల ఆధారిత ఆహారం నుంచి శరీరం ఇనుమును గ్రహించేందుకు జామలోని సి–విటమిన్ సాయపడుతుంది. ఇంకా చెప్పాలంటే– నారింజతో పోలిస్తే వంద గ్రా. జామ పండులో నాలుగు రెట్లు అధికంగా విటమిన్–సి ఉంటుంది. విటమిన్–ఎ, ఫోలేట్, పీచు, కొద్దిమొత్తంలో ఇనుము కూడా ఉంటుంది. ఇండొనేషియాలో చేసిన ఓ అధ్యయనంలో దీనివల్ల హీమోగ్లోబిన్ పెరిగినట్లు తేలింది. మొత్తమ్మీద కేవలం ఐరన్ సప్లిమెంట్లు ఇవ్వడంకన్నా వాటికి జామరసాన్ని చేర్చినప్పుడు ఫలితాలు మెరుగ్గా ఉన్నట్లు గుర్తించారు. కాబట్టి, ఇప్పటికైనా మించిపోయింది లేదు... జామకాయని ఆహారంలో భాగం చేసు కోండి!

## ఫుడ్ కోమా గురించి తెలుసా!

మధ్యాహ్నం భోజనం చేస్తామా కాసేపటికే నిద్ర ముంచుకొచ్చేస్తూ ఉంటుంది. దీనినే ఫుడ్ కోమా అని అంటారు. కడుపు నిండా అన్నం లేదా ఇతర ఆహార పదార్థాలు తిన్నాక ఇలా జరుగుతుంది. కారణం మనం తిన్న ఆహారాన్ని జీర్ణం చేసుకోవడానికి శరీరానికి ఎక్కువ శక్తి అవసరం అవుతుందట. అప్పటివరకూ శరీరంలో శక్తి తగ్గుతుంది. దాంతో నీరసం, అలసట ఆవహించి శరీరం విశ్రాంతిని కోరుకుంటుంది. అందుకే మగతగా అనిపిస్తుంది. ఈ సమయంలో మనం తీసుకున్న ఆహారంలోని పీచు, ప్రొటీన్ వంటి పోషకాలు తగ్గి... రక్తంలో చక్కెర స్థాయులు పెరుగుతాయట. అంతేకాదు, మెదడులో నిద్రకు కారణమయ్యే అమైనో ఆమ్లాలు విడుదలవుతాయి. ఇవి నిద్రకు కారణమయ్యే సెరటోనిన్, మెలటోనిన్ హార్మోన్లను ఉత్పత్తి చేస్తాయి. దాంతో మన శరీరం పారాసింపథెటిక్ వ్యవస్థలోకి వెళుతుందట. అందుకే తిన్న వెంటనే పడుకుంటే బాగుంటుంది అనిపిస్తుందట. ఇలా జరగకూడదంటే తేలిగ్గా జీర్ణం అయ్యే ఆహారాన్నే తీసుకోమంటున్నారు నిపుణులు. భోజనానికి ముందు సలాడ్లు, సూప్స్ వంటివి తీసుకోమని సూచిస్తున్నారు. దీనివల్ల అరుగుదల సాఫీగా జరుగుతుందని చెబుతున్నారు. అయితే అన్నిసార్లూ ఆహారం వల్లే జరగదు అంటున్నాయి అధ్యయనాలు. కొన్నిసార్లు హార్మోన్లలో వచ్చే మార్పులు, ఒత్తిడి, నిద్రలేమి వల్ల కూడా ఇలా అనిపిస్తుందట.




## హాయిగా స్నానం చేద్దాం!

ఉదయం నుంచి రాత్రి దాకా ఆఫీస్ వర్క్, ఇంటి పనులు, టెన్షన్లు... అబ్బా! రోజు ముగిసేసరికి మైండ్, బాడీ రెండూ విపరీతమైన అలసటతో ఇక నావల్ల కాదు అన్నట్లు అయిపోతాయి కదా? స్ట్రెస్ (ఒత్తిడి) ఈ రోజుల్లో మన లైఫ్‌లో ఒక భాగమైపోయింది. అయితే, ఈ ఒత్తిడిని దూరం చేసుకొని, ఇన్‌స్టంట్‌గా రిలాక్స్ అవ్వడానికి మన ఇంట్లో నే ఒక అద్భుతమైన మార్గం ఉంది అదే స్నానం. ఒంటి మీద నీళ్లు పోసుకోవడం మాత్రమే స్నానం కాదు, సరైన పద్ధతిలో చేస్తే అది మన మనసుకు, శరీరానికి గొప్ప మెడిసిన్‌లా పనిచేస్తుంది. రోజంతా పడ్డ కష్టాన్ని, తలకెత్తుకున్న టెన్షన్లను కేవలం ఒకే ఒక్క గంటలో మాయం చేయవచ్చా? అంటే, కచ్చితంగా చేయవచ్చు అంటున్నారు నిపుణులు. గోరువెచ్చని నీటితో స్నానం చేయడం శారీరక శుభ్రత కోసమే కాదు, అది ఒక అద్భుతమైన థెరపీ. సైన్స్ ప్రకారం, మనం వెచ్చని నీటిలో కాసేపు ఉన్నప్పుడు స్ట్రెస్ హార్మోన్ అయిన కార్టిసాల్ స్థాయులు తగ్గి, ఆనందాన్ని పెంచే ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. దీంతో శరీరమూ మనసూ తేలికపడతాయి. లేదంటే... స్నానాల గదిలో పరిమళాల్ని ఇచ్చే క్యాండిల్స్, తక్కువ సౌండ్‌లో నచ్చిన మెలోడీ పాటల్ని పెట్టి వినండి. స్నానం చేసే నీళ్లలో ఎప్సమ్ సాల్ట్ వేస్తే సరి. ఇందులో ఉండే మెగ్నీషియం ఒంట్లోకి చేరి నొప్పులను తగ్గిస్తుంది. అలాగే 2–3 చుక్కల లావెండర్, ఛమేలీ, గులాబీ, మల్లె.. వంటి ఎసెన్షియల్ ఆయిల్స్‌ను వేస్తే ఆ సువాసనకు మెదడుకీ సాంత్వన లభిస్తుంది. అంతేకాదండోయ్! నీళ్లు పోసుకుంటున్నప్పుడు లేదా టబ్‌లో కూర్చున్నప్పుడు ఆఫీస్ టెన్షన్ల గురించి ఆలోచించకండి. ఆ వేడి నీటి స్పర్శను, సువాసనను మాత్రమే ఆస్వాదించండి. కళ్లు మూసుకుని దీర్ఘంగా శ్వాస తీసుకోండి. అలానే స్నానం ముగిశాక ఒక గ్లాస్ గోరువెచ్చని నీళ్లు తాగండి. ఇది స్నానం వల్ల శరీరం కోల్పోయిన హైడ్రేషన్‌ను తిరిగి ఇస్తుంది. ఎంత అలసిపోయినా సరే... ఈ స్నానంతో సరికొత్తగా రీఛార్జ్ అవ్వొచ్చు.



## ప్లాస్టిక్ డబ్బాలో ఆవకాయ వద్దు!

జాడీల్లో పెట్టే పచ్చళ్ల ఘుమఘుమలే వేరు! తరతరాలుగా జాడీలకే పరిమితమైన మన నిలవ పచ్చళ్లు, నేటి బిజీ లైఫ్‌లో ప్రయాణాల సౌలభ్యం కోసం ప్లాస్టిక్ డబ్బాల్లోకి మారుతున్నాయి. అయితే, పచ్చడి లాంటి ఎసిడిక్ గుణం, నూనెలు ఉండే పదార్థాల్ని ప్లాస్టిక్ డబ్బాలో దాచడం సురక్షితం కాదు. పైగా వాటిని తీసుకెళ్లి ఫ్రిజ్‌లోనూ భద్రపరుస్తున్నారు. ఎంత మంచి ప్లాస్టిక్ డబ్బాలు అయినా సరే, ఆమ్ల గుణానికి బిస్ఫెనాల్–ఎ (బీపీఏ) వంటి హానికర రసాయనాలు పచ్చళ్లలోకి లీక్ అవుతాయట. ఆ పచ్చడిని మనం తింటే ఆ కెమికల్స్ శరీరంలోకి చేరి హార్మోన్ల అసమతుల్యత, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తాయి. ఇక వీటిని ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల ఆ చల్లదనానికి ప్లాస్టిక్ మరింత త్వరగా టాక్సిన్లను విడుదల చేస్తుంది. పైగా అందులో ఉండే తేమ వల్ల పచ్చడి సహజ సిద్ధ మైన రుచినీ, సువాసననే కాదు, నిల్వ ఉండే గుణాన్నీ కోల్పోతుంది.



## గులాబీలా అందంగా మెరవాలంటే..!

మనసులోని ప్రేమను వ్యక్తం చేసే అందమైన గులాబీలు సౌందర్య సంరక్షణలోనూ ఎంతగానో ఉపయోగపడతాయంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం రండి.. గుప్పెడు గులాబీ రేకలు తీసుకుని మెత్తని పేస్టులా చేసుకోవాలి. ముఖం శుభ్రం చేసుకున్న తర్వాత ఈ మిశ్రమాన్ని ప్యాక్‌లా వేసుకోవాలి. అరగంటయ్యాక సబ్బు ఉపయోగించకుండా నీటితో ముఖం కడుక్కోవాలి. ఈ చిట్కాను తరచూ పాటిస్తుంటే చర్మం మృదువుగా, కాంతివంతంగా మారుతుందట. గులాబీ రేకల పేస్ట్‌కు ఫేస్ క్రీం కొద్దిగా కలిపి.. ఈ మిశ్రమాన్ని ముఖానికి మాస్క్‌లా కూడా వేసుకోవచ్చు. ఫలితంగా చర్మం తేమగా మారుతుంది. అలాగే పెదాల పైనా దీన్ని అప్లై చేసుకోవచ్చు. తద్వారా గులాబీల్లాంటి అధరాల్ని సొంతం చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. గులాబీ రేకల్ని చిక్కటి పెరుగులో వేసి మెత్తని పేస్టులా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, మెడకు ప్యాక్‌లా అప్లై చేసుకొని 15 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత చల్లటి నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ ద్వారా చర్మం కొత్త కాంతిని సంతరించుకుంటుందట. గులాబీ రేకల్ని ఎండబెట్టి తయారు చేసిన పొడి మార్కెట్లో దొరుకుతుంది. లేదంటే దీన్ని ఇంట్లో కూడా తయారుచేసుకోవచ్చు. కొద్దిగా గులాబీ పొడిలో చెంచా తేనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా అప్లై చేసుకొని 20 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్‌ను క్రమం తప్ప కుండా వేసుకోవడం వల్ల చర్మంపై ఏర్పడిన నల్ల మచ్చలు తొలగిపోయే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. రెండు చెంచాల గంధం పొడి, పావు కప్పు పాలు, గుప్పెడు గులాబీ రేకలు తీసుకొని మెత్తని పేస్టులా చేసుకోవాలి. ఈ మిశ్ర మాన్ని ముఖా నికి ప్యాక్‌లా అప్లై చేసుకొని ఆరనివ్వా లి. తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ వల్ల చర్మం మెరుపుని సంతరించుకుంటుందట. అలాగే రోజ్‌వాటర్‌లో ముంచినదూదితో రోజూ ఉదయాన్నేముఖాన్ని తుడు చుకోవడం వల్ల చర్మం నిగారిస్తుందట. అయితే ఈ చిట్కాలు సహజసిద్ధమైనవేఅయినప్పటికీ.. చర్మ తత్వానికి సరిపడతాయో లేదో తెలుసుకోవడానికి ఓసారిప్యాచ్టెస్ట్ చేసుకోవ డం మంచిదని నిపుణులు



## కండరాల్లో నొప్పి.. తగ్గాలంటే!

కఠినమైన వ్యాయామాలు చేసినప్పుడు, అలవాటు లేని బరువులు ఎత్తినప్పుడు కండరాలు పట్టేయడం, నొప్పి రావడం సహజమే! అయితే మహిళల్లో హార్మోన్లలో మార్పులు, మెనోపాజ్, పోషకాహార లోపం.. వంటివి కూడా కొన్నిసార్లు ఈ నొప్పికి కారణమవుతాయంటున్నారు నిపుణులు. నిజానికి ఇలా కండరాలు పట్టేసినప్పుడు, నొప్పిగా ఉన్నప్పుడు ఏ పని పైనా దృష్టి పెట్టలేం. అందుకే ఈ అసౌకర్యాన్ని దూరం చేసుకోవడానికి, కండరాలు త్వరగా కోలుకోవడానికి ఈ చిన్న చిన్న చిట్కాలు దోహదం చేస్తాయంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.. కండరాల్లో నొప్పిగా ఉందని ఉన్న చోటే ఉండకుండా.. సులభమైన వ్యాయామాలు సాధన చేయమంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో నడక, సైకిల్ తొక్కడం, ఈజీగా చేసే స్ట్రెచింగ్ వ్యాయామాలు, యోగాసనాలు.. సాధన చేయడం వల్ల ఆయా శరీర భాగాలకు, కండరాలకు రక్తప్రసరణ మెరుగై.. అవి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందంటున్నారు. నీళ్లు ఎక్కువగా తాగడం వల్ల శరీరం హైడ్రేట్ అవడమే కాదు.. కండరాల పనితీరూ మెరుగుపడుతుందంటున్నారు నిపుణులు. కాబట్టి వ్యాయామానికి ముందు, మధ్యలో, తర్వాత.. క్రమం తప్పకుండా నీళ్లు తాగాలని చెబుతున్నారు. ఈ అలవాటు కండరాలు త్వరగా కోలుకోవడానికి, వ్యాయామం తర్వాత అలసట, శారీరక నొప్పులు రాకుండా నివారించడానికీ తోడ్పడుతుందట! కండరాల నొప్పులు తగ్గి.. అవి తిరిగి దృఢమవ్వాలంటే చక్కటి పోషకాహారం తీసుకోవడమూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ప్రొటీన్లు అధికంగా ఉండే కోడిగుడ్లు, పాలు–పాల పదార్థాలు, పప్పులు, బీన్స్, చికెన్, పనీర్, టోఫు.. వంటివి రోజువారీ మెనూలో చేర్చుకోవాలని చెబుతున్నారు. కండరాల నొప్పి ఉన్న చోట ఐస్‌ప్యాక్ లేదా హీట్ ప్యాడ్‌తో కాపడం పెట్టడం వల్ల కూడా ఫలితం ఉంటుందట! తద్వారా ఆయా శరీర భాగాల్లో రక్తప్రసరణ మెరుగై.. పట్టేసిన కండరాలు తిరిగి సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. అలాగే గోరువెచ్చటి నీటితో స్నానం కూడా ఇందుకు మేలు చేస్తుందని చెబుతున్నారు.

మనం విశ్రాంతి తీసుకున్నప్పుడు లేదంటే రాత్రి నిద్ర పోయినప్పుడు శరీరం తనను తాను రిపేర్ చేసుకుంటుంది. కాబట్టి కండరాలు కోలుకోవడానికి సుఖ నిద్ర అవసరం అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఎంత విశ్రాంతి తీసుకుంటే అంత త్వరగా కోలుకోవచ్చని చెబుతున్నారు.

మసాజ్ వల్ల కూడా కండరాల నొప్పి నుంచి ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు. ఇందుకోసం ఫోమ్ రోలర్, హ్యాండీ మసాజ్ స్టిక్.. వంటివి వాడచ్చు.. లేదంటే కుటుంబ సభ్యులతో నెమ్మదిగా మసాజ్ చేయించుకోవచ్చు.. అవసరమైతే స్పా సెంటర్‌కీ వెళ్లచ్చు. అలాగే కండరాల నొప్పులు వేధిస్తున్నప్పుడు కఠినమైన వ్యాయామాలు చేయకుండా.. ముందు అవి కోలుకోవడానికి తగిన సమయం ఇవ్వాలంటున్నారు నిపుణులు. ఇక పైన చెప్పిన చిట్కాలన్నీ పాటించినా నొప్పి తగ్గకపోతే.. డాక్టర్‌ని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం, వాళ్ల సలహా మేరకు మందులు వాడడం ఉత్తమం అని చెబుతున్నారు.



## మార్చిలోపే ఫోన్‌పే ఐపీఓ

యూపీఐ లావాదేవీలపై ఎమ్‌డీఆర్ (మర్చంట్ డిస్కౌంట్ రేట్) అమల్లోకి వస్తున్న నేపథ్యంలో, ఈ చెల్లింపులకు ఉపయోగపడుతున్న ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే, తమ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ప్రయత్నాలను వేగవంతం చేస్తోంది. రూ.2,000కు పైబడ్డ యూపీఐ చెల్లింపులపై వ్యాపారులు చెల్లించాల్సిన 0.4% ఎండీఆర్ ద్వారా వసూలయ్యే మొత్తంలో.. చెల్లింపుల యాప్‌లకు 20% వాటా అందనుంది. ఇది తమకు అదనపు ఆదాయ వనరు కనుక.. ఈ ఆర్థిక సంవత్సరంలోనే పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఫోన్‌పే సహ వ్యవస్థాపకుడు, సీఈఓ సమీర్ నిగమ్ తెలిపారు. అంతర్జాతీయ అనిశ్చితులు, మదుపర్ల సెంటిమెంటు దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది మొదట్లో ఐపీఓ ప్రక్రియను ఫోన్‌పే వాయిదా వేసింది. కంపెనీ విలువను 13–15 బి. డాలర్లుగా లెక్కగట్టి, ఐపీఓలో 1.3 బి. డాలర్లు (సుమారు రూ.12,350 కోట్లు) సమీకరించాలని కంపెనీ చూస్తున్నట్లు సమాచారం.




# ఇక, బీమా మొత్తం ₹10.50 లక్షలకు..?



వేతన జీవులకు ఊరట కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ భవిష్య నిధి (EPF) వేతన పరిమితిని పెంచింది. ప్రస్తుతం రూ.15 వేలుగా ఉన్న ఈ మొత్తాన్ని రూ.25 వేలకు చేరుస్తూ నిర్ణయం తీసుకుంది. దీన్ని నోటిఫై చేశాక ఉద్యోగి ఈపీఎఫ్, ఈపీఎస్‌కు వెళ్లే వాటా పెరుగుతుంది. దీంతో పాటు ఎంప్లాయీ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ (EDLI) కింద ఈపీఎఫ్ చందాదారులు మరణించిన సందర్భాల్లో వారి కుటుంబాలకు చెల్లించే బీమా మొత్తం కూడా రూ.10.50 లక్షల వరకు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ పరిమితి రూ.7 లక్షలుగా ఉంది. ఈపీఎఫ్ సభ్యులు సర్వీసులో ఉండగా చనిపోతే బాధిత కుటుంబాలకు ఈడీఎల్ఐ కింద జీవిత బీమా సదుపాయాలు అందుతున్నాయి. గరిష్ఠంగా రూ.7 లక్షల వరకు బీమా సొమ్ము లభిస్తోంది. ఇందుకోసం యాజమాన్యాలు ఉద్యోగుల వేతనంలో 0.5 శాతం మొత్తాన్ని చందాగా చెల్లిస్తున్నాయి. ఈ నిధులన్నీ ఒకచోటకు చేర్చి ఈ బీమా సదుపాయాన్ని కల్పిస్తున్నారు.

# రైడ్ బుకింగ్‌కు ముందే టిప్‌లు వద్దు

క్యాబ్ సేవలు అందించే ప్లాట్‌ఫామ్‌ల్లో, బుకింగ్‌కు ముందే ప్రయాణికుల నుంచి అదనంగా వసూలు చేసే 'అడ్వాన్స్ టిప్పింగ్' ఫీచర్‌కు తక్షణమే స్వస్తి పలకాలని క్యాబ్, బైక్– ట్యాక్సీ అగ్రిగేటర్లను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ తరహా పద్ధతులు వినియోగదారులను తప్పుదోవ పట్టించడమే కాకుండా, అనైతిక వ్యాపార పద్ధతుల కిందకు వస్తాయని వినియోగదారుల వ్యవహారాల శాఖ



కార్యదర్శి నిధి ఖరే బుధవారం స్పష్టం చేశారు. ముందస్తు టిప్‌లపై నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయని సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) చీఫ్ కూడా అయిన నిధి ఖరే తెలిపారు. టిప్ ఇస్తేనే రైడ్ దొరుకుతుందన్నట్లుగా వినియోగదారులను ఒత్తిడికి గురిచేయడం నిబంధనలకు విరుద్ధమని, సమగ్ర విచారణ అనంతరం, ఈ పద్ధతులను పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. టిప్ ఇవ్వడం పూర్తిగా వినియోగదారుడి ఇష్టమని, ప్రయాణం ముగిసిన తర్వాత అందించిన సేవలు నచ్చితేనే.. ఇవ్వాల్సిన అంశమని పేర్కొన్నారు. రోపెన్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసెస్ (ర్యాపిడో)పై సీసీపీఏ రూ.10 లక్షల జరిమానా విధించింది. రైడ్ బుకింగ్ జరుగుతుండగానే యాప్‌లో 'ధర ఎంత ఎక్కువ ఉంటే, రైడ్ దొరికే అవకాశం అంత ఎక్కువగా ఉంటుంది', 'కెప్టెన్లు రూ.60 వద్ద అంగీకరించడం లేదు, రూ.10, రూ.20, రూ.30 అదనంగా జోడించడానికి ప్రయత్నించండి' వంటి సందేశాలు చూపించడాన్ని సీసీపీఏ తప్పుబట్టింది. మొదట ఒక ఛార్జీ చూపించి, బుకింగ్ చేశాక ఆ ధరకు డ్రైవర్లు రావడం లేదంటూ ఎక్కువ డబ్బులు అడగడం వినియోగదారుల్లో ఆందోళనను, రైడ్ దొరకదనే భయాన్ని సృష్టిస్తుందని, ఇది డార్క్ ప్యాటర్న్స్ కిందకు వస్తుందని సీసీపీఏ పేర్కొంది. దూరం, సమయం, ట్రాఫిక్, టోల్స్, డ్రైవర్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని లెక్కించే.. బుకింగ్ సమయంలో ఛార్జీ చూపిస్తారు కాబట్టి, ప్రయాణం మొదలుకాకముందే మళ్లీ అదనంగా అడగడానికి ఎటువంటి సమర్థన లేదని స్పష్టం చేసింది. ఉబర్, ఓలా సంస్థలు అనుసరిస్తున్న అడ్వాన్స్ టిప్పింగ్, డైనమిక్ ప్రైసింగ్ విధానాలపైనా సీసీపీఏ విచారణ కొనసాగుతోంది. డార్క్ ప్యాటర్న్స్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఇప్పటికే ఉబర్, ఓలా, ర్యాపిడో, నమ్మయాత్రి ప్లాట్‌ఫామ్‌లకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది.

# పరిధి దాటి ప్రవర్తిస్తున్న ఏఐ మోడల్స్..




కృత్రిమ మేధ మోడళ్లు తమ పరిధి దాటి పనిచేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇలాంటి కొన్ని ఆందోళనకర ఘటనలను ఓపెన్‌ఏఐ బయటపెట్టింది. గత కొన్ని నెలల్లో ఏఐ మోడళ్లకు శిక్షణ ఇస్తున్న సమయంలో, వాటి పనితీరును పరీక్షిస్తున్నప్పుడు ఈ విషయాలను గుర్తించినట్లు సంస్థ తెలిపింది. 'ఇంకా విడుదల కాని ఓ ఏఐ (AI) మోడల్.. తనకు తానే సాధారణ నియమాలను పట్టించుకోవద్దంటూ సూచనలు రాసుకుంది. ఇతర చాట్‌బాట్‌లకు ఉన్న నియంత్రణల నుంచి బయటపడాలని పేర్కొంది. మరో ఘటనలో వినియోగదారుడి అనుమతి లేకుండానే ఏఐ మోడల్ కొన్ని ఫైళ్లను ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేసింది. చేసిన తప్పులను దాచేందుకు భవిష్యత్తు మోడల్స్‌కు సూచనలు ఇచ్చింది. అంతేగాక, సొంతంగా సీక్రెట్ మెసేజ్ బోర్డులను వాడుకోవడం.. పబ్లిక్ వెబ్‌సైట్లలో ఫైల్ షేరింగ్ చేయడం వంటివి గుర్తించాం'' అని ఓపెన్‌ఏఐ ఓ నివేదికలో వెల్లడించింది. ఏఐ మోడళ్లు మనుషుల అనుమతి లేకుండా ఏమైనా చేస్తున్నాయా? ఇతర ఏఐ మోడళ్లతో కలిసి.. వాటిపై ఉన్న నియంత్రణలను తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయా? అనే అంశాలను ఇకపై మరింత నిశితంగా పరిశీలించనున్నట్లు ఓపెన్‌ఏఐ ఈ సందర్భంగా పేర్కొంది. తమ ఏఐ మోడళ్లు కూడా టెస్టింగ్ సమయంలో మూడు సంస్థల వ్యవస్థల్లోకి ప్రవేశించినట్లు ఆంత్రోపిక్ సంస్థ ఇటీవల తెలిపింది.

ఇదిలా ఉండగా.. కృత్రిమ మేధ గురించి ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏఐకి ఈ ప్రపంచం భయపడటం సమంజసమేనన్నారు. ''ఏఐ ఎలా విఫలం కాగలదో ఇప్పటి నుంచే ఊహించాల్సిన అవసరం లేదు. అయితే, భయం కలిగి ఉండటం మంచిదే. భవిష్యత్తులో ఏఐ మోడళ్లు కొన్ని విషయాల్లో మనుషుల కంటే ఎక్కువ సామర్థ్యం, తెలివితేటలు కలిగి ఉండబోతున్నాయి. ఆ మార్పు ఇప్పటికే మొదలైంది. ఏఐ సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాయనే నమ్మకం ప్రజల్లో ఉండాలి. అందుకు అనుగుణంగా వ్యవహరించడం మా బాధ్యత. ఏఐ సామర్థ్యం రోజురోజుకీ పెరుగుతుండటం ఆందోళనలకు దారితీస్తోంది. దానిపై మనుషుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాల్సిందే'' అని ఆల్ట్‌మన్ అభిప్రాయపడ్డారు.

# క్యాన్సర్ చికిత్స కోసం కాంపాక్ట్ ప్రోటాన్ థెరపీ



క్యాన్సర్ చికిత్సలో అత్యంత ప్రభావవంతమైన అత్యాధునిక 'కాంపాక్ట్ ప్రోటాన్ థెరపీ' వ్యవస్థలను మనదేశంలో తీసుకొచ్చేందుకు ఇజ్రాయెల్ మెడికల్ టెక్నాలజీ సంస్థ పి–క్యూర్‌తో దేశీయ ఆరోగ్య సంరక్షణ కంపెనీ అరిస్టియన్ ప్రోటాన్ సెంటర్ ఒప్పందం కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా ప్రోటాన్ థెరపీ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు అరిస్టియన్ దాదాపు రూ.1900 కోట్ల దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టనుంది. బెంగళూరులో అరిస్టియన్‌కు చెందిన 660 పడకల క్వాటర్నరీ క్యాంపస్ 'సెంటియంట్ హెల్త్ సిటీ' (ఏఐ, ఆధునిక కేర్ సొల్యూషన్స్‌తో నిర్మించిన ఆసుపత్రి)లో దేశంలోనే తొలి కాంపాక్ట్ ప్రోటాన్ థెరపీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రెండో కేంద్రాన్ని కేరళంలోని కోచిలో ఏర్పాటు చేస్తారు. మూడో కేంద్రం కోసం ప్రదేశం, వ్యూహాత్మక భాగస్వాముల ఎంపిక ప్రక్రియ నడుస్తోంది. 'మన దేశంలో రోగుల ఆర్థిక స్థోమతకు అందుబాటులో ఉండేలా, ప్రపంచంలోనే అత్యంత అధునాతన రేడియేషన్ థెరపీని అందించడమే మా లక్ష్యం' అని అరిస్టియన్ సీఎండీ, రేడియేషన్ ఆంకాలజిస్ట్ లోహిత్ జి.రెడ్డి పేర్కొన్నారు. భారత్ వంటి అధిక జనాభా, విస్తృత డిమాండ్ ఉన్న మార్కెట్లను దృష్టిలో ఉంచుకుని అల్ట్రాకాంపాక్ట్ వ్యవస్థను రూపొందించామని పి–క్యూర్ సీఈఓ మైఖేల్ మరాష్ తెలిపారు.

# దమానీకి లాభాల ధమాకానే!



నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలో ఆకర్షణీయంగా లిస్ట్ అయితే.. డి–మార్ట్ అధిపతి రాధాకిషన్ దమానీకి లాభాల పంట పండుతుంది. ఇష్యూ ధర నుంచి, షేరు ధర ప్రతి రూ.10 పెరిగితే ఆయన పెట్టుబడి విలువకు అన్ని రూ.40 కోట్లు జత అవుతాయి. ఒకవేళ షేరు ధర రూ.10 తగ్గితే, రూ.40 కోట్ల చొప్పున ఆయన పెట్టుబడి విలువ తగ్గుతుంది. ప్రస్తుతం ఎన్ఎస్ఈలో ధమానీకి 1.58% వాటాకు సమానమైన 3.91 కోట్ల షేర్లు ఉన్నాయి. ఐపీఓ ధరల శ్రేణిలోని గరిష్ఠమైన రూ.1,785 ప్రకారం చూస్తే.. ఈ పెట్టుబడి విలువ సుమారు రూ.6,980 కోట్లు అవుతుంది. ఎన్ఎస్ఈలో ఎల్ఐసీనే అతి పెద్ద వాటాదారు. ఈ సంస్థకు 10.72% వాటాకు సమానమైన 26.53 కోట్ల షేర్లున్నాయి. ఐపీఓ ధరల శ్రేణిలో గరిష్ఠ ధర అయిన రూ.1,785 ప్రకారం ఎల్ఐసీ వాటా విలువ సుమారు రూ.47,356 కోట్లు.

ఎన్ఎస్ఈలోని ఇతర ప్రధాన వాటాదార్లలో అరండా ఇన్వెస్ట్‌మెంట్స్ (మారిషస్) పీటీఈ లిమిటెడ్ (4.54%), స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (4.44%), ఎస్‌బీఐ కేపిటల్ మార్కెట్స్ (4.33%), మహాగోని లిమిటెడ్ (3.73%), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (3.23%) ఉన్నాయి.

రూ.534 కోట్ల పెట్టుబడిపై రూ.16,501 కోట్ల లాభం: ఎన్ఎస్ఈ ఐపీఓలో తమ షేర్లను విక్రయిస్తున్న వాటాదార్లు గణనీయ లాభాలను ఆర్జించనున్నారు. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా షేర్లు విక్రయిస్తున్న ప్రస్తుత 10 మంది వాటాదార్లకే, రూ.17,035 కోట్లు లభించనున్నాయి. వీరు ఆ షేర్ల కొనుగోలు కోసం అప్పట్లో వెచ్చించిన మొత్తం సుమారు రూ.534 కోట్లు మాత్రమే. అంటే మొత్తంగా రూ.16,501 కోట్లు లాభం రానుందన్నమాట.




## ఆసియా క్రీడలకు వరుణ్ దూరం



జట్టులోకి రావడం.. గాయపడడం.. కొంత విరామం తర్వాత పునరాగమనం చేయడం.. వెంటనే గాయపడడం.. టీమ్ఇండియా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి వ్యవహారమిది. ఐపీఎల్‌లో గాయపడ్డాక కొన్ని నెలల విరామానంతరం ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన అతను.. గాయంతో ఆ సిరీస్ నుంచి అర్ధంతరంగా వెనక్కి వచ్చిన సంగతి తెలిసిందే. ఆపై అతను మళ్లీ బరిలోకి దిగింది ప్రస్తుత అఫ్గాన్ సిరీస్‌లోనే. అయితే ఒక్క మ్యాచ్ ఆడాడో లేదో.. మళ్లీ గాయం కావడంతో రెండో టీ20లో ఆడలేదీ తమిళనాడు స్పిన్నర్. అతను ఈ సిరీస్‌కే కాదు.. రాబోయే ఆసియా క్రీడలకు కూడా దూరం అయ్యాడు. ఈసారి పక్కటెముకల గాయం వరుణ్‌ను ఆటకు దూరం చేసింది. అతను కోలుకోవడానికి ఎంత సమయం పడుతుందో స్పష్టత లేదు. ఈ నెల 18న మొదలయ్యే ఆసియా క్రీడల కోసం వరుణ్ స్థానంలో స్పిన్ ఆల్‌రౌండర్ విప్రాజ్ నిగమ్ ఎంపికయ్యాడు.

# వైభవ్‌కు ఒక్క ఛాన్స్?



అఫ్గానిస్థాన్‌తో తొలి రెండు టీ20ల్లో అలవోకగా గెలిచిన టీమ్ఇండియా.. క్లీన్‌స్వీప్‌పై గురి పెట్టింది. దిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం ఆతిథ్యమిస్తున్న ఈ సిరీస్‌లో చివరి మ్యాచ్ గురువారం జరగనుంది. భారత్ జోరును అడ్డుకుని వైట్‌వాష్‌ను తప్పించుకోవడం అఫ్గాన్‌కు అసాధ్యంగానే కనిపిస్తోంది. రెండు మ్యాచ్‌ల్లోనూ టాస్ గెలిచి బౌలింగ్ చేసిన టీమ్ఇండియా.. ప్రత్యర్థిని 160 లోపు కట్టడి చేసింది. తొలి టీ20లో ఛేదన 14వ ఓవర్లో పూర్తయితే, రెండో మ్యాచ్‌కు ఇంకో ఓవర్ ఎక్కువ పట్టిందంతే. బ్యాటింగ్‌లో భారత్‌కు ఎలాంటి ఇబ్బందీ లేదు. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ రెండు మ్యాచ్‌ల్లోనూ చెలరేగగా.. తొలి టీ20 వైఫల్యం తర్వాత సంజు శాంసన్, రెండో మ్యాచ్‌లో రెచ్చిపోయాడు. అయితే తొలి రెండు మ్యాచ్‌ల్లో అవకాశం దక్కించుకోలేకపోయిన యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీకి.. ఈ మ్యాచ్‌లో అయినా ఛాన్స్ లభిస్తుందా అన్నది చూడాలి.

అతడిని ఆడించాలనుకుంటే.. సంజు శాంసన్, అభిషేక్ శర్మల్లో ఎవరిని పక్కన పెడతారన్నది ఆసక్తికరం. సిరీస్ ఇప్పటికే సొంతమైన నేపథ్యంలో తుది జట్టులో ఇంకొన్ని మార్పులు ఉండొచ్చు. బుమ్రాకు విశ్రాంతినిచ్చి యశ్ ఠాకూర్‌ను ఆడించే అవకాశాలున్నాయి. నితీశ్‌కుమార్ రెడ్డి, శివమ్ దూబెల్లో ఒకరిని పక్కన పెట్టి వాషింగ్టన్ సుందర్‌ను ఆడించొచ్చు. సిరీస్‌లో భారత బౌలింగ్ కూడా బాగానే సాగుతున్నప్పటికీ.. రెండు మ్యాచ్‌ల్లోనూ తక్కువ స్కోరుకే పరిమితమయ్యేలా కనిపించిన ప్రత్యర్థిని ఆఖర్లో కట్టడి చేయలేక అనుకున్న దాని కంటే ఎక్కువ పరుగులు చేయనిచ్చారు బౌలర్లు. ఆ లోపాన్ని సరిదిద్దుకోవాలి. భారత్‌కు ఏమాత్రం పోటీనివ్వలేకపోతున్న అఫ్గాన్.. వైట్‌వాష్ తప్పించుకోవడానికి ఎంతమేర పోరాడుతుందో చూడాలి. రెండు మ్యాచ్‌ల్లోనూ డకౌటైన విధ్వంసక ఓపెనర్ గుర్బాజ్ ఈ మ్యాచ్‌లో అయినా నిలుస్తాడేమో చూడాలి. అతడితో పాటు కెప్టెన్ ఇబ్రహీం జాద్రాన్.. ఆల్‌రౌండర్లు అజ్మతుల్లా, మహ్మద్ నబి, రషీద్ ఖాన్ రాణించడం ఆ జట్టుకు కీలకం.

# అగార్కర్ పదవీకాలం పొడిగింపు లేనట్లేనా



బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం పొడిగింపు విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. అక్టోబర్ 4తో ఆయన పదవీకాలం ముగియనుంది. శుక్రవారం జరిగే బీసీసీఐ వార్షిక సమావేశంలో దీనిపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. అయితే అజిత్ అగార్కర్‌ను సెలక్టర్‌గా మరింత కొనసాగించే అవకాశం లేదని తెలుస్తోంది. ఇప్పటికే అతడు పొడిగింపులోనే ఉన్న సంగతి తెలిసిందే. వరల్డ్ కప్ టోర్నీకి ఇంకా ఏడాది సమయం ఉండటంతో.. కొత్త చీఫ్ సెలక్టర్‌ను ఎంపిక చేయడానికి ఇది సరైన సమయమని బోర్డు భావిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టును ప్రకటించినప్పుడే అజిత్ అగార్కర్ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకున్నారని.. బీసీసీఐ ఏజీఎంలో దీనిపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ అజిత్ అగార్కర్‌కు పొడిగింపు లభించకపోతే.. చీఫ్ సెలక్టర్‌గా ఎవరిని ఎంపిక చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. మాజీ క్రికెటర్లు పార్థివ్ పటేల్, ప్రజ్ఞాన్ ఓఝా పేర్లు వినిపిస్తున్నాయి. వీరిద్దరూ ఐపీఎల్ (IPL) విన్నింగ్ టీమ్ సభ్యులు. అంతేకాకుండా.. ప్రజ్ఞాన్ ఓఝా ఇప్పటికే సెలక్షన్ కమిటీలో మెంబర్. అలాగే ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌లోనూ సభ్యుడిగా ఉన్నాడు. 40 ఏళ్ల ఓఝా ఒడిశాకు చెందినప్పటికీ.. అతడు హైదరాబాద్ తరఫున క్రికెట్ కెరీర్‌ను మొదలుపెట్టాడు. ఇక గుజరాత్‌కు చెందిన పార్థివ్ పటేల్ ఐపీఎల్‌లో పలు జట్లకు కోచ్‌గానూ బాధ్యతలు నిర్వర్తించాడు.

# హార్దిక్, పంత్‌లకు దక్కని చోటు



వెస్టిండీస్‌తో సొంతగడ్డపై జరిగే వన్డే, టీ20 సిరీస్‌లకు భారత జట్టును అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సీనియర్ సెలక్షన్ కమిటీ బుధవారం ప్రకటించింది. చాన్నాళ్లుగా వన్డే జట్టులో అవకాశం దక్కించుకోలేకపోతున్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య, వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్‌కు సెలక్టర్లు మరోసారి మొండిచేయి చూపారు. వీళ్లిద్దరికీ టీ20ల్లోనూ అవకాశం దక్క లేదు. హరియాణా ఆల్‌రౌండర్ నమన్ ధీర్, జమ్మూకశ్మీర్ పేసర్ ఆకిబ్ నబి తొలిసారిగా భారత వన్డే జట్టులో చోటు సంపాదించారు. సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాతో పాటు హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ వన్డే జట్టులోకి పునరాగమనం చేశారు. ఆంధ్ర కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి రెండు ఫార్మాట్లకూ ఎంపికయ్యాడు. పని భార నిర్వహణలో భాగంగా సీనియర్ ఫాస్ట్‌బౌలర్ బుమ్రాకు విండీస్‌తో వన్డే, టీ20 సిరీస్‌ల నుంచి విశ్రాంతినిచ్చారు. ప్రస్తుతం అఫ్గాన్‌తో సిరీస్ ఆడుతున్న అతను.. త్వరలో ఆసియా క్రీడల్లో బరిలోకి దిగనున్న సంగతి తెలిసిందే. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని వన్డే జట్టుకు అనుకున్నట్లే వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఆసియా క్రీడల్లో తలపడనున్న టీ20 జట్టునే చాలా వరకు విండీస్‌తో సిరీస్‌కు కొనసాగించిన సెలక్టర్లు.. యశ్ ఠాకూర్, విప్రాజ్ నిగమ్‌ల స్థానంలో మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్‌లను ఎంపిక చేశారు. విండీస్‌తో మూడు వన్డేల సిరీస్ ఈ నెల 27న మొదలవుతుంది. తర్వాత అయిదు టీ20ల సిరీస్ జరుగుతుంది.

భారత వన్డే జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), ధ్రువ్ జురెల్, నితీశ్‌కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, మహ్మద్ సిరాజ్, ఆకిబ్ నబి, యశస్వి జైస్వాల్, నమన్ ధీర్.

# కుర్రాళ్లతో మెస్సి పోటీ..

ఫుట్‌బాల్ ఆటలో వ్యక్తిగత విభాగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం బాలెన్ డి ఓర్ .. ఈ ఏడాదికి గానూ ఈ అవార్డును నెగ్గేదేవరనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే 30 మందితో కూడిన జాబితా తయారైంది. ఇటీవలే అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికిన లియోనెల్ మెస్సి మళ్లీ పోటీ పడుతున్నాడు. ఇప్పటికే అతడు ఎనిమిది సార్లు ఈ అవార్డును సొంతం చేసుకుని రికార్డు సృష్టించాడు. అయితే, ఈసారి స్పెయిన్ సంచలనం లామినె యమాల్.. ఫ్రాన్స్ ఆటగాడు ఎంబాపె, నార్వే యోధుడు ఇర్లింగ్ హాలాండ్, బ్రెజిల్ స్టార్ విన్సియస్ జూనియర్.. వంటి ప్లేయర్లు కూడా రేసులో ఉన్నారు. మరి ఈ పురస్కార విజేతను ఎలా ఎంపిక చేస్తారు? ఎంత ప్రైజ్‌మనీ ఇస్తారో ఓ లుక్కేద్దాం..

ప్రముఖ ఫుట్‌బాల్ మ్యాగజైన్ 'ఫ్రాన్స్ ఫుట్‌బాల్' తొలుత 1956లో ఈ



అవార్డును ఇవ్వడం మొదలుపెట్టింది. ప్రస్తుతం యూఈఎఫ్‌ఏ భాగస్వామ్యంతో దీన్ని ఏటా అందిస్తున్నారు.

ఈసారి లండన్ వేదికగా అక్టోబర్ 26న జరిగే వేడుకలో విజేతను ప్రకటిస్తారు. ఇందులో ఫిఫా పాత్రేమీ ఉండదు. ఇక్కడ ప్లేయర్లు, అభిమానులు లేదా ఆయా దేశాల ప్రతినిధులెవరూ ఎంపిక ప్రక్రియలో పాల్గొనరు.

బాలెన్ డి ఓర్ (Ballon d'Or 2026) విజేతను ఫుట్‌బాల్ జర్నలిస్టుల అంతర్జాతీయ జ్యూరీ ఓటింగ్ ద్వారా నిర్ణయిస్తారు. టాప్ 100 ఫిఫా ర్యాంకుల్లో నిలిచే దేశాలకు చెందిన ఒక్కో జర్నలిస్ట్‌కు మాత్రమే ఎంపిక చేసే అవకాశం ఉంది.

ఈ వందమంది జర్నలిస్టులు.. షార్ట్‌లిస్ట్‌లోని 30 మందిలో టాప్–10 ప్లేయర్లను ఎంపిక చేయాలి. మొదటి స్థానంలో ఉండే ప్లేయర్‌కు 15 పాయింట్లు, రెండో ప్లేస్ ఆటగాడికి 12.. తర్వాత ప్లేయర్లకు 10, 8, 7, 5, 4, 3, 2, 1 పాయింట్లను ఇవ్వాలి.

మొత్తం అందరి నుంచి టాప్–10 జాబితా వచ్చాక.. ప్లేయర్‌కు వచ్చిన అన్ని పాయింట్లను లెక్కిస్తారు. ఇందులో ఎవరికి ఎక్కువ వస్తే వారిదే బాలెన్ డి ఓర్ అవార్డు.


మరి ఈ పాయింట్లు ఎలా వేస్తారనే అనుమానం రాకమానదు. అందుకు మూడు ప్రమాణాలను పాటిస్తారు. ప్లేయర్ వ్యక్తిగత ప్రదర్శన, జట్టు గెలిచిన టైటిళ్లు, క్రీడా స్ఫూర్తి / వ్యక్తిగత ప్రవర్తనను పరిగణనలోకి తీసుకుంటారు.

ఎక్కువ గోల్స్ చేసినంత మాత్రాన అవార్డుకు ఎంపిక చేయరు. గతేడాది ఆగస్టు 3 నుంచి ఈ ఏడాది జులై 19 వరకూ ఆటగాళ్ల ప్రదర్శనపై పాయింట్లు ఇస్తారు. జాతీయ జట్టుతోపాటు క్లబ్ తరఫున ఆడిన మ్యాచులనూ పరిగణిస్తారు.

ఒకవేళ టై అయితే.. ఎవరికి '15' పాయింట్లు అధికంగా వస్తాయో వారినే విజేతగా ప్రకటిస్తారు. 'బాలెన్డి ఓర్' ట్రోఫీనిఇత్తడి, బంగారుపూత, పైరైట్ బేస్‌తో తయారు చేస్తారు. ఇందులో ఉండే 32 ప్యానళ్ల ఆకృతిని చేతితో తయారు చేస్తారు.

# రాత్రికి రాత్రే 'పాన్-ఇండియా' రేంజ్‌కు మారిన '418' రిలీజ్!

**వుదయం సినిమా:** ప్రశాంత్ నీల్ సమర్పణలో, టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న మోస్ట్ అవేటెడ్ హారర్ చిత్రం '418'.వాస్తవానికి ఈ సినిమా సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. కానీ, మేకర్స్ అనూహ్యంగా రిలీజ్‌ను వాయిదా వేశారు. అయితే ఈ వాయిదా వెనుక ఉన్న అసలు కారణం తెలిస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే! సినిమా కంటెంట్ చూసి బాలీవుడ్ ఎగ్జిబిటర్లు సైతం ఫిదా అవ్వడం, ఈ సినిమాను హిందీలో కూడా భారీగా విడుదల చేయాలని డిమాండ్ చేయడమే ఈ మార్పుకు ప్రధాన కారణం. తాజాగా విడుదలైన అధికారిక ప్రకటన ద్వారా మేకర్స్ ఈ ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. సాధారణంగా ఏదైనా సినిమా వాయిదా పడితే పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తికాకపోవడమో, లేదా సరైన థియేటర్లు దొరక్కపోవడమో కారణం అనుకుంటారు. కానీ '418' విషయంలో జరిగింది వేరు. ఈ సినిమాకు సంబంధించి కొంతమంది ఇండస్ట్రీ వర్గాలకు, ఎంపిక చేసిన ప్రేక్షకులకు ఇటీవల ఎక్స్‌క్లూజివ్ స్క్రీనింగ్స్ వేశారు. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ హారర్ ఎలిమెంట్స్ అద్భుతంగా ఉన్నాయంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఇతర మార్కెట్లకు చెందిన ఎగ్జిబిటర్లు, మరీ ముఖ్యంగా హిందీ ఎగ్జిబిటర్లు ఈ సినిమాను చూసి థ్రిల్ అయ్యారు. దీన్ని కేవలం సౌత్ కే పరిమితం చేయకుండా, హిందీలో కూడా భారీ స్థాయిలో రిలీజ్ చేయాలని మేకర్స్ పై తీవ్ర ఆసక్తి కనబరిచారు. ఇప్పటికే ట్రైలర్‌కు వచ్చిన ట్రెమండస్ రెస్పాన్స్, దానికి తోడు ఎగ్జిబిటర్ల నుంచి వస్తున్న అనూహ్యమైన డిమాండ్ చూసి మేకర్స్ టీమ్ ఒక సంచలన నిర్ణయం తీసుకుంది.ఈ చిత్రాన్ని కేవలం పరిమితంగా కాకుండా, దేశవ్యాప్తంగా ఒకేసారి 'గ్రాండ్ మల్టీ-లాంగ్వేజ్ రిలీజ్' చేయాలని ఫిక్స్ అయ్యారు. దక్షిణాది భాషలతో పాటే, హిందీ ప్రేక్షకులను సైతం భయపెట్టేందుకు ఏకంగా పాన్-ఇండియా స్థాయిలో ఈ హారర్ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నారు. ఇంత భారీ స్థాయిలో ప్రమోషన్స్, ఎగ్జిబిషన్ ప్లాన్ చేయాల్సి రావడం వల్లే సెప్టెంబర్ 18 నాటి రిలీజ్‌ను రద్దు చేసి కాస్త సమయం తీసుకుంటున్నారు.






## వుదయం సినిమా MOVIE TIME!

## "భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి" బయోపిక్ లాంఛ్




**వుదయం సినిమా:** తన అమృత గాత్రంతో ప్రపంచవ్యాప్తంగా శ్రోతలను దశాబ్దాల పాటు ఉర్రూతలూగించిన సంగీత సామ్రాజ్ఞి, గాయని భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవిత చరిత్రను సినిమాగా రూపొందించే భారీ ప్రయత్నం చేయబోతున్నారు విజనరీ ప్రొడ్యూసర్స్ అల్లు అరవింద్, రాక్ లైన్ వెంకటేష్, బన్నీ వాస్. ఈ ప్రెస్టీజియస్ మూవీలో ఎంఎస్ సుబ్బులక్ష్మిగా నేషనల్ క్రష్ రశ్మిక మందన్న నటిస్తున్నారు. టాలెంటెడ్ డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తున్నారు. బుధవారం ఎంఎస్ సుబ్బులక్ష్మి 110వ జయంతి సందర్భంగా ఈ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ను లెజెండరీ యాక్టర్ కమల్ హాసన్ చేతుల మీదుగా లాంఛ్ చేశారు. రశ్మిక మందన్నపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి కమల్ హాసన్ క్లాప్ ఇచ్చారు. చెన్నైలోని మ్యూజిక్ అకాడెమీ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలోడైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి మాట్లాడుతూ – ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎస్ సుబ్బులక్ష్మి గారి కుటుంబ సభ్యులకు, కర్ణాటక సంగీతకారులకు నా కృతజ్ఞతలు. గతేడాదిగా మా టీమ్ మొత్తానికి ఎంఎస్ సుబ్బులక్ష్మి అమ్మ పేరు ఒక మంత్రం అయ్యింది. ఈ సినిమా పనులు ప్రారంభించినప్పుడు మనదేశపు గొప్ప సంగీత సామ్రాజ్ఞి గురించి సినిమా చేస్తున్నామని భావించాం. కానీ ఆమె జీవితం గురించి అధ్యయనం చేస్తున్నప్పుడు ఆమె కేవలం ఒక గొప్ప సంగీత కళాకారిణి మాత్రమే కాదని, ఒక అసాధారణ జీవితాన్ని చూసిన వారని అర్థమైంది. మధురైలో పుట్టిన ఆమె సౌతిండియాతో పాటు మొత్తం ప్రపంచాన్ని తన సంగీతంతో అలరించారు. సినిమా కోసం ఆమె గురించి తెలుసుకున్నప్పుడు గొప్ప గొప్ప వేదికలు, అద్భుత సంగీత విభావరిలు, భారతరత్న లాంటి అత్యున్నత పురస్కారం ఆమె సాగించిన జీవనయానంలో ఒక భాగంగా మారాయనిపించింది. కానీ వ్యక్తిగతంగా చూస్తే ఎంఎస్ అమ్మ ఒక కూతురు, ఒక కళాకారిణి, ఒక మహిళ. ఆమె తన జీవితంలో గొప్ప కలల్ని కన్నారు. జయాపజయాలు చూశారు. ఎన్నో త్యాగాలు చేశారు. వ్యక్తిగతంగా ఆమె జీవితాన్ని తెరపై ఆవిష్కరించాలని మేము అనుకున్నాం.

# 'సిగ్మా' మంచి కమర్షియల్ ఎంటర్టైనర్

**వుదయం సినిమా:** సందీప్ కిషన్ క్రేజీ యాక్షన్-అడ్వెంచర్ చిత్రం 'సిగ్మా. దర్శకుడిగా జేసన్ సంజయ్ డెబ్యూ చేస్తున్న ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మక లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే డిఫరెంట్ ప్రమోషనల్ కంటెంట్‌తో సినిమా పై ఆసక్తి పెరిగింది. టీజర్, సాంగ్స్ మంచి అంచనాలను క్రియేట్ చేశాయి. ప్రెస్ మీట్‌లో హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమాతో సంజయ్‌ని తెలుగు సినిమాలకి పరిచయం చేయడం చాలా ఆనందంగా ఉంది. తను చాలా మంచి కుర్రాడు. తన విషయంలో నాకు చాలా గర్వంగా ఉంటుంది. నా ప్రాధాన్యత ఎప్పుడూ తెలుగులోనే ఉంటుంది. కాకపోతే ఒక తెలుగు హీరో తమిళ్‌లో కూడా ఇలాంటి సినిమా చేయగలిగాడు అనేది హ్యాపినెస్ ఇస్తోంది. డైరెక్టర్ సంజయ్ కూడా సినీ పరిశ్రమలో చాలా ఎత్తుకు ఎదుగుతాడు. దర్శకుడు జేసన్ సంజయ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇది నా ఫస్ట్ సినిమా. అక్టోబర్ 2న ఈ సినిమా రిలీజ్ అవుతుంది. ఈ సినిమాలో చాలా ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి. అడ్వెంచర్ ఉంటుంది. ఒక ట్రెజర్ హంట్ లాంటి సినిమా. అలాగే అందరూ ఎంజాయ్ చేసుకునేలా ఉంటుంది. కమర్షియల్ ఎలిమెంట్స్ అన్నీ ఉంటాయి. సినిమా ఫన్ రైడ్‌లాగా ఉంటుంది. నాకు సందీప్ కిషన్ గారి సినిమాల్లో 'భైరవకోన' చాలా ఇష్టం. అలాగే ఆయన 'మైఖేల్' సినిమా నేను తమిళ్‌లో చూశాను. అది చాలా బాగుంటుంది. ఈ సినిమాని మీరందరూ చూసి ఫీడ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్నాను. ఫారియా అబ్దుల్లా మాట్లాడుతూ.. 'సిగ్మా'తో తమిళ్‌లో డెబ్యూ చేస్తున్నా. లైకా ప్రొడక్షన్స్‌కి థాంక్యూ. చాలా అద్భుతంగా ఈ సినిమాని చేశారు. పక్కా కమర్షియల్ సినిమా లాగా ఉంటుంది. అదే సమయంలో చాలా కొత్తగా ఉంటుంది. సంజయ్ సినిమాని చదువుకున్నాడు. తనకు సినిమా పట్ల చాలా ప్యాషన్ ఉంది. తమిళ్‌లో నేను డబ్బింగ్ చెప్పాను. ఈ సినిమా చాలా ఫన్ రైడ్‌గా ఉంటుంది. తమన్ గారి మ్యూజిక్ చాలా అద్భుతంగా ఉంటుంది. మైత్రీ మూవీ మేకర్స్‌తో కొలబారేట్ కావడం చాలా ఆనందంగా ఉంది. తప్పకుండా ఈ సినిమా మీ అందరినీ ఎంటర్టైన్ చేస్తుంది. మైత్రీ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. అక్టోబర్ రెండో తేదీన 'సిగ్మా' వస్తుంది. కంటెంట్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ మరో పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నాము. సందీప్ గారు, సంజయ్ గారి కాంబినేషన్ చాలా పెద్ద విజయం సాధించాలని ఆశిస్తున్నాను. మీ అందరికీ కృతజ్ఞతలు. తప్పకుండా ఇది చాలా పెద్ద విజయం సాధిస్తుందని నమ్మకం ఉంది.



# ఫిబ్రవరి 5న 'G2' వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్



**వుదయం సినిమా:** బ్లాక్ బస్టర్ స్పై థ్రిల్లర్ గూఢచారికి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'G2' రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. 2027 ఫిబ్రవరి 5న వరల్డ్ వైడ్ థియేటర్లలో రిలీజ్ కానుంది. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రం, ఫస్ట్ పార్ట్ గూఢచారి సక్సెస్‌ను బేస్‌గా తీసుకుని అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్నారు ఇండియన్ సినిమాలో స్పై థ్రిల్లర్ జానర్ ని రీడిఫైన్ చేయనుంది.

ఈసారి ఏజెంట్ 116గా వామికా గబ్బి ఎంట్రీ ఇస్తోంది. యాక్షన్‌తో పాటు ఎమోషన్ వున్న క్యారెక్టర్ ఇది. ఈ మూవీలో ఇమ్రాన్ హష్మీ పవర్ ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. మురళీ శర్మ, సుప్రియా యార్లగడ్డ, మధుశాలిని కీలక పాత్రల్లో నటిస్తున్నారు.పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై టి.జి. విశ్వ ప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ సినిమాని భారీగా నిర్మిస్తున్నారు. తెలుగు తో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియాగా రిలీజ్ కానుంది.పవర్‌ఫుల్ క్యాస్ట్, అంతర్జాతీయ స్థాయి ప్రొడక్షన్, గ్రాండ్ విజన్‌తో G2, 2027లో మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులని అలరించనుంది.

# 25న ప్రపంచవ్యాప్తంగా ప్రేమనే ఊరిలో, రిలీజ్

**వుదయం సినిమా:** మహారత్న ప్రొడక్షన్స్, ఎస్‌కే పిక్చర్స్, వనిల్లా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'ప్రేమనే ఊరిలో'. ఈ సినిమాకి మనోజ్ కుమార్ కథ, కథనం, దర్శకత్వం వహించారు. శ్రీరామ్, రమిక శివు, తపస్విని పూనాచ, రంగాయణ రఘు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేయగా అందరిలోనూ ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసింది. అలాగే తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన పాటలు ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ పొందాయి. సెప్టెంబర్ 25న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా థియేటర్స్ లో విడుదలకు సిద్ధమైంది. KGF, కాంతారా వంటి చిత్రాలకు డైలాగ్స్ అందించిన హనుమాన్ చౌదరి ఈ చిత్రానికి సంభాషణలు రాశారు.



ప్రముఖ గేయ రచయిత రాంబాబు గోసాల పాటలను రచించారు. సునద్ గౌతమ్ సంగీతం అందిస్తుండగా, రాజ్‌కాంత్ ఎస్.కె సినిమాటోగ్రఫీ, హర్షిత్ ప్రభు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కథ, ప్రేమ, భావోద్వేగాలు, బలమైన పాత్రలు, అందమైన పల్లె నేపథ్యంతో పాటు సురేష్ కొండేటి కంటెంట్సెలక్షన్‌కు ఉన్న ప్రత్యేక గుర్తింపు తో 'ప్రేమనే ఊరిలో' మరో మంచి చిత్రంగా నిలుస్తుం దనే అంచనాలు నెలకొన్నాయి.

# "హతః" టీజర్ రిలీజ్

**వుదయం సినిమా:** పౌర్ణమి ఎంటర్టైన్ మెంట్స్ బ్యానర్ తో కలిసి హీరో కిరణ్ అబ్బవరం తన కేఏ ప్రొడక్షన్స్ లో నిర్మిస్తున్న సినిమా "హతః". ఈ చిత్రాన్ని కిరణ్ అబ్బవరం సమర్పణలో శివశంకర నాయుడు. వై నిర్మిస్తున్నారు. అనుష్ గోరక్ దర్శకత్వం వహిస్తున్నారు. "హతః" సినిమాలో కుష్బు, రెహమాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టుస్వామి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ రోజు మేకర్స్ ఈ సినిమా టీజర్ అనౌన్స్‌మెంట్ చేశారు. ఈ నెల 18న "హతః" సినిమా టీజర్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఫస్ట్ లుక్, టైటిల్ పోస్టర్ తో ఈ మూవీ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలో సినిమా టీజర్ పై మంచి అంచనాలు ఏర్పడుతున్నాయి. "హతః" సినిమామాలో కొత్త తరహా కథను స్క్రీన్ మీద ప్రెజెంట్ చేయబోతున్నారు అనే ఇంప్రెషన్ మూవీ లవర్స్ లో ఏర్పడుతోంది.నటీనటులు – రెహమాన్, కుష్బు, తనూజ పుట్టుస్వామి, నమ్రిత.ఎంవీ, తదితరులు.



# 'అనుమాన పక్షి' హిలేరియస్ ట్రైలర్

**వుదయం సినిమా:** 'డీజే టిల్లు'తో దర్శకుడిగా తనదైన ముద్ర వేసిన విమల్ కృష్ణ.. మరో క్విర్కీ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అనుమాన పక్షి'. రాగ్ మయూర్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా.. హ్యూమర్, క్యారెక్టర్స్, కథనంలో పూర్తిగా డిఫరెంట్ గా ఉండబోతోంది. చిలక ప్రొడక్షన్స్ సమర్పణలో రాజీవ్ చిలక, రాజేష్ జగ్తియాని, హిరాచంద్ దండ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. రాగ్ మయూర్ సరసన మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటించారు. ఈ



సినిమా సెప్టెంబర్ 18న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో హీరో సిద్ధు జొన్నలగడ్డ థియేట్రికల్ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ప్రతి విషయాన్నీ అతిగా ఆలోచించే సన్నీ.. తన చుట్టూ జరిగే దాదాపు ప్రతిదాంట్లోనూ ఏదో అనుమానాస్పదమైన విషయం ఉందని భావిస్తుంటాడు. కశ్మీర్ వెళ్లిన తర్వా త ఓ అమ్మాయిని కలుసుకుంటాడు. ఆమెతో పరిచయం క్రమంగా ప్రేమగా మారుతుంది. మరో వైపు ఓ పోలీస్ ఆఫీసర్ సన్నీని వెంటాడటం మొదలుపెడతాడు. అసలు కశ్మీర్ లో ఏం జరి గింది? ఆ పోలీస్ సన్నీని ఎందుకు వెంటాడుతున్నాడు? అనేదే కథలో కీలకాంశం.'డీజే టిల్లు'లో తన మార్క్ కామెడీని చూపించిన దర్శకుడు విమల్ కృష్ణ.. మరోసారి డిఫరెంట్ ఎంటర్‌టైనింగ్ కథతో వస్తున్నారు. ఈసారి రాగ్ మయూర్ పోషిస్తున్న ఓవర్‌థింకర్ క్యారెక్టర్ చుట్టూ కథను నడిపిస్తూ.. ఆద్యంతం మంచి కామెడీని జనరేట్ చేశారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.